సంపుటము 21
సంచిక 10

భారతి

తారణ, ఆశ్వయుజము
1944 అక్టోబరు

ఆహ్వానము

= శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం =

౧

గుప్పెడు దేహంబు కొండంత ధైర్యంబు
దౌర్బల్యబలముల దాల్చువాని
వైశ్యకులత్వంబు విత్తవైముఖ్యంబు
సహజభూషణములై చాలువాని
గార్హస్థ్యధర్మంబు కలితవటుత్వంబు
నేకమార్గము చరియించువాని
దోషంబుపై సేవ దోషిపై ననుకంప
కాఠిన్యమృదువయి గ్రాలువాని
సత్యశస్త్రప్రభేదసంజనిత వేద
నం బహింసామృతవిలేపనంబుచేత
మాన్పి యేడుపుమొగమున మలయు నవ్వు
కలుగజేసెడి వృద్ధుని కలియరండు.

౨

ఎవని భాషణములు చెవులు బ్రద్దలు సేయు
నబ్ధిఘోషంబు లన్యాయపరుల
కెవని మృదులపాదరవములు భూకంప
భీతిని పుట్టించు పిశునపరుల
కెవని యాగ్రహాదీప్తి మెరకన్నుపుట్టుట
దవవహ్ని సోకు డధర్మపరుల

కెవని యసత్యపాశవవిశసనములు
బృహదనృతంబుల బిల్కుమార్చు
నెవని స్వేచ్ఛ ప్రభువుల కనిష్టకరము
ఎవని బందీస్థితియు ననిష్టతరము
ఎవని మౌనంబు వ్యాఖ్యానకవిత బెంచు
నతని గాంధిమహాత్ముని జతకు రండు.

3

ఎవని జన్యాంగణ మింపైన హాస్యశాం
తరసంబులకు నాటస్థల మటంద్రు
ఎవని విక్రమకళానవనవస్ఫూర్తికి
హింస యసత్యంబు లింధనములు
ఎవని సంగ్రామంపు రవము లెసంగును
పరభామినులకు సౌభాగ్య మనుచు
ఎవని సంకులరణజవవేగమున స్వీయ
సైన్యముల్ మాత్రమే క్షతము దాల్చు
ఎవని పరదుర్గవిదళనప్రవణవీర
సుభటవర్గం బనాయుధభంగి దోచు
నపరకార్తికేయుండు సత్యాగ్రహుండు
గాంధిసేనాని శాంతిసంగరపినాకి.

౪

బ్రాహ్మణశ్వపచుల భావైక్యతను గాంచు
పండితత్వంబున బరగువాడు
పర్యంకసంస్థితవరవిలాసిని గాంచి
సర్పభయమున సంస్తంభితుండు
మూర్ధాభిషిక్తుల కర్ధవస్త్రీయుల
కనువుగా నభిగమ్యుడైనవాడు
లండను హేమంతరాత్రుల వెరవని
శీతాతపముల విశృంఖలుండు
ముగ్ధభక్తుండు పరతత్వమూలవేది
మానితాధునికుండు పౌరాణికుండు
పూర్వరాజానుగుడు నేడపూర్వవిప్ల
వంపు కొలిమిపై కమ్మరిపడుచువాడు.

శివకవుల పదములు

శాసనప్రయోగములు

= శ్రీ నిడదవోలు వేంకటరావు =

౧. దవనపున్నమ

పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్ర పురాతనప్రకరణమున మల్హణుని కథయందు వేశ్యమాత మల్హణునితోఁ జెప్పు మాటలలో —

"తరళాక్షి ముందటి దవసపున్నమను
పరిపిణిలోయిసి గురుకట్న మిచ్చె"

అని కలదు.[1] ఈపట్టున పుటయడుగున తమస, దవన యని పాఠాంతరములు చూపఁబడి మూలమున 'దవస' యను పాఠము చూపఁబడినది. కాని పాఠాంతరములలో నిచ్చిన 'దవన'యనునది సరియగు పాఠము. దవనపున్నమ యనఁగా చైత్రమాసపూర్ణిమ. కన్నడమున నీపున్నమికి 'దవనదహుణ్ణివె' యని పేరు. కర్ణాట దేశమున మనగోలిశాసనములఁ బ్రకటించుచు ఫ్లీటు దొరవా రీదవనపున్నమఁగూర్చి యిట్లు వ్రాసి యున్నారు :

The Month Chaitra - March April- The full moon is called Davanada hunnuve, because I am told on this day the people place the fragrant leaves of the davana plant on the images of God Mallikharjuna of Sri Saila.[2]

కర్ణాటదేశవ్యవహారము ననుసరించి ఫ్లీటు దొరవా రట్లు వ్రాసిన నాంధ్రదేశమునఁగూడ దవన పున్నమి యను వ్యవహార మున్నటు లీక్రింది దాక్షారామశాసనములవలనఁ దెలియనగుచున్నది : [3]

"శకవత్సర ౧౧౯౩ గు నేంటి శ్రీ మ(త్రి)భువనచక్రవర్తి శ్రీరాజాధిరాజదేవరవిజ(య)రాజ్యసంవత్సరంబులు ౫౯ గు క్రాహి (క్రో) ష్టమాసమున అమావాస్య మంగళవారమునాంటి సూర్యగ్రహణమునాండు దాక్షారామ శ్రీభీమేశ్వర శ్రీమహాదేవరకు దవనపున్నమనాంటి డోలోత్సవమునాంటి అవిబలి అచ్చనలకు ఒడ్డాదిఅర్జునదేవరాజుదేవి కొండికమున్నాం(టి) అ(డప) గడియనపెట్టి పేరపనేని కూంతురు అక్కాసాని నోముగా అర్జునదేవండు ధారాపూర్వ(కము)గా జేసి అచంద్రార్కస్థాయిగం బెట్టిన మడువాడ(ను) యూరుఒక్కండు."

పైశాసనము క్రీ. శ. ౧౨౭౧ నాఁటిది. దవనపున్నమనాఁటి యుత్సవమునకు నిచ్చిన దానగ్రామమును దెలుపుచున్నది.

మఱియొక శాసనము క్రీ. శ. ౧౨౭౩ నాఁటిది. అం దీవిషయ మింకను స్పష్టముగ నున్నది :[4]

---

1. పండితారాధ్యచరిత్రము - ఆంధ్రగ్రంథమాల ప్రకటితము. ప్రథమభాగము. పుట 360-361.

2. **Epigraphia Indica vol. V. No. , Inscriptions at Mangoli. Edited by J. F. Fleet. Page 11 and 12.**

మార్చి, ఏప్రియలు - చైత్రమాసము - ఇందు వచ్చు పూర్ణిమకు 'దవనదహుణ్ణివె'యని పేరు. ఈదినము శ్రీశైల మల్లికార్జునస్వామికి దవనము సమర్పించు దినముగాన దీని కీపేరు గలిగిన దని నాకు తెలియవచ్చినది. (భాషాంతరము).

3. **South Indian Inscriptions vol. IV. Draksharama Inscriptions No. 1378 Page 483.**

4. **Do. Do. No. 1368 Page 481.**

"స్వస్తిశకవరుషంబులు ౧౩౦౯ అగు నేంటి చైత్రశుద్ధదశమియు రవివారమునాండు ఒడ్డ(వా)ది మత్స్యకులతిలక అర్జునదేవరాజుల దేవి దాక్షారామ కొండిక మున్నాంటి ఆట్యగడియపసెట్టి వీరపసేని కూంతురు అక్కమదేవి శ్రీమద్దాక్షారామభీమేశ్వర మహాదేవరకు చైత్రదవనపర్వణమి డోలోత్సవము నాంటి హవిబల్యాది అర్చనకు ఒడ్డాదిలో పరిమలు వాడి ఊరు ఆచంద్రార్కస్థాయిగా శెట్టెను"

పై యుదాహృతులనుబట్టి యిది దవనపున్నమి యనియు, నది చైత్ర శుద్ధ పౌర్ణమి యనియుఁ దెలియు చున్నది.

కాకుళపుఁ దిర్నాళ్లవర్ణనమునఁ గ్రీడాభిరామములో (పుట ౬౫)

"దవనపున్నమ కాకుళాధ్యక్షుఁడైన
తెలుఁగురాయఁడు దేవతాధీశ్వరుండు
భువనహితముగ నుత్సవం బవధరింప
నందు పోయితి మీపోయినట్టి యేడు"
అని దవనపున్నమప్రయోగము కలదు.

కాని క్రీడాభిరామపీఠికలో (పుట ౧౦౪) 'కథాపాత్రమగు మంచెనశర్మ శ్రీకాకుళాంధ్రనాయక స్వామికి వైశాఖ పూర్ణిమనాఁడు జరుగు దవనోత్సవము నాఁటి శృంగారవిహారవిశేషములఁ జెప్పినాఁడు' అని కలదు. దీనికి ప్రమాణ మింకను కావలసియున్నది.

౨. నూలిపున్నమ

పైనుదహరించిన మల్హణచరిత్రయం దాసంద ర్భమునసే వేశ్యమాతపలుకులు

"నూలిపున్నమనాఁడు నూపురం బమ్మి
బాలభక్తుల కొప్పఁ బందువుసేసె"

ఇచట నూలిపున్నమ యనఁగా శ్రావణపౌర్ణమి. ఇది కర్ణాటదేశమున వ్యవహారమున నున్నట్లు కిట్టెలు దొరవారి కన్నడ నిఘంటువునఁ గలదు. (పుట ౮౯ కర్ణాటశాసనములలోను ప్రయుక్తము. కిట్టెలుదొరవారిట్లు వ్రాసియున్నారు:

Sravana-July, August. The full moon is called Nulu-Hunnuve because on this day the ceremony is annually performed of renewing the sacred thread Janivar and in Sanskrit Yajnopavita.

కర్ణాటదేశమున నూలుపున్నమ యని వ్యవహారమున్నను తెలుఁగుదేశమున 'జంధ్యాలపౌర్ణమి' యని దీనికి వ్యవహారము కలదు. జన్నిదమునకు (యజ్ఞోపవీతమునకు) నూలిపోచ అను నానుడి కలదు. భద్రకవి లింగకవి దేవాంగపురాణములో దీని నుపయోగించినాఁడు. గ్రంథావతారికలో—

"పట్టణంబైనట్టి పడవీటియందుఁ
గోమరైన దేవాంగకులము రక్షింప
రమణతో నెలకొన్న రామేశ్వరునకు
ప్రారంభమున నూలిపౌర్ణమినాఁడు
చారువైభవములు సకలోపచార
యుక్తంబు" 5

ఇచట నూలిపౌర్ణిమ యనునది మిశ్రసమాసము. భద్రకవి లింగకవి శైవుఁడు. శివకవుల మతమున నిట్టి సమాసములు సలక్షణములే. పై ప్రయోగమున 'పౌర్ణమి' యను శబ్దము యతిస్థానమునం దుండుటచే నిది వ్రాసితిని.

౩. సింహబృహస్పతి

పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణమున (౨౧౪ పుటలో) పరుసలనుగూర్చి చెప్పునప్పుడు—

"అడట సింహబృహస్పతిపరుస
గోదావరినిఁ గూడు కోలఁది చూచితిమి"

అని చెప్పఁబడినది. ఇచట గోదావరినిఁ గూడి నది పుష్కరసమయమున. బృహస్పతి సింహరాశియందు ప్రవేశించునపుడు పన్నెండేండ్ల కొకతూరి గోదావరికి పుష్కరము వచ్చును. బృహస్పతి యితరరాసులం

౫. ఈద్విపదకావ్య మముద్రితము. ప్రాచ్యలిఖిత పుస్తకభాండారము, ద్విపదకావ్యగ్రంథవివరణపట్టిక, నెం. 949 రు. నాల్గవసంపుటము పుట 1251.

దిక్లో ప్రవేశించునపుడు మఱికొన్ని నదులకు పుష్కరము గలుగును.6

ఈ గోదావరీపుష్కరములకు వేలకొలఁది ప్రజలు దేహధనవ్యయములను లెక్కింపక వచ్చుట యీనాఁడును మన కనుభవసిద్ధమైన విషయమే. ఈ గోదావరీపుష్కరమునకు సోమనాథుని కాలమునుండి ప్రజలు పలు తావులనుండి వెళ్లుచున్నట్లు మనకుఁ శైదానివలన చారిత్రకముగ తెలియుచున్నది.

మఱియు నీపుష్కరసమయము మహోపవిత్రమైన దగుటచే దానములు మొదలైనవి చేయఁబడును. ఒక దాక్షారామశాసనమున7 నీసింహబృహస్పతి గోదావరి పేర్కొనఁబడినది. ఆశాసనము కులోత్తుంగరాజేంద్రుని విజయరాజ్యవత్సరంబులు ౧౪-వ సంవత్సరము నాఁటిది.

"శ్రీ భీమేశ్వరమహాదేవర కిచ్చిన భూమి ఖ ౧ర ఇంద్ర సింహబృహస్పతి గోదావరిలోన ధారా పూర్వకముగా సేసి వాసమాధవభట్లకొడుకు మైలార భట్లకు"

ఇట్లే క్రీ. శ. ౧౧౫౦ నాఁటి దాక్షారామశాసనమునందు "సింహబృహస్పతియు విషువుసంక్రాంతి గోదావరీతీరమున ధారాపూర్వకముచేసి" అని కలదు.

---

6. బృహస్పతి మేషరాశియందు

	ప్రవేశించునపుడు		గంగానది
,,	కర్కాటక	,,	యమున
,,	సింహ	,,	గోదావరి
,,	కన్య	,,	కృష్ణ
,,	తులా	,,	కావేరి
,,	వృశ్చిక	,,	భీమరథి
,,	మకర	,,	తుంగభద్ర

నదులకు పుష్కరములు గలుగును. కావుననే కావేరీనదీమాహాత్మ్యము 'తులాకావేరీమాహాత్మ్య' మని చెప్పఁబడుచున్నది.

7. S. I. Inscriptions, Vol. IV. దాక్షారామశాసనములు, నెం. 1101,1104 పుట 368.

౪. కలుహారము - కలహారము - కల్హారము

నన్నిచోడమహాకవి కుమారసంభవమున (రెండవ భాగము పుట ౨౭ లో) సంస్కృత కహ్లార శబ్దమునకు బదులుగ

"జలజాతకైరవోత్పలకలహారాది
గంధంబు లోలి సద్గంధములుగ" (౯-౨౪౧)

అనియు, నందే ౨౪౯-వ పద్యమున (సీస పద్యము) నెత్తుగీతిలో—

"కమలమృదుబిసములు కల్హారకుముదోత్ప
లములఁ జెఱికికొని రయమున"

అనియు రెండుచోట్ల పైశబ్దమును ప్రయోగించి యున్నాఁడు.

ముద్రణమునం దిట్లున్నను, వ్రాఁతప్రతియందు రెండుచోట్లను 'కలుహార' అనియే కలదు. (చూ: కుమారసంభవము వ్రాఁతప్రతి—మదరాసువిశ్వవిద్యాలయ పుస్తక భాండారము) మొదటి యుదాహరణమున 'కలహార' పదము మార్చిన ఛందోభంగ మగును. రెండవ చోట ఆటవెలఁది గావున మార్చినను సరిపోవు నని యభిప్రాయముతో సంస్కర్త లిట్లు మార్చియుందురు. మొదటిదానినిబట్టి రెండవచోటకూడ నన్నిచోడ మహాకవి 'కలుహార'శబ్దమే యుపయోగించె నని యొన్న నగును. ప్రాచీనప్రయోగము లీరూపముననే నెలయుచున్నవి.

క్రీ. శ. ౧౧౩౯ (శ. స. ౧౦౬౧) నాఁటి నాదిండ్లశాసనములో

"మేరుగుణావతారుండగు
మేడనికిం గలుహారగన్ధి అం
భోరుహనేత్రి అన్వయవి
భూషణినాండగు మేడమాంబకును."

(శాసనపద్యమంజరి, ౧౫ పుట-నెం ౧౯ రు. శాసనము-3 వ పద్యము)

ఇచట వృత్తములో నీశబ్దము మాఱురూపు చెందిన ఛందోభంగ మగును,

మడికిసింగన పద్మపురాణములో (౧౧-౪౩) 'మురవైరిన్ గలుహారపంచకమునన్ బూజించి' అని కలుహారశబ్దమునే వాడియున్నాఁడు.

శాసనపద్యమంజరి పీఠికలో శబ్దలక్షణమునకు సంబంధించిన ప్రయోగవిశేషములలో (క) 'కల్హార గంధి యనుటకు బదులుగా కలుహారగంధి' (౫-౩) అని వ్రాయఁబడియున్నది. కలుహారశబ్ద మపశబ్ద మను భ్రాంతితో పీఠికాకారులు 'కలుహారగన్ధిని' కల్హార గన్ధిగా నుండవలెనని వ్రాసిరి. పై ప్రయోగములు ఛందోనిబద్ధములై మహాకవిప్రయుక్తములై యున్నపుడీ మార్పున కావశ్యకత లేదు.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు క్రొత్తగ వెలయించిన ద్విపద భారతమున—

"**కలహార** దళనేత్ర కడకంటి చూడ్కి
మొలసిముట్టినచిత్త ముత్తలపడఁగ" (పుట ౨౬౩.)

అని కలహారము ప్రయోగింపఁబడినది. ఈ శబ్దమును గూర్చి పీఠిక (33 పుట) లో నిట్లు వ్రాయఁబడినది:

"కల్హారము, అర్హము వీనిలో సంయుక్తవర్ణములు విడదీసి 'కలుహారము, అరహము' అనురీతి నీతఁడు ప్రయోగించినాఁడు." అని పై ప్రయోగములఁ జూపుచు "ఇట్టి సంయోగ శిథిలత మర్యాద, మరియాద మున్నగు పెక్కుతావులఁ గలదు. వీనిలో కలహార శబ్దము సిద్ధ సమాస మధ్యగత మగుటవలనను, ఇట్టి ప్రాసములు మరికొన్ని యీతని రచనమునఁ జూపట్టుట వలనను 'కల్హార' అను సంయుక్త రూపమే ముద్రణమునఁ జేర్పఁబడినది., రూపుమాయకుండ మూలపాఠమా పుట యడుగునఁ జూపఁబడినది."

పై ప్రయోగములఁ జూచిన తిమ్మకవి యొక్కఁడే కలుహార, లేక కలహార రూపమును ప్రయోగించె నని చెప్పుటకు వీలు లేదు కదా! మఱియును తిమ్మకవి రచనావిధానమున శైవకవిమతానుసారియే గావున నీ శబ్దమును ప్రయోగించుట సలక్షణమే.

ద్రావిడభాషాతత్త్వము ననుసరించి పద మధ్యమున సంయుక్తాక్షరము లుండవుగాన సంయోగశిథిలత తెలుఁగున సహజమే. సంస్కృతపదములు శిథిలోచ్చారణములవలన రూపాంతరముఁ జెందినవానిని శివకవులును, వారి ననుసరించి మఱికొందఱు కవులును గ్రంథములోఁ బ్రయోగించియే యున్నారు. అట్టివానినిఁ గూర్చి ప్రత్యేకముగ వ్రాయుదును. శిథిలరూపము కవి ప్రయోగించినంతమాత్రమున నది లక్షణవిరుద్ధము కానేరదు. ఆపై నది శబ్దముయొక్క చరిత్రను తెలిసికొనుటకు భాషాతత్త్వశాస్త్రజ్ఞులకుఁ దోడ్పడును. కావున కలహారశబ్దప్రయోగము సలక్షణమే.

తెలుఁగున ప్రాస కేవలము శబ్దాలంకారపరము గావున నిట్టి శిథిలరూపములు మార్చిన ప్రాసభంగ దోషము వాటిల్లును. నన్నిచోడ మహాకవి, పోతన, పాల్కురికి సోమనాథుఁడు, కస్తూరి రంగకవి మున్నగువా రిట్టి ప్రయోగములఁ గావించియేయున్నారు.[8] తిమ్మకవియు ప్రాచీనుల ననుసరించి యిట్టి ప్రాసములను వేసియున్నాఁడు. మచ్చునకు తిమ్మకవి—

"హరుసాద్భుతాక్రాంతులై కుమారకులు
శరగురు దోడ్కొని సరవినా చెందు."

(౨౬౦ పుట)

ఇచట 'హర్షాద్భుత' అని సంయుక్తమైన ప్రాసభంగ మగుచున్నది.

ఇఁక తిమ్మకవిప్రయోగమునందువలెనే ముందు చూపినవానియందు, అనఁగా నన్నెచోడ, మడికిసింగన కవుల ప్రయోగములందును, శాసనోదాహరణము నందును .నీ కలహారశబ్దము సమాసగతమై యున్నది కాని వ్యస్తముగ లేదు. కావున సంస్కృతమున కలుహారము, కలహారము అను రూపము లేకపోయినను నాంధ్రకవిప్రయోగముల ననుసరించి వీనిని తత్సమములుగ నెన్నవచ్చును.

---

8. మచ్చునకు—బర్హి అనుటకు బరుహి అని నన్నిచోడమహాకవి.

ఆకర్షణము అనుటకు ఆకరషణము అని పోతన మహాకవి.

ఐశ్వర్యము అనుటకు అయిసరియము అని కస్తూరిరంగకవి.

ఇఁక కల్హారము అను పదమునకుఁ బ్రయోగములం జూపెదను.

తాళ్లపాక పెదతిరుమలయ్యగారు తమ చక్రవాళమంజరియందును, సుదర్శనరగడయందును దీనిని 'కల్హార'మనియే ప్రయోగించియున్నారు. చక్రవాళమంజరి:

"మిసిమి కొండలు తమమీద కల్హార
హారముల్ ధరియించి యంబువుల్ చల్ల"

చక్రవాళమంజరియందలి నియమము ననుసరించి యీశబ్దము 'కల్హార'అని యుండవలెను. ముక్తపదగ్రస్తమును చక్రవాళమంజరిద్విపదయందు చివరపదమధ్యమున సంయుక్తాక్షరములలోఁ గ్రింద నేహల్లుండిన దానితోడనే తరువాతి పాదము మొదలిడవలెను. ఈనియమమున కాచక్రవాళమంజరియందే యొకయుదాహరణము చూపెదను.

"గంధహీమాంబుపంకరుహాకర్హార
పూరశైత్యముతోడఁ బొసఁగఁ బుష్పాదులు"

కావున తిరుమలయ్యగా రుపయోగించినది 'కల్హార'మేగాని 'కహ్లారము' కాదు.[9]

ఇట్లే సుదర్శనరగడయందు [10]

"కల్హారమాలికాధరచక్రము
సిల్హాధూమసంశ్లిష్టము చక్రము"

ఇచ్చటకూడ కల్హారశబ్దమే ప్రయుక్తమైనది. రెండింటికి రచయిత తిరుమలయ్యగారే. సిల్హమునకు కల్హారమునకువలె 'సిహ్ల'రూపము గలదు. కాని పైని చక్రవాళమంజరియుదాహృతినిబట్టి కల్హారరూపము నాతఁడు వాడెనని చెప్పనగును. మఱియు నివి తాటియాకులపైనిగాక రాగిరేకులపై శాసనములవలె చెక్కఁబడియున్నవి. ఆరీతిగనే ముద్రింపఁబడియున్నవి. కావున నిదియు కల్హారమే.

చెళ్లపిళ్ల నరసకవి తన యామినీపూర్ణతిలకావిలాసములో ప్రాసస్థానముననే ఈపదము వాడియున్నాఁడు.

"బిల్హణకవీంద్రుఁ డనె రా
టక్కల్హారప్రియసుధానికరములు నీభా
వ ల్హర్ష మొదవఁజేసెను
బల్హితముగ నీ కభీష్టఫల మొనరింతున్."

(ద్వితీయాశ్వాసము, 3౮ పుట. ౧౯౦౮ ముద్రణము)

అడిదము సూరకవి కవిసంశయవిచ్ఛేదమున కల్హారశబ్దమునకు 'కలువ' తద్భవరూప మని తద్భవతరంగమునఁ జెప్పియున్నాఁడు (3-౧౦). వైయాకరణపారిజాతమున నీశబ్దముగూర్చి యిట్లు వ్రాయఁబడినది:

"బ్రహ్మ, చిహ్నము, పూర్వాహ్ణము, జిహ్వ మున్నగు పదములందలి సంయోగములోని హకారము మొదటిదే యైనను నుచ్చారణమున రెండవదిగా వినఁబడుచున్నది. ఇట్టి యుచ్చారణవికృతి గలిగినను వీనిని తత్సమములని వ్యవహరించుటయే యాంధ్రవైయాకరణసంప్రదాయమైయున్నది.

ప్రాకృతభాషలో నిట్టి వికృతి సూత్రింపఁబడుటయు, నిట్టివానిని తద్భవములుగా నెన్నుటయుఁ బ్రసిద్ధమైయున్నది. 'హ్న, హ్ణ, హ్మ షు వలహాం స్థితి రూర్ధ్వ మ్' (ప్రాకృతప్రకాశము, 3-౮) ఆంధ్రమున 'హ్ల' అనుచోట 'ల్హ' అను రీతి గల యుచ్చారణము లేదు. కల్హారము అపశబ్దము, కహ్లారము సుశబ్దము." (పుట ౨౫.)

పైన వివరించిన కలుహార, కలహార, కల్హారశబ్దతత్త్వము పరీక్షించిన నాంధ్రమున 'ల్హ' అనురీతి గల యుచ్చారణము లేదనుట పొసఁగదు. మఱియు నింతమంది కవులచేఁ బ్రయుక్తమైనపు డది యపశబ్దమనుట యెట్లు? కల్హారము అను సంయుక్త 'ల్హ'కారోచ్చారణమే లేనిచో 'కలుహార' అను శిథిలరూప మెట్లేర్పడును? కలుహార అను శిథిలరూపము ౧౧-వ శతాబ్ద

9. **Minor works of Tallapakam poets-Annamacharya and his sons. T. T. Devastanam series Vol. I Page 17, 18.**


10. **Ibid Page 67.**

మునసే వాడుకలో నుండుటచే కల్హార మంతకుఁ బూర్వము నుండియు వాడుకలో నుండి యుండవలెను గదా. ప్రాకృతమంజరిలో

"వహ్నౌర్వ్యహ్లోతి కహ్లారం కల్హార మభిధీయతే
బ్రహ్మ బహ్మా మత స్తేషాం స్థితిరూర్ధ్వ మితీదృశీ."

అని యీ యుచ్చారణముఁ గూర్చి వివరింపఁబడినది. ప్రాకృతమునను పాలీ భాషలో నిట్టి వర్ణక్రమమే కలదు. ఇది ప్రాకృతసమ మనియు, తత్సమముగా తెలుఁగున ప్రవేశించె ననియు, నాంధ్రభాషా శాసనమున వ్రాయఁబడినది. (సంజ్ఞా పరిచ్ఛేదము పుట ౧౧.)

కావున ప్రాచీనాంధ్రభాషా సంప్రదాయము ననుసరించి కల్హార, కలుహార, కలహార శబ్దములు సలక్షణములే యనియు, నడిదము సూరకవి 'కలువ' శబ్దము కల్హార శబ్దమునకుఁ దద్భవమని చెప్పటచే నిది తత్సమమనియుఁ దెలియుచున్నది. కల్హారము కలుహారము, కలుహారం, కలుహ, కలువ అని రూపనిష్పత్తి యేర్పడవచ్చును. కాని 'కలువ' దేశ్య మని తెలుఁగు నైఘంటికుల యభిప్రాయము.



భీమేశ్వర పురాణము-కొన్ని స్థలవిశేషములు

= శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి =

శ్రీనాథకవిసార్వభౌముఁడు ప్రకృతిని సవిమర్శ దృష్టితో సందర్శించి, తత్తద్విశేషములను కవితారూపమున విలక్షణరీతి నాపాదించి పాఠకులకెదుటఁ బెట్టును. సాధారణముగఁ దాను గని వినినవానినిఁ గూర్చికాని యాతఁ డించుకయుఁ బ్రసంగింపఁడు. కావుననే యాతఁడీలోకమును వీడి నేఁటి కైదుశతాబ్దులు గడచినను, నాయాపట్టులఁ జిత్రించిన ప్రాకృతిక దృశ్యములు నాఁడువోలె నేఁడును మన కనులకుఁ గన్పట్టును. భీమేశ్వరపురాణమునం దిట్టి ఘట్టములు పెక్కులు గలవు. కాని తత్తత్స్థలానభిజ్ఞతచే నవి యించుక మఱుఁగువడియుఁ, దాఱుమాఱుపడియు నున్నవి. భీమమండలియందలి క్షేత్రములు, తీర్థములు, లింగములు కొన్ని శ్రీనాథుని కాలమున కెట్లున్నవో నేఁటికిని నట్టి నామరూపములతో వ్యవహరింపఁబడుచు నటులనే యున్నవి. కొన్నిమాత్రము మఱుఁగువడియున్నవి. ఆయాస్థలవిశేషవిదులకుఁగాని తెలియఁగరాని యంశము లెన్నియో యిందిమిడియున్నవి. అట్లగుటచే నీగ్రంథమునఁ బలుతావుల స్ఖాలిత్యములు నుపలబ్ధము లగుచున్నవి. నేనును జిన్ననాఁటనుండియు నీమండలమునఁ బుట్టిపెరిగినవాఁడ నగుటను, గొన్ని స్థలవిశేషములతోఁ బరిచయము గలవాఁడ నగుటను, శ్రీనాథుని కవితయనిన మిక్కుటమగు నాదరము గలవాఁడనగుటను ఈవఱకు నాకుఁ దెలిసినట్టియు, నీనడుమఁ బరిశ్రమించి తెలిసికొనినట్టియుఁ గొన్నివిషయవిశేషములను బాఠకుల కెఱింగించుచున్నాఁడను. భీమమండలి నెన్నఁడుఁ బరికింపని యాంధ్రభాషోపాసకుల నుద్దేశించియే నే నీవ్యాసము వ్రాయ మొదలిడినాఁడను.

"త్ర్యంబకాచలశిఖాగ్రంబునం దుదయించి
పాదలి యార్యావర్తభూమిఁ దరిసి
మలఁగి దండకవనీమధ్యభాగమున నా
ప్రస్రవణాచలప్రస్థ మెరసి
పట్టిసశ్రీవీరభద్రేశు సేవించి
తీరసోమేశు మందిరము దాసి
యేచి యనంతభోగేశ్వరస్థానంబు
రుద్రపాదములపైఁ ద్రోవగాఁగ
కోటిపల్లీశు కోమలాంఘ్రులకు మ్రొక్కి
కుండలాముఖతీర్థంబు గుస్తరించి
భీమమండలి దాపలఁ బెట్టుకొనుచు
గౌతమీగంగ లవణాబ్ధిఁ గౌఁగిలించె."

(భీమ. 3-౨౧)

త్ర్యంబకాచలము నాసికాక్షేత్రమునందలి పర్వతము; గోదావరిపుట్టిన చోటు. ప్రస్రవణాచలము పాపిడికొండ. గోదావరి ప్రవహించినపుడీకొండ పాపిడిపెట్టుగాఁ బగిలినదిగాన దానికాపే రేర్పడెను. నేఁ డాకొండను పాపికొండ యని వ్యవహరింతురు.

పట్టిసశ్రీవీరభద్రేశుఁడు:— పట్టిసము రాజమహేంద్రపురము (రాజమండ్రి)నకు ఉత్తరముగ ఆఱు క్రోసుల దూరమునఁ గలదు. అట నీవీరభద్రేశుఁడు నెలకొనియున్నాఁడు. ఈస్వామియాలయమున కిరు ప్రక్కల గౌతమి ప్రవహించినది. ఈచోటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రము. శివరాత్రినాఁడు పలువురు భక్తులీయీశుని దర్శింపఁబోవుదురు. ఆనాఁటి రాత్రి నలుజాములు నేఁటికి నీయీశుఁడు శ్రుతివచనములను వినుచుండును.

'తీరసోమేశు మందిరము దాపి' అనుచోట తాటి యాకులప్రతిలో 'తిలసోమనాథు మందిరము దాపి' అను పాఠము కలదు. కాశీఖండమునందును "పట్టిస శ్రీవీరభద్రేశు సేవించి, తిలసోమనాథు మందిరము దాసి" అనియే కలదు. కావున నిట నీపాఠమే గ్రాహ్యము. ఈ తిలసోమనాథుఁడు పట్టిసమునకుఁ గ్రిందుగ రెండుక్రోసుల దూరమున గోదావరీతీరమునఁ గల తాళ్లపూడియనుగ్రామమున వెలసియున్నాఁడు. చంద్రప్రతిష్ఠిత చ్ఛాయాలింగరూపుఁ డగుట సోమనాథుఁ డైనాఁడు. నేఁటి కాయీతని నచ్చటి వారు తిలసోమనాథుఁ డనియే వాకొందురు. ఇట్టి సోమేశ్వరు లీభీమమండలియెల్లలలో వేఱొక నల్గురు గలరు. దక్షారామమునకు దక్షిణముగ నాల్గు క్రోసుల దూరమున 'కోటిఫలి'యం దొక సోమేశ్వరుఁడును, అచటికి యోజనమాత్రమున ఇందుపల్లి యను గ్రామమున నొక సోమేశ్వరుఁడును (ఇందు ప్రతిష్ఠితుఁడైన యీతనితోఁ గూడినదగుటచేతనే యా గ్రామమునకు 'ఇందుపల్లి' యను పే రేర్పడెను: ఈ గ్రామము అమలాపురమున కొక క్రోసుదూరమునఁ గౌశికీనదీతీరమునఁ గలదు.), పశ్చిమముగ యోజనమాత్రమున పులుగుర్తయం దొక సోమేశ్వరుఁడును, తుల్యభాగానదీతీరమునఁ గల చోల్లంగియొద్ద నొక సోమేశుఁడును గలిసి నలుగురు. భీమనాథుని లింగము సూర్యప్రతిష్ఠిత మగుటచే పార్శ్వములందు పంచసోమేశ్వరు లుండుట సంభావితమే.

అనంతభోగేశ్వరస్థానము:—పై తిలసోమనాథు నావాసమగు తాళ్లపూడికి క్రోసుదూరము క్రిందుగ నున్నది. ఈవలకు నదీతీరమునందు వెలసియున్న యీ యనంతభోగేశ్వరుని యాలయము నదియందుఁ గూలి పోవుచుండఁ దీరవాసు లాస్వామిని సమీపమునఁ గల 'కుమారదేవ' మను గ్రామమునకుఁ గొంపోయిరి. నేఁటికి నాయనంతభోగేశ్వరుఁడు కుమారదేవముననే నెలకొనియున్నాఁడు. కల్యాణమంటపముమాత్రము గౌతమీతటమునందే యిప్పటికిని గలదు.

రుద్రపాదములు :— రాజరాజనరేంద్రనగరము నందలి కోటిలింగక్షేత్రమున కెదురుగ నున్న కొవ్వూరును గోపాదక్షేత్ర మందురు. గోవూరే కొవ్వూరయినది. రాజమహేంద్రపురమునకు రెండుక్రోసుల దూరమున ధవళగిరి (ధవళేశ్వరము)ని రామపాదక్షేత్ర మందురు. అక్కడ గౌతమీనదీతీరమున నగస్త్యేశ్వరుఁడు గలఁడు. కాని నేఁ డీతావులం దెక్కడను 'రుద్రపాదము'లను వ్యవహారముమాత్రము గానరాదు. పలివెలకొప్పేశ్వరాలయముమీఁది శాసనములం దొకచో "గవుతమీమహానదీతీరమందును మార్కండేశ్వర మృకండేశ్వరరుద్రపాదాలసన్నిధిని"* అని కానవచ్చుటచే నితరప్రమాణము లభింపనంతవఱకు రాజమంద్రిలోని మార్కండేయస్వామిచరణములనే రుద్రపాదములని యూహించెదను. నేఁటికిని గోదావరీప్రవాహము మిక్కుటమగునపు డాస్వామిచరణములు ప్రవాహముచేఁ బూజింపఁబడుచునేయుండును.

ఈచోటినుండియే గోదావరి శాఖోపశాఖలతో విభాగము నందినది. ప్రాఙ్ముఖముగఁ బ్రవహించిన శాఖనుండి యుపశాఖలుగ తుల్యభాగ, వృద్ధగౌతమి, ఆత్రేయి, భారద్వాజి, కౌంతేయికణ్వనదు లిరుప్రక్కలనుండి యుప్పతిల్లినవి. దక్షిణముగఁ బ్రవహించిన శాఖనుండి వసిష్ఠవైనతేయులు బయలుదేఱినవి.

కోటిపల్లి సోమేశుఁ డీభీమమండలిలో సుప్రసిద్ధుఁడు. ఇట శివరాత్రిని పెద్దయుత్సవము జరుగును. ఇక్కడనుండి యాఱుక్రోసులదూరమున వృద్ధగౌతమీతీరమందు కుండలేశ్వరుఁడు గలఁడు. ఆప్రదేశమును, అచటి తీర్థమును కుండలాముఖ మనఁదగును.

"నీరుకడఁ గోళ్లఁ గూడి మున్నీటేఁ గవయు
మొగులుబడి వాహినుల కెట్లు మెఱయవచ్చు
వార్ధు లేడింటికిని వలపువనితయైన
మంగళోత్సంగ గౌతమీగంగ యెదుర." (౩-౨౨)

ఈ పద్యమున నొక్కటియగు గౌతమి వార్ధులే డింటికిని వలపువనిత యను టెట్లను సంశయ మెందు పొడమెడు. గౌతమి సప్తశాఖలుగ వ్యుతి తూర్పుసముద్రమునఁ గలిసినదిగాన, నీప్రదేశాంతరస్థమగు సముద్రదేశమును ప్రత్యేకముగ లెక్కించిన వార్ధు లేడును,

* చూ: దక్షిణహిందుస్థానశాసనసంపుటము V No 114.

సప్తశాఖల సప్తరూపములఁ దాల్చిన గౌతమి యేకరూపగాన నాయేడువార్థులకును నీపె వలపువనితయు నగు. సప్తగోదావరీసాగరసంగమక్రమ మిది:

౧. తుల్యానదీసాగరసంగమము:—కాకినాడకు దక్షిణముగ క్రోసుదూరమున చొల్లంగి యను గ్రామము నొద్ద తుల్యాసంగమము. ఇట సోమేశ్వరుఁడు, ఆంజనేయస్వామి, గోపాలస్వామియుఁ గలరు.

౨. ఆత్రేయీనదీసాగరసంగమము:—చొల్లంగికి మూఁడుక్రోసుల దూరమున కోరంగి యను గ్రామమునొద్ద ఆత్రేయీసంగమము. ఇచటి యీశ్వరుఁడు కోరంగేశ్వరుఁడు.

౩-౪. భారద్వాజ్యంతర్భూతగౌతమీసాగర సంగమము:—కోరంగికి మూఁడు క్రోసుల దూరమునఁ గలదు. భారద్వాజి కొన్నితావుల స్వస్వరూపము తోడను గానవచ్చును. సముద్రగామినియైనపుడు గౌతమితోఁ గూడియే ప్రవిష్టయైనది. ఈస్థానమును తీర్థాల మొండి యందురు. ఇట గౌతమి, భారద్వాజి, రేవ, అహల్య, ఇంద్ర అను నైదుతీర్థములు గూడుటచే నీనామ మేర్పడినది. ఈచోట సముద్రమెల్ల వేళలను ఘుమఘుమారంభగంభీరఘోషములతోఁ దాండవించుచుండును. ఈక్షేత్రమునకుఁ బశ్చిమముగ రెండు క్రోసులదూరమున భైరవపాలెము గలదు. అట భైరవేశ్వరుఁడు నెలకొనియున్నాఁడు.

౫. వృద్ధగౌతమీసాగర సంగమము:— తీర్థాల మొండికి మూఁడుక్రోసుల దూరమున నీనదీసంగమము. ఇట వృద్ధేశ్వరుఁ డుండెడివాఁడని వినికిడి. నేఁ డాలయమును, లింగమును సముద్రపతితములు. ఈసంగమక్షేత్రమును బ్రహ్మసంవేద్య మందురు. బ్రహ్మేశ్వరుని లింగము గలదు. ఈచోటనే సంతానగోపాలేశ్వరుఁడును, అరిష్టమ్మ యను నమ్మవారును గలరు. సంతానప్రాప్తి నపేక్షించి యాత్రసలుపు స్త్రీలీస్వామి యెదుట నిద్రింతురు. వారలకు స్వప్నములు వచ్చునఁట. స్వప్నఫలము ననుసరించి సంతానఫలమును లభించు నందురు. ఈక్షేత్రము నిప్పుడు బ్రహ్మసమేధ్యమని వాడుదురు.

౬. కౌశికీనదీసాగరసంగమము:—బ్రహ్మసంవేద్యమునకు నాల్గుక్రోసుల దూరమునఁ గలదు. ఈసంగమక్షేత్రమును విష్ణుసంవేద్య మందురు. ఇట రామలింగేశ్వరస్వామి, లక్ష్మణస్వామియును గలరు.

౭. వసిష్ఠానదీసాగరసంగమము:—ఈసంగమస్థానమును అంతర్వేది యందురు. ఇట నీలకంఠేశ్వరుఁడు, నృసింహస్వామియుఁ గలరు. అతిప్రసిద్ధక్షేత్రము. మాఘశుక్లైకాదశి నీప్రాంతమువారు అంతర్వేదిఏకాదశి యని వాకొందురు. ఆసమయమున నిట పెద్ద యుత్సవము జరుగును.

గోదావరి సప్తశాఖల సముద్రునిఁ గౌఁగిలించిన యీపుణ్యతీర్థములఁ గ్రుంకులిడి, ఆయాతీర్థదేవతలకు నభిషేకాదులుసలుపుటను సప్తసాగరయాత్ర యందురు. ఈయాత్ర పుష్యబహుళఅమావాస్యతో నారంభమై మాఘశుద్ధఏకాదశితో ముగియును. భీమమండలీ వాస్తవ్యులును, ఇతరప్రాంతములనుండి వచ్చువారును పెక్కురు భక్తులు నేఁటికి నీయాత్ర సలుపుచుందురు.

శ్రీనాథుని భావనాశక్తివైశద్యముచే మంగళోత్తుంగయగు గౌతమీగంగయెదుర మిగిలిన నదులన్నియు మొగులుబడివాహినులును, నీటికోళ్లపై ప్రసరించినవి. మూలములో సామాన్యముగ—

"అన్యా స్తటిన్య శ్రీభీమమండలీభాసమానయా
గౌతమీగంగయా లోకే గౌరవేణ కథం సమాః"

అని వర్ణితమైయుండ నిట నఖండగౌరవము నాపాదించె నాకవి. మఱియు వార్థివీచీకలకలనిమగ్న హృదయుఁడై భావడోలికలఁ దనివితీఱ నూఁగులాడి పాఠకులసైతము నూఁగులాడించినాఁడు. ఆ దృశ్యము నించుక యరయుదము.

"జనమేజయారబ్ధసర్పాధ్వరాహూత
చక్షుశ్శ్రవస్సహస్రములఁ బోలి
బ్రహ్మాండమండలప్రాసాదసంభార
హరిమణిస్తంభసంహతు లనంగ
జంభారిదోస్స్తంభదంభోళిఖండితాం
జనశైలశిఖరశృంగములఁ బెనఁగి
సంహారసమయఝంఝామారుతోద్ధూత
కాలాంబువాహసంఘముల గెలిచి

యాడుచున్నవి తీంత్రిల్లి యంబరమునఁ
జేయుచున్నవి త్రిభువనాశ్లేషకంబు
నబ్జనాభుని తూఁగుటుయ్యలలు గంటె
వేనవేలు పయోరాశి వీచిఘటలు." (3-౧౨)

ఇంతియగాక అంబరపథమున వాయురథముపై భీమమండలిని పరిలంఘించుచు బ్రహ్మసంవేద్యమును దర్శించు మునివర్యులచే నీరీతి నుద్ఘోషింపఁజేసినాఁడు.

"కాశిం జచ్చినయంతఁగాని పడయం
గారాని కైవల్యమ
గ్లేశం బొనటు వేద్యనాయకునిచే
లీలాగతిం జేరు రా
రో శీఘ్రంబున మర్త్యులార! యను నా
రూపంబునన్ మ్రోయు నా
కాశాస్ఫాలన గౌతమీజలధి సం
గస్థానకల్లోలముల్." (3-౧౩)

వాయుపథమున నుండియే భీమమండలి నంతట నిండియున్న తీర్థక్షేత్రముల నుగ్గడించు ప్రౌఢి పరికింపఁ గడు రమ్యమై వెలయును. (3-౨౦)

"ఆంధ్రభూభువన మధ్యము పుండరీకంబు
సప్త గోదావరజలము తేనె
బ్రహ్మసంవేద్యాది బహుతీర్థములు రేకు
లకరులు చారుదివ్యస్థలములు
నాళంబు లవణాబ్ధి వేలావిభాగంబు
కల్యాణ భోగమోక్షములు తావి
దక్షవాటీ మహాస్థానంబు కర్ణిక
హంసంబు భీమనాయకుఁడు శివుఁడు
గౌతమీసింధు కౌంతేయ కణ్వనదులు
తుల్యభాగయు నేలేరు దుమ్మికోనలు
భువన సంభావ్యమైన యీపుణ్యభూమి
యనఘ సంసార తాపశాంత్యౌషధంబు."

ఈ పద్యమునఁ బద్మావయవములతోఁ బోల్చిన యంశము లన్నియుఁ జాలవఱకు సరిపడియున్నవి. గీతమునందుఁ బేర్కొనఁబడిన నదులును, పోల్చిన భాగములును మఱుఁగుపడియున్నవి. గౌతమీ సింధువనఁగా వృద్ధగౌతమి. ఈనది కోటిఫలి కెదురుగ నున్న తొత్తరమూడి యొద్ద మహాగౌతమినుండి విడివడి అమలాపురము తాలూకా గ్రామములను చుట్టి ప్రవహించిన నది. సాధారణముగ నదులనడుమఁ గల పల్లెలకు, భూప్రదేశములకు లంకలను వ్యవహారము ప్రసిద్ధము. అట్టి లంకలీ నదీతీరమునఁ బెక్కులు గలవు. శాన పిల్లంక, శానేలంక, గాడిలంక, పెదుర్లంక, గెద్దెర్లంక మున్నగు పేర్లతో నిప్పటివారు పరిసరగ్రామములను పేర్కొనుచున్నారు. ఈ నది యీ ప్రాంతమునకే బలుమెలికలు గలిగి ప్రవహించినది. తుదకు కుండలేశ్వరము దగ్గఱ భారద్వాజ్యంతర్భూత గౌతమితోఁ గలిసి సముద్రగామినియైనది. ప్రభుత్వమువారి లెక్కలలో దీనిని వృద్ధ 'గౌతమీ డ్రైను' అను వ్యవహారము నేఁటికిని గలదు.

కౌంతేయ మనఁగా పలివెల సమీపమున నున్న మందేశ్వర స్థానమున అఖండ గౌతమినుండి విడివడి, అమలాపురము తాలూకా గ్రామముల నన్నిటిని జుట్టి, విన్నసంవేద్యమున సముద్రగామి యైన నది. ఆ తీరవాసులందఱు నానదిని 'కౌశికి' యందురు. కౌంతేయ మను నామము గానరాదు. కాని పలివెల శాసనములో "కౌంతేయాఖ్యనదీతటే పలివెలాధీశస్య కొప్పేశితుః" * అని యుండుటచే దీనినే కౌంతేయ నని నేను గుర్తించినాను.

కణ్వనది గౌతమీనదినుండి విడివడి రామచంద్రపురము తాలూకా అంగర శేకి మున్నగు గ్రామముల మీఁదుగఁ బ్రవహించి ఆత్రేయీ నదితోఁ గలిసి సముద్రగామి యైనది. ఇప్పుడా విచ్ఛిన్నశాఖను 'శేకి డ్రైను' అని వ్యవహరింతురు. ఈ నడుమఁ గార్యవశమున శేకి గ్రామమున కేఁగినపు డచ్చటివారి నోట నాకస్మికముగ నూరిశైట నున్న మురుగుకాల్వ కణ్వనదియే యను మాట వింటిని. స్వయముగఁ బోయి యాశాఖను గాంచితిని. ఋషుల పెంకి శేకి యయినట్లు గడచినవారు చెప్పుచుండి రనియు వారి నోటనే వింటిని.

తుల్యభాగ రామచంద్రపురము కాకినాడ తాలూకాల గ్రామములలోఁ బ్రవహించినది. ఈనదీతీరమున

* దక్షిణ హిందూస్థాన శాసన సంపుటము, V. No. 113.

ముక్తీశ్వరుఁడు, హరిహరబ్రహ్మలు (పూర్వము), అగస్త్యేశ్వరుఁడు, సంగమేశ్వరుఁడు మున్నగు దేవతలు గలరు. అటనట విచ్ఛిన్నమైనను దన యస్తిత్వమును గోల్పోకయున్నది.

వీశేరు పెద్దాపురము తాలూకా గ్రామములఁ జుట్టి కుక్కుటేశ్వరు దర్శించి, చాళుక్యభీమేశ్వరు సేవించి తుల్యభాగతోఁ గలిసి సముద్రగామి యైనది. ఇటు లీనదీశాఖ లన్నియు నతివక్రములై భీమమండలినలు ప్రక్కల పెక్కు గ్రామములఁ జుట్టుముట్టియున్నవి. ఇట్టి యీనదులు దుమ్మికొనలఁట. పద్యమునందలి యే భాగమును దుమ్మికొనలందురో, వ్యుత్పత్త్యర్థ మేమో తెలియరాకున్నది. వ్రాఁతప్రతులం దిట 'తుమ్మికొనలు, దుంబికొనలు' అను పాఠములు గాన వచ్చుచున్నవి. తమ్మళమున 'తుంబి' యను పదమునకు తుమ్మెద యనునర్థ మున్నది. అట్లయినను తుమ్మెద కొన లన్న నించుకయు పొసఁగదు.

ఇఁక నీగీతమునకు మూలమగు సంస్కృత పురాణమున—

"గౌతమీసింధుకాంతేయకణ్వనద్యో జగన్నుతాః
ఏలాచ తుల్యభాగాచ మంజులారసముచ్చయః"

అని కలదు. మంజులారసముచ్చయః = పాఁచి కొనల సంపు. పాఁచి పద్మమునలు ప్రక్కల చుట్టి యుండుటగాన దుమ్మికొన లనఁగా పాఁచికొన లగు నేమో?

కుంభసంభవుఁడు పులినసంభవున కద్యైక్షేత్రముల నెఱిఁగించురీతి నించుక పరికింతము.

"అదె పట్టిసస్థాన మందుండు వీరభ
ద్రేశ్వరస్వామి యర్ధేందుమౌళి
అదె పుండరీకాద్రి యచట మార్కండేయు
నిలువేల్పు ముక్కంటి వెలసెఁ దొల్లి
అదె కుమారారామ మాహర్మ్యరేఖయు
చాళుక్యభీమేశు సదనవాటి
అదె కుక్కుటేశ్వరం బయ్యెపాంతము మేడ
హుంకారిణీదేవి యోలగంబు
వాఁడె మా యింటివేల్పు పల్వల పురమున
నుండు లింగంబు ఫణిరాజ కుండలుండు
సప్తమునిసింధు సంగమేశ్వరుఁడు వాఁడె
కుండలాముఖమదె మానికులవతంస!" (౩-౨౨౪)

పట్టిసస్థానము, నందలి వీరభద్రేశ్వరుఁడును ప్రసిద్ధులే. పుండరీకాద్రి యనఁగా పుష్కరగిరి. పుష్కర పుండరీక శబ్దములు పర్యాయపదములుగాన పుష్కరగిరి పుండరీకాద్రియైనది. రాజరాజ నరేంద్రుని కోట యీ పుష్కరగిరి మీఁదనే పూర్వము నెలకొనెను. గోదావరి మీఁదుగ ధూమశకటము పోవుట కేర్పఱచిన వంతెనకు దిగువ నారంభమునఁ గల ఘట్టమును నేఁటికి పుష్కరగిరి రేవు అనియే వాడుచుందురు. ఆ రేవునకుఁ గొలఁది దూరముననే యున్న హట్టమును కోటగుమ్మ మని వ్యవహరింతురు. ఈ ఘట్టమునకు దగ్గఱనే మార్కండేయస్వామి యాలయము గలదు.

చాళుక్యభీమేశ్వరుఁ డనఁగా సామర్లకోట (రైల్వేస్టేషను) కెదురుగఁ గన్పట్టు భీమేశ్వరుఁడు. ధూమశకటముపైఁ బయనించువారి కెల్లరకును నా భీమేశుని హర్మ్యరేఖలు గానవచ్చుచు నుండును. ఈయాలయమునకుఁ జేరియున్న గ్రామమును భీమవర మని వాకొందురు. ఈప్రాంతమును కుమారారామ మనుట నాఁటి శాసనములందుఁ బ్రసిద్ధమే.*

కుక్కుటేశ్వరం బనఁగా కుక్కుటేశ్వరుఁడు కుంతీమాధవస్వామి పీఠాంబిక (పురుహూతికాపీఠాధిదేవత) నెలకొనియున్న నేఁటి పిఠాపురము. హుంకారిణీదేవియోలగమమాత్రము నేఁడు గానరాదు. పల్వలపుర మన పలివెల. ఈయది దక్షారామమునకు మూఁడు యోజనముల దూరమున కౌశికీనదీతీరమున వెలసియున్నది. అచ్చట నెలకొనిన లింగము కొప్పులింగము. ఆదేవుని .కొప్పేశ్వరుఁ డందురు. శాసనములందును నీపేరనే వెలసియున్నాఁడు.† 'ఉండులింగంబు' అను చోట 'కొప్పులింగంబు' అనియే తాళపత్త్రప్రతిపాఠము. ఈతఁడు శ్రీనాథున కింటివేల్పఁట. ఈలింగము కొప్పు

* చూ: దక్షిణహిందుస్థానశాసన సంపుటము. V. No. 95.

† చూ: దక్షిణహిందుస్థాన శాసనసంపుటము. V. No. 105.

లింగ మగుట కాప్రాంతమున వ్యాపించియున్న యైతిహ్య మిట్లున్నది.

పూర్వము పలివెలప్రాంతమును పాలించు నొడయఁ డనుదినము స్వామి నలంకరింప మాలిక నంపుచుండెడువాఁడఁట. ఆస్వామికిఁ బరిచర్య సేయు పూజారి భక్తుఁడయ్యు వేశ్యాలోలుఁడగుటను నామాలిక తన చెలియాలికిఁ గొప్పులో ముడువ నిచ్చుచుండెడివాఁడఁట. ఈవేశ్యాలోలుపత్వము నా యొడయని కెఱుఁగింప, నాతఁ డొకప్పుడు పరీక్షింప వచ్చెనఁట. అప్పు డాపూజారి చెలియాలి వేనలినుండి మాలికను దెచ్చి ప్రభుహస్తమునం దీశ్వరనిర్మాల్యమని యర్పించెనఁట. అం దాపె తలవెండ్రుక దగుల్కొని యుండఁ జూచి పౌరులు తాము చెప్పిన విషయము సత్యమని బలపఱచిరఁట. కాని ప్రభు వాతని "నీమాల్యమునఁ గేశ ముండుటకుఁ గత మే"మని యడుగ, "మా స్వామికిఁ గొప్పు గలదు. అందలి దీవెండ్రుక"యని ప్రతివచన మొసఁగెనఁట. "అట్లైన మీస్వామికిఁ గొప్పును జూపించెదవా?"యని యొడయఁ డడుగ నట్లే యని సమ్మతించి, నాఁటి రాత్రి యంతయు నాలయమున నీశ్వరుని యెదుటఁ దన సంకటమును దెల్పి ప్రార్థించెనఁట. ఈశ్వరుఁడు నాతనియం దనుగ్రహయుక్తుఁడై కొప్పుదాల్చెనఁట. మఱునాఁటి యుదయమునఁ బ్రభువునకు లింగమునఁ గల కొప్పును జూపించెనఁట. అదియు నసత్యమేమో యని కొందఱు కేశము లొండురెండు నూడఁదీయ రక్తమును బ్రసరించెనఁట. అప్పుడు ప్రభువు మిగుల సంతసించి ఆపూజారి కొక గ్రామము నిచ్చెనఁట. ఆగ్రామమును నేఁడు జుత్తికపాడందురు. ఆగ్రామముపై సర్వాధికారములు నేఁటికిని నాపలివెలస్వామి నారాధించు పూజారివంశస్థులకే చెందియున్నవి. ఈజుత్తికపాడు వసిష్ఠానదీతీరమున పొడగట్లపల్లి యను గ్రామమునకు సమీపమునఁ గలదు. ఈపూజారివంశస్థులను, వారికీగ్రామాధికారము కలిగియుండుటను నేను బాగుగ నెఱుఁగుదును.

సప్తమునిసింధు సంగమేశ్వరుఁడు:—రామచంద్రపురము తాలూకా ఏడిదియను గ్రామమునకు సమీపమున 'సంగం' అను నొక గ్రామము గలదు. అచట సంగమేశ్వరుఁ డొండు గలఁడు. ఆతఁడే సప్తమునిసింధు సంగమేశ్వరుఁడు. ఇచటనుండియే తుల్యభాగానది ఓదూరుమీఁదుగా వార్ధిఁ గలయును. శ్రీనాథుఁడే మఱియొకచో నీసంగమేశ్వరు నిట్లు పేర్కొనినాఁడు:

"వ. అనంతరంబ కతిపయప్రయాణంబులఁ దుల్యభాగాతీరంబున—

చేతోమోద మెలర్పఁ గట్టెదురఁ గాం
చెన్ భారతామ్నాయవి
ద్యాతంత్రగ్రథనాబ్జసంభవుఁడు వే
దవ్యాసుఁ డభ్యర్హిత
జ్యోతిర్లింగమయస్వరూపుల జటా
జూటావనద్ధేందులన్
వాతాపిల్వలవైరి గౌతమనదీ
వాస్సంగమేశానులన్." (౨-౭౦.)

కుండలాముఖ మనఁగా కుండలేశ్వరము.

"తుల్యభాగాతటీద్రుమమండలంబైన
సాంపరాయపురంబుసరణిఁ బట్టి
చూతాటవీవాటిశోభమానంబైన
పులుగుర్తిసోమేశు వలపరించి
యోంకారపురిఁ ద్రికూటోపరిస్థితులైన
హరిహరబ్రహ్మల నభినుతించి
శిలామహాగ్రామసింహాసనస్థున
కురగహారున కెదురుండి మ్రొక్కి
యరుగువారు మునుల్ పరాశరసుతునకు
దక్షవాటిఁ బ్రవేశింపఁదగినయట్టి
శుభముహూర్తమునకుఁ గాలశుద్ధి దెలియఁ
దలఁచి కూర్చుండె నొక వివిక్తస్థలమున" (౩-౩౯)

తుల్యభాగాతీరమునఁ గల సాంపరాయపురమన సంపర. ఈ గ్రామము కాకినాడకు యోజనమాత్రదూరమునఁ గలదు. పులుగుర్తకు సమీపమున సోమేశ్వరుఁ డున్న గ్రామమును సోమేశ్వర మనియే యందురు.

'ఓంకారపురి' యనఁగా 'ఓదూరు' అని యీ వఱకే నిశ్చయించియున్నారు. హరిహరబ్రహ్మలు

ముప్పురును నేఁడు గానరారు. అక్కడివారి నడుగఁగా పూర్వముండెడివారని వినికిడి కలదనిరి. నేఁ డీశ్వ రాలయ మొక్కటియే కానవచ్చెడిని. విష్ణ్వాలయ మర్వాచీనముగఁ గట్టఁబడినదఁట. శిలామహాగ్రామ మనఁగా 'శిల' యని వ్యవహరింపఁబడెడి గ్రామము. ఆత్రేయీనదీతీరమున నెలకొనిన పుణ్యక్షేత్రము. ఈ గ్రామము దక్షారామమునకుఁ దూర్పుగ యోజనమాత్ర దూరమునఁ గలదు.

ఇంకను భీమమండలి నలుదిక్కులను నెలకొని మఱుఁగువడియున్న తీర్థములను, క్షేత్రములను నోపికతోఁ బరికించిన శ్రీనాథుని సూక్ష్మదర్శిత్వము, పరిశ్రమము మనకన్నులకుఁగట్టిన ట్లగును. ఆతఁడు తనివి తీఱక యీ భీమమండలిసౌభాగ్యము నిరుపమాన మని యొక పద్యమున నిట్లభివర్ణించియున్నాఁడు:

"ఎక్కడఁ జూచిన న్నరవి
యెక్కడఁ జూచినఁ బుష్పవాటికం
బెక్కడఁ జూచినం దటిని
యెక్కడఁ జూచిన దేవమందిరం
బెక్కడఁ జూచిన న్నదిమ
హీవలయంబున భీమమండలం
బెక్కడ యన్యమండలము
లెక్కడ భావనచేసిచూచినన్"(౩-౨౩)


శ్రీనాథుని కవితారహస్యం బెఱుఁగను, భీమ ఖండమునందలి విషయవిశేషము లెఱుఁగను భావనాబల మత్యధిక మపేక్షితమని యీతని గౌరవోక్తులే వెల్లడించుచున్నవి. గోదావరీనదీప్రార్థన మెంత హృదయంగమ మెఱ యరసిన శ్రీనాథుని భావనాబలము గోచరించెడు.

"విచ్చేయు మమ్మ శ్రీవృషభవాహనశిర
స్సామజకటమదాసారధార
పయనంబుగావమ్మ భర్గజటాటవీ
కుటజశాఖా శిఖాకోరకంబ
రావమ్మ యాదిమబ్రహ్మదోఃపల్లవ
స్థితకమండలుపుణ్యతీర్థజలమ
తేవమ్మ విశ్వంభరావధూటీకంఠ
తారమౌక్తికహారదామకంబ
తెరలతో వీచికలతోడఁ దరులతోడ
విమలడిండీరఖండతండములతోడ
మురువు తీవియు నామోదమును జవంబు
నడుపు నొప్పంగ గంగమ్మ నడువ వమ్మ."


(౪-౧౬౫)

గౌతమిని గంగమ్మ యనియు, భీమనాథుని భీమయ్య యనియు వాకొనఁ గల్గినంత చనవు, భక్తిభరమును శ్రీనాథునకే తగియున్నవి.





యుద్ధకాలపు వర్తకుని కల-౨



యుద్ధకాలపు వర్తకుని కల-౧

వీరవల్లడు

[ఆఖ్యాయిక]

= శ్రీ విశ్వనాథ సత్యనారాయణ =

౫

నేను తెల్లవారకముందే లేచి బయలుదేరాను. ఆ రాత్రే బ్రాహ్మణ అమ్మగారితో చెప్పేను "అమ్మా, తెల్లవారకముందే లేచిపోతాను. మీతో చెప్పేందుకు మీరు అప్పటికి లేవరు" అని. ప్రొద్దు పొడిచేవరకు చల్లగా ఉండి రాత్రి భోంచేయలేదని అనిపించలేదు గాని ప్రొద్దెక్కినకొద్దీ ఎండ చిటచిట లాడి తలమాడ్చినకొద్దీ కడుపులో బాధకూడా ఎక్కువైంది. మా దొర అంటూఉండేవాడు "కలికాలంలో మనుష్యులు అన్నం లేకపోతే చచ్చిపోతా"రని. ఆ పూర్వకాలాల్లో కొన్నాళ్లు భూమికలున్నన్నాళ్లు ప్రాణా లుండేవట; కొన్నాళ్లు చర్మం ఉన్నన్నాళ్లూ ఉండేవిట; కొన్నాళ్లు మాంసం ఉన్నన్నాళ్లు ఉండేవిట. ఇప్పు డన్నం ఉంటేనే ప్రాణం. నేను రాత్రి చెరువులో దిగి కాళ్లు కడుక్కున్నాగాని నాల్గు దోసెళ్లు నీళ్లయినా పుచ్చుకున్నా కాను. ఎందుకు పుచ్చుకోవాలి? పుచ్చుకుంటే మా దొరసానిగారు రానంటుందేమో. కొంతదూరం నడచినతర్వాత ఒక తంగేడుపుల్ల విరిచి నోట్లో పెట్టేను. అది నమలటం, ఉమ్మేయటం, పళ్లు తోముకోటం అన్నమాట. ఇదొక కాలక్షేపంగా బయలుదేరేను. కృష్ణ దగ్గరకు వెళ్లేటప్పటికి రెండు జాములు కావస్తోంది. నా దొర బ్రతికి ఉన్నప్పుడు ఈవూ రెన్నిసార్లు వచ్చానో. ఎప్పటి కప్పుడే క్రొత్త. దూరాన్నించి ఆ కృష్ణకరకట్ట చూడగానే గుండెలో ఏమిటో క్రొత్తగా ఉంటుంది. మా ఊళ్లో ఒక కొండాలేదు, ఒక నదీలేదు. ఒక అడవీ లేదు, ఒక పెద్ద విశాలమైన స్థలమూ లేదు. అన్నీ చేలు కాడిగట్లు. చిన్నప్పటినుంచీ అక్కడ పెరగటం మూలంగా కాబోలు ఓ పెద్ద నదిని చూచినా, కొండను చూచినా, ఒక అడవిని చూచినా ప్రాణం ఏమో తేలిపోతుంది. కృష్ణకరకట్ట ఎక్కేను. ఎక్కిచూస్తే పెద్ద యిసుక. దూరాన పెద్ద నీటిప్రవాహం. అదివరకంతా మూసుకొనున్న ఆకాశంఅల్లా ఒక్కసారిగా తెర పుడుపడ్డట్టుగా, కదించుకొని ఉన్న నేల బారలు వేసినట్లుగా, గుండె మనలోంచి వెళ్లిపోయి ఏదో పెద్ద గండభేరుండపక్షిఅంత అయినట్లుగా విచిత్రమైన విప్పారటం చేస్తుంది. మావూళ్లో చెరువునిండా నీళ్లు వస్తే తపకలుకొట్టుకొని కలకలలాడే నాచిన్నతనంలో మా ముసలిదొరగారి గొడ్లను ఆ చెరువులో దిగేసి వాటి వీపులమీద కూచొని చెరువంతా ఈదులాడేవాణ్ణి. నేను మొదటిసారి ఈకృష్ణ చూచినప్పుడు మాఊరి చెరువు లాక వెయ్యింటి నొక్కసారి చూచినట్లుంది. ఇవి పంటరోజులు. అందుచేత కృష్ణ ఆఒడ్డూ యీఒడ్డూ తెనాయించిలేదు. ఒక అరకోసెడు మేర అంతా యిసకపొరలేచిఉంది. కృష్ణపాయ అవతల ఒడ్డు నానుకొనిఉంటుంది. సముద్రానికి దగ్గరగనుక పాయ చాలా లోతు. నేను పూర్వం బళ్లు కట్టుకొని ఈవూ రొచ్చినప్పుడు బండి ఇసకలమీద వదలిపెట్టి ఎడ్ల తలతాళ్లు పట్టుకొని ఏట్లో దిగేసి పడవమీద కూర్చొని చాలాతడవలు వెళ్లేను. ఎన్నిసార్లు వెళ్లేనో అన్నిసార్లు ఈకృష్ణఅందం నాగుండెను తేల్చి వేస్తూనే ఉంది. మళ్లీ చూశాను. మళ్లీ అంతే. నా కెన్నేళ్లు వచ్చినా అంతే. చచ్చేదాకా అంతేనా? ఏముంది కృష్ణలో — ఈ ఇసకలో, ఈప్రవాహంలో? నామనస్సు నామనస్సులో లేదే. నేను నేను కాదే. నామీద కొండంత పని బరువుందే. ఇప్పటికి ఈ ఊరుకాని ఇంత నీళ్లు, ఇసక ఆకాశము చూస్తే ఏమిటి నామనస్సు పొందే అలజడి. నాగుండెని ఈశరీరంలో విడిపైరు

వేశారు. ఈగుండె ఈ నేను అనుకునే ఈ కోరడి దాటి పోలేకుండా ఉంది కాబోలు. పోయి, ఇంత విశాలమైన ఆకాశంలో తిరుగుదామని దీని ఉద్దేశం. చిలకని పంజరంలో పెడితే- దాన్ని చాలారోజులు పంజరంలో ఉంచిన తర్వాత దానిని వదిలిపెడితే, అది పల్టీలు కొడుతూ ఆకాశం అంతా తనదే నన్నట్టుగా, ఆకాశమే తను తనే ఆకాశం అన్నట్టుగా ఎగిరిపోతుందే. అల్లా ఉంటుంది నాగుండె; ఇంత కృష్ణను, ఇంత ఇసకను, ఇంత ఆకాశాన్ని చూస్తే. నేను ఈ సంతోషం అంతా పడుతూ నీటి ఒడ్డుకు వెళ్ళేసరికి ఎవరో బ్రాహ్మలు పడవలో ఉన్నారు. పడవవాడు మళ్లీ వస్తా నుండమన్నాడు. మళ్లీ వచ్చేటప్పటికి రెండు గడియలు పడుతుంది. ఈ లోపుగా ముఖం తొలిచాను. సరంగు ఈసారి నన్నెక్కించుకున్నాడు. కొత్తముఖాలు కనిపిస్తే వాడు కేవు అడుగుతాడు. నన్నడగలేదు. నేనిదివరకెన్నోసార్లు వెళ్లేనుకదూ. మా దొర అతని కెన్నోసార్లు ఎన్నో ఇచ్చాడు. మా దొరసానిగారు పుట్టిన ఊరు కృష్ణకు అవతలఒడ్డున అంటుకొనే ఉంది. ఊరిమొంగతలే చెరువుంది. దొరసాని చెరువులో స్నానంచేసి బిందెతో నీళ్లు పట్టుకొని ఇంటికి వెళ్తోంది. నన్ను చూడలేదు. నేను 'అమ్మా' అని పలకరించాను. ఆవిడ చూచి,నన్ను చూచినతొందరలో పడ్డ తొట్రుపాటులో బిందెలో ఒక పావువంతు నీళ్లు ఒంటినిండా వలకపోసుకుంది. "ఎందుకురా ఇలా వచ్చావు?" అంది. "మీకోసమే వచ్చాను. చెపుతాగా" అన్నాను. ఆవిడ నాతో మాట్లాడేనని ఆ బిందెడునీరు పారపోసి మళ్లీస్నానంచేసి నీళ్లుతెచ్చుకోపోయింది.మడిగట్టుకొని బ్రాహ్మలు మాతో మాట్లాడరుగా.మళ్లీ స్నానం చెయ్యకముందామె అందికదా, "ఒరే వల్లా, నీమొగం చూస్తే రెన్నాళ్ల పట్టి భోజనం లేనట్టుంది. ఆదేమిరా ఏనుగంత ముండాకొడుకువి అలా అయిపోయినావు? మామామగారు—అంటే రాయప్పగారు—నీకూడా అన్నం పెట్టటం లేదా? ఇంటికి పద. దొర లున్నారు. నేను వస్తున్నాను"అన్నది. నేను వెళ్లాను. వాకిట్లో మా చిన్నదొర ఎండలో కూచొని మన్నుతో ఆడుకుంటున్నాడు. నేను "బాబూ, మంటిలో ఏమిటి? లే" అన్నాను. ఆయన మెడ యిట్లా వాల్చి నావంక చూచి "నీవొచ్చా వెందుకు?" అన్నాడు. నేను "ఒచ్చాగాని, అన్నయ్య ఏడీ" అన్నాను. ఆయన "అన్నయ్యను తీసుకోరానా." అని లోపలకు పోయి అన్నగారిని చెయిపట్టుకొని బలవంతంగా లాక్కొవస్తున్నాడు. నేను వచ్చానని చెప్పలేదు. ఆయనకు మరీ చిన్నతనం అవటంమూలంగా మన పాలేరు అనిగాని, వల్లడనిగాని చెప్పలేకపోయినాడేమో. ఎందుకు చెప్పలేదు? ఈ నాలుగైదునెలలబట్టీ నేను కనపట్టం లేదుకాబట్టి అదొక క్రొత్తగా ఉంది. పాతపాతగా ఉండి అందులో కొత్త పసితనం, గ్రుక్క-త్రిప్పకోలేని ఊహ, మళ్లీ నన్ను చూట్టంతోటే తన వాళ్లెవరో వచ్చారనుకోటం, ఈచమత్కారం అంతా ఆపసితనంలో ఉంది. అన్నగారు నన్ను చూట్టంతోటే "ఇందుకా? వల్ల డొచ్చాడే అమ్మా, అమ్మా" అంటూ యింట్లోకి పరుగెత్తేడు. ఇంతలో దొడ్డిత్రోవవెంట వాళ్లమ్మగారింట్లోకి వచ్చింది. ఆమె తడిధోవతి విప్పి వేరే పొడిబట్ట కట్టుకొని తల్లీకొడుకులు వాకిట్లోకి వచ్చేటప్పటికే ఒకగడియసేపు పట్టింది. ఆవిడ వస్తూనే అంది, "ఏడిరా వల్లడు" అంటూ. ఆ అనటంలో తాను నన్నంతకుపూర్వం చూడనట్లు, తన పెద్దబిడ్డే ముందర నన్ను చూచినట్టు. ఆపిల్లవాడి సంతోషం ఎందుకు చెడగొట్టాలని.మా దొరసానిగారి పేరు సర్వలక్ష్మమ్మగారు. ఆవిడ ఎంత ఇల్లాలో,ఎంతమనిషో నేను చెప్పట మెందుకు? మాచుట్టుపట్ల పది ఊళ్లకు తెలుసు. నేనల్లా ఆస్తి నిలబెట్టినవాణ్ణిగాని ఆవిడ కొడుకుల్ని పెద్దవాళ్లను చేసి సంబాళించి, మాదొర ఉన్నప్పుడెట్లాగో మళ్లీ సంసారం ఇల్లా సాగించిన తల్లి. మాదొర ఉన్నన్నాళ్లూ దొరచాటున ఉండి, ఆవిడ తెలివితేటలు, ఆవిడవ్యవహారపుతనం మాకే తెలియలేదు. నేనున్నా లేకపోయినా, ఆవిడే పొలమంతా చూచుకొని పిల్లల్ని బాగుచేసింది. ఆవిడ కఱ్ఱ చేత్తో పుచ్చుకొని కాడిగట్టున నిలచుంటే ఏ పాలేరు, ఏ కూలివాడు పాలుమాలడానికి వీలులేకుండా ఉండేది. ఆకొడుకుని అల్లా సంతోషపెట్టటంలో అదే మొదటిసారి మాదొరసాని అంటే ఏమిటో నాకు తెలియటం. పసివాడైనకొడుకు సంతోషం చెడిపోతుందేమో నని అంతజాగ్రత్తగా మాట్లాడే దావిడ ఎంత నిద్దామనిషి

కావలె. మాదొర ఉండగా ఆవిడమంచితనమే చూచాగాని ఆవిడలోనున్న ఈగుణం చూచానుకాను. అది కూడా వేళలో ఉంది. ఆవిడ వాళ్లు బాగున్నారా, వీళ్లు బాగున్నారా అని అడిగింతర్వాత నన్ను అన్నం తినమన్నది. నిన్నటి చద్దిఅన్నం ఉన్నది, మజ్జిగపోసి పెడతానంది. నేను కథంతా చెప్పేను. "దొరసానమ్మగారూ,నీవూ పిల్లలూ వస్తే, వస్తానని మాట ఇస్తే నేను అన్నం తింటాను. లేకపోతే ఇక్కడే ఉపవాసం చేస్తాను. చచ్చిపోయింతర్వాత కృష్ణలోకి ఈడిపించు" అన్నాను. ఆవిడ "ఒరేవల్లా, నే నాడదాన్ని. మామగారు సామంతుడు. వారు బ్రతికిఉన్నప్పుడు ఊరంతా ఆయన గీసిన గీతమీద నడిచింది. ఇప్పు డాయన్ను మరచిపోయింది. నా కక్కడ ఊరా పేరా ? ఆరునెలలు గిద్దెడుగింజలు దొరక్క నానాత్రిప్పలూ పడ్డాను. పిల్లలనుకూడా చివరకు సాకుకోలేకపోయినాను. మళ్లీ వచ్చి ఆయిబ్బందులు పడి మళ్లీ యిక్కడకు తిరిగిరావటమేకదా? ఎందుకు పట్టుపడతావు? పొలం పండించి ఆయన పోసికోనే. మేమేం తింటాము, నీకేమి పెడతాము? ఏమి కానుందో అది అవుతుంది. రాతిలో కప్ప కాహార మారతముగ నిడెడు దైవంబు మర్త్యులకేల మాను" అన్నది. మాదొరసానిని చూచినకొలదీ, ఆవిడమాటలు విన్నకొద్దీ నాపట్టుదల మరీ వృద్ధిఅయింది. మాదొర మాట్లాడినట్లే మాట్లాడుతుంది. ఆపద్య మెప్పుడూ మాదొర చదివేవాడు. మాదొరసాని చదువుకొన్నది కాదు. ఆభర్త మాట్లాడుతూంటే ఆమాటలు, ఆపద్యాలు అన్నీ ఆవిడ కొచ్చినవి. ఈసంగతి తర్వాత తర్వాత నాకు మరీ తెలిసింది. ఆదొరకు తగిన దొరసాని. ఇన్నాళ్లూ ఈతల్లి మగనిచాటున ఉంది. ఈవిడ వ్యవహారం చెయ్యటం మొదలుపెడితే రాయప్పగా రేమి నిలుస్తాడు? అస లాయనకు మాటపొందిక ఏమితెలుసు? ఈమె నాదొరశిష్యురాలు. నేను అన్నానుకదా, "అమ్మా, ఊరు మనపటికిమళ్లనే ఉందనుకున్నావా? కరణము, మునసబు, నాయకుడూ అందరూ మనవైపు" అన్నాను. ఆవిడ ఆశ్చర్యపోయి "అదేమి మాటలురా? మనవేపువాళ్లయితే నేనక్క డల్లా ఉంటే చూస్తూ ఊరుకుంటారా? ఆఊరు మాదొరనాటి ఊరా? వాళ్ల మనస్సులన్నీ అమ్ముడుపోయినై" అన్నది. నేను వేసిన పాచికలు, ఎత్తిన ఎత్తుగడలు, అవిపారిన వైనం అంతా చెప్పేను. ఆవిడకు కొంత నచ్చింది. "సరి. ఐతే చూద్దాంలే.నీవుముందర భోజనంచేయ"మన్నది."కాదు. దొరల్ని తీసుకొని మీరు వస్తానంటే భోజనంచేస్తాను" అన్నాను.ఆవిడ "మరి రావటంతోటే తిండీ తిప్పలూ ఎల్లాగురా? కోమటింట పద్దు ఇదివరకే పెరిగిఉంది. వెళ్లటంతోటే అతను అడుగుతాడు. చేసిన అప్పులన్నీ ఆలాగే ఉన్నై. వెళ్లటంతోటే వాళ్లు అడుగుతారు. నీతో నాకు ముందర నుయ్యి వెనక గొయ్యిలా గుంది" అన్నది. నేను "నీ కాభయం లేదు. నీవు గడపలో అడుగుపెట్టటంతోటే పుట్టెడు జొన్నలు, పందుంజలం వడ్లు తీసుకోవచ్చి నీయింట్లో వేస్తాను. కోమటికి రెండు బస్తాలజొన్నలు కొలం. నీఇంట్లో నీవుండు. ఇంక నేను రాయప్ప నాడిస్తాను చూడు. మన ఎడ్లనీ, మన పశువులన్నీ తీసుకొచ్చి మనసావట్లో కట్టివేస్తాను. కాదంటానికి రాయప్పకు తరంకాదు. కదా"అన్నాను. ఆవిడ బాగా ఆలోచించింది. అప్పటి కింకా జాముప్రొద్దే ఉన్నది. చివరిమాట అన్నది. "ఓరి పిచ్చిముండాకొడుకా! నీకెందుకురా ఈబాదరబందీ అంతా? ఆదొరకొడుకులేమైపోతే నీకేమి? ఈ బలవద్విరోధం నీ కెందుకు? నీవు అన్నం తినిపో" అని. నేను "నేను అన్నం తిని వెళ్లటానికే అయితే యిక్కడి కెందుకు వస్తాను? దొరలను తీసికోవెళ్తాను. లేకపోతే నాపీనుగ యిక్కడే వెళ్లిందనే పేరు నీకు దక్కాలి" అన్నాను. ఆవిడ "అలాంటి మాట లెందుకు? వస్తానుగా. నీవు భోజనం చెయ్యి" అన్నది. నేను "అల్లా కాదు. నీవు వస్తానని ప్రమాణం చెయ్యి. లేకపోతే నేను భోజనం చెయ్య" నన్నాను. ఆవిడ మొగం అంతా బిగించుకొని "సరే. ప్రమాణం చేస్తున్నాను. భోజనం చెయ్యి" అన్నది. అప్పటి ఆవిడమొగం చూస్తే అప్పు డావిడ నిశ్చయం చేసుకోటం కొడుకుల ఆస్తి నిలబెట్టటంమాత్రమే కాని ఓ పెద్దరాజ్యం ఏర్పాటుచేద్దామని ఆవి డప్పు డనుకున్నా అంతపని చేసేవరకు నడుము విప్పదన్నట్లుగా ఉంది. ఆదొరసానిమొగం చూస్తే జరగబోయే పనంతా అప్పుడే జరిగినట్లున్నది. భోజనం చేశాను.

ఆరాత్రి సుఖంగా నిద్రపోయినాను. మరునాడు మాదొరసానివాయనగారు పంచాంగం చూచి బాగానే ఉందన్నాడు. బయల్దేరి కృష్ణ దాటేము. కృష్ణ దాట్లంతోటే అక్కడ దొరుకుతుంది. ఆవూళ్లో ఓబండీ బాడుగకు కట్టించాను. రెండు మాడ లిమ్మన్నాడు. సరే అని ఒప్పుకున్నాను. బండికి గుడిశ లేదన్నాడు. లేకపోతే మాడన్నరే యిస్తానన్నాను. ఆబండీఆయన అరమాడా ఎక్కడపోతుందో నని ఎక్కడో గుడిశ తెచ్చి కట్టాడు. మా పెద్దదొర ఎడ్ల మెడలో గంటలూ, మువ్వలూ లేకపోతే రా నెక్కనన్నాడు. నేనూ అంతే నన్నాను. ఆవూళ్లో మువ్వల పట్టెడ ఎక్కడా దొరకలేదు. దొరసాని పిల్లవాణ్ణి కోప్పట్టం మొదలు పెట్టింది. నేను "మనం దొరలల్లే వెళుతున్నాం. మువ్వలపట్టెడ లేకుండా ఎట్లా వెళుతాం" అన్నాను. మళ్లీ కృష్ణదాటి మాదొరసాని పుట్టిన ఊరు పోయి ఊళ్లో కనుక్కొని ఎవరింట్లోనో అద్దాలుతాపిన మువ్వల పట్టెడ ఉంటే తీసుకొచ్చాను.

౬

ఈ ఆలస్యంమూలంగా బయలుదేరే వేళకు పొద్దు వాటారింది. మా పెద్దదొర బండిఆయన్ని తొట్లో కూచోనివ్వలేదు. తానే కూచొని తోలా లంటాడు. ఆ బుద్ధాయనకు ఎడ్లు నడవ్వు. బండిఆయన కొంచెం తొగిచ్చివాడు. ఆయన నడవలేడు. దొరసాని బండిలో కూచుందికనుక ఈయన తడికమీద కూచో టానికి వీల్లేదు. ఇట్లాగే ప్రొద్దూకేదాకా సాగింది. నేను ఎడ్లతలతాళ్లు పుచ్చుకొని లాగితేకాని ఎడ్లు నడవ్వు. నేను తలతాళ్లు పుచ్చుకుంటే దొరసానిగారి ఆచారానికి పనికిరాదు. "సరే, నేను స్నానం చేస్తాను లేరా. బండి ఎట్లాగో అట్లా సాగేటట్టు చూడ"మంది. నేను దొరను కొంచెంసేపు బ్రతిమిలాడేను. ఆయన చివరకు పోయి తల్లిదగ్గర కూచున్నాడు. బండిఆయన తొట్లో ఎక్కేడు. బండీ సాగింది. రాత్రి ప్రొద్దు పోయేవరకు మొన్నరాత్రి నేను పడుకున్న ఊరు వెళ్లాం. మాదొరసాని పిల్లలకోసం అన్నం మూటకట్టు కొచ్చింది. ఆచెరువులో రేవుదగ్గర పిల్లల కన్నం పెట్టింది. కాని మజ్జిగ లేదు. నే నాబ్రాహ్మణ అమ్మ వారింటికెళ్లి మాదొరసానిగారినీ పిల్లలనూ తీసికో వస్తున్నాననీ, వారు వచ్చారనీ, చెరువుదగ్గర మా దొరసాని పిల్లలకు అన్నం పెడుతోందనీ, మజ్జిగ కావాలనీ చెప్పేను. ఆవిడ "అదేమిట్రా, మీ కిది పరాయిఇల్లా?' మొన్న మావాకిట్లో పడుకున్నావు, నేను పెట్టిన అన్నం తిన్నావు, బండి చెట్టుక్రింద దింపేవా? ఛీ, ఛీ! మొన్న నీకు తెలియక అన్నం పెట్టేను. నా అన్నం తిన్నవాడెవడూ యిట్లా చేయలే"దంది. "తల్లీ, నీ అన్నం నేను తినలేదు. నేను ప్రతిజ్ఞ పట్టేను. అందుచేత తినలేదు. నీ అన్నం తినని తప్పు యివ్వాళ తెలిసింది. ఇవ్వాళ పెట్టు, తింటా"నన్నాను. మేమందరం వారింటికి వెళ్లేము. ఆవిడ బండివాడికీ, నాకూ అన్నం పెట్టింది. మా దొరసాని స్నానం చేసి, ఫలహారం చెయ్యండీ వదలిపెట్టం దే. మా దొర లిద్దరూ వస్తూనే నిద్రపోయినారు. ఆ బ్రాహ్మణ అమ్మవారు మా దొరసానితో "మీ ఆయన ఎంత దాత అనుకున్నావమ్మా. నా కొడుకుపెళ్లికి మా వారు మీ ఊరు యాచనకు వచ్చారు. మీ వారిని చూశార్టట. ఆ సమయంలో మీ వారు ఒక రాశిగా పోసి మాడలు లెక్కపెడు తున్నారట. మావారు నా కొడుకుపెళ్లి అనిఅనక ముందే రెండు దోసెళ్లు తీసి ఒళ్లో పోశారట. మావారు ఊళ్లోలేరు. ఉంటే మిమ్మలను క్రింద కూర్చోనిచ్చే వారా? మా ఇంట్లో మీ కథ చెప్పుకోని రోజే ఉం డదు. మీ కివ్వాళ ఆదరించి అన్నం పెడుతున్నా నంటే నా మంచితనం ఏమీ కాదు. మీ ఋణం వెయ్యి జన్మలిచ్చినా తీర్చుకోలేము." అంది. అం దరూ నిద్రపోయినారు.

మరునాడు భోజనం చెయ్యకుండా ఆ మహా తల్లి మమ్మలను పోనియ్యలేదు. బండివాడు తనకు బాడుగ నష్టమని మొదలుపెట్టేడు. నాకు కోపం వచ్చింది. "ఛీ! నీ కంత కష్టం అయితే నీ బండి తోలు కోపో. ఈ ఊళ్లో యింకో బండి కుదురుస్తా"నన్నాను. ఆయన మళ్లీ సర్దుకున్నాడు. భోజనం చేసి బండి కట్టేము. దారి కటూ యిటూ కొతిమేరచేలు, శనగ చేలు. గాలి కమ్మగా వస్తోంది. పైరగాలి పరవళ్లు త్రొక్కుతోంది. పాలపిట్ట లెగురుతూ కూస్తున్నవి.

ఒక నక్క తన జల్లితోక మళ్లించి పొట్టమీదికి త్రిప్పుకొని కోసమూతి ఆకాశంవైపు త్రిప్పి, దారికి ఎదురుగా, దూరంగా, సరిగ్గా నడిమిగా కూచొని బండిగంటల మోత విని ఎడమనుండి కుడికి తీర్చింది. మాదొరలకు "అదిగో, నక్క బాబూ" అని చూపించాను. పెద్ద ఆయన బండి దూకి నడుస్తా నన్నాడు. కొంతదూరం పోయేటప్పటికి ప్రొద్దు కూకవస్తోంది. సాయంకాలపు ప్రొద్దు యిట్టే కుంకుతుంది. నాకు సూర్యుడిమీద మహాకోపం వచ్చింది. పట్టపగలు ఊళ్లోకి వెళ్లకుండా ఈయన కేమి చప్పనాత్తనం, మొగం మణుచుకుంటాడని. అన్నీ అంత అందంగా వస్తవి. మా ఊరు రెండు కోసు లుండనగా ఒక ఊరు వచ్చాము. ఆ ఊళ్లో ఒక ముసలిబ్రాహ్మడు ఏవ్వూరని అడిగేడు. మా ఊరుపేరు చెప్పి మాదొరపేరు చెప్పేను. ఆవిడ మాదొరసాని, వారిద్దరూ పిల్లలు అని చెప్పేను. ఆయన మాబండీ పోనిచ్చాడు కాదు. ఈరోజు రాత్రి మాయింట్లో ఉండిపోవలసిందే నన్నాడు. బండీ కదలనిచ్చాడు కాదు. తప్పనిసరి కారాత్రి అక్కడే ఉన్నాము. మరునాడు ప్రొద్దున బండీ కట్టేము. ఆయన మాదొరలకు చొక్కాగుడ్డ లిచ్చాడు. బండి పగలు ఝాముప్రొద్దుఎక్కినతర్వాత కోసఎండలో పట్టెళ్ళఅద్దాలమీద పడి పదునుపెట్టిన బల్లెములు విసరుతూంటే పట్టెడగంటలూ మువ్వలూ ఈలపిట్టలపాటలకు తాళాలు వేస్తుంటే అందరూ తల లెత్తిచూస్తుంటే ఊళ్లో ప్రవేశించాము.

* * *

పదిరోజులు పరాయిస్థలములో ఉండివస్తే మన ఇల్లే మనకు క్రొత్తగా ఉంటుంది. ఆక్రొత్తలో ఒక ప్రియత్వం ఉన్నది. ఈప్రియత్వం ఉభయత్రా నూ. ఇల్లువంటిదే ఊరున్నూ. స్నేహము ప్రవాసాశ్రయమువలన నశించిపోతుం దన్న భర్తృహరిమాట సర్వదా నిజము కాదు. సర్వలక్ష్మమ్మగారి సంసారం మీద ఊరికి క్రొత్త అభిమానం పుట్టింది. చెప్పినట్లుగానే వల్లడు పుట్టెడు జొన్నలూ తీసుకొని వచ్చేడు. అక్కడినుంచి సర్వలక్ష్మమ్మగారి ప్రతిభ కనిపించటం మొదలుపెట్టింది. ఆవిడ తన గొడ్లనన్నింటినీ రాయప్పగారి దొడ్లోంచి ఊడతీయించి తెప్పించి తన దొడ్లో కట్టేయించింది. తన పాలేళ్లను విడిగా తాను పిలిపించింది. ఒకరోజున పాలేళ్లందరినీ వెంటతీసుకొని రాయప్పగారింటికి వెళ్లింది. ఏకళ్లం. ఊడిచిపోసిన రాశిలో వల్లడు పాలేరుభాగం తీయబోతూంటే రాయప్పగారు తీయనివ్వలేదో ఆరాశిజొన్నలు బస్తాలకు పట్టించి రాయప్పగారి సావట్లో గడమంచీల మీద వేసివున్నవి. సర్వలక్ష్మమ్మగారు ఆబస్తాలన్నీ తన పాలేళ్లచేత తన ఇంటికి పట్టింపించింది. రాయప్పగారి భార్య తిట్టటం మొదలుపెట్టింది. సర్వలక్ష్మమ్మగారు "అత్తా, మామగారికి మతి పోతే నీకుగూడా పోయిందా?" అన్నది. ఆవిడ మళ్లీ మాటాడలేదు. రాయప్పగారు చూస్తూ ఊరుకున్నాడుగాని కుయిక్కుమనలేదు. అంతటితో వ్యవహారం పొసగిందని ఊరంతా అనుకున్నారు. వల్లడు సర్వలక్ష్మమ్మగారితో "అమ్మా, ఇంక ఫరవాలేదు" అన్నాడు. సర్వలక్ష్మమ్మగారు నవ్వింది. వల్లడన్నాడు కదా: "ఏమమ్మా నవ్వుతావు?" సర్వలక్ష్మమ్మగా రన్నది. "ఒరేయి, నే నాడదానిని. మామగారు నా కడ్డంరాడు. అడ్డంవస్తే ఊళ్లోవాళ్లందరూ నవ్వుతారని. రేపు నీవు అరకకట్టు. అప్పుడు తెలుస్తుంది." అన్నది.

మళ్లీ వల్లడు చెపుతున్నాడు:

మా దొరసాని అన్నంతా అయింది. నేను అరక కట్టేను. రాయప్పగారు తన పాలేళ్లు, తాను, ఊరిలో మరి కొంత మద్దతుతో వచ్చి అటకాయించాడు. 'ఈ పొలం నీది కాదు' అని. ఈ లోపుగా ఏమి చేశాడో వాళ్లందరూ కఱ్ఱలతో వచ్చేరు. నేను జాగ్రత్తపడి వెళ్లలేదు. లేకపోతే నేనూ, యానాది గంగడూ కఱ్ఱలు పుచ్చుకొని నిలుచుంటే, అంతమందీ ఆగేది లేదు. కాని కఱ్ఱలతో ఎంతసేపు వ్యవహారం నిలవ త్రొక్కగలము? ఎప్పటికప్పుడు మేము కొద్ది మందిమి ఉంటే వాళ్లు, వాళ్లు కొద్దిమంది ఉంటే మేము పైచేయిగా ఉండటమే కదా. అందుచేత నేను మెత్తని మార్గం పట్టేను. "దొరా, నా దొరసాని వచ్చింది. తన పొలం నన్ను దున్నమంది. నేను దున్నుతున్నాను. దొరసానితో వెళ్లి మాట్లాడు. నన్ను అటకాయించి ఏమిలాభం?" అన్నాను. ఆయన "ఈ దొంగ మాటలు నా దగ్గిర కావు. నేను నాగళ్లు ఊడతీస్తాను. నీవు

"పోయి మీ దొరసానితో చెప్పుకో" అన్నాడు. నేను మా పది మంది పాలేళ్లలో ఒకణ్ణి పిలిచి నీవు పోయి మునసబు కరణాల్ని, నాయకుణ్ణి పిలచుక రమ్మన్నాను. కాని వారెవ్వరూ రాలేదు. నేను రాయప్పగారితో "దొరా, మీరు ఊడతీయండి, నేను అరక సాగించేదే నిజం" అని చాలు మొదలుపెట్టేను. వాళ్లు పదిమందీ వచ్చి పదినాగళ్లూ ఊడతీశారు. నేను ఏమి చెయ్యాలి? ఆయనతో ఇట్లా అన్నా: "ఊడతీయగానే అయిపోలేదు. నే నానాడు చేసిన ప్రతిజ్ఞ అలానే ఉంది. మా దొరసాని ఆడది. పిల్లలు పిల్లలు అనేకదా నీధిలాసా." అని ఎక్కడలేని కోపం తెచ్చుకొని "నాగళ్ల కడ్డం లేగులుతావా? ఇది నీసొమ్మా? పలుపులు పగ్గాలు కోస్తావా?" అని పలుపులూ పగ్గాలూ కొడవలుచ్చుకుని ముక్కలు చేశాను. "మేడికోలలు విరక్కొడతావా?" అని మేడికోలలన్నీ నేనే ముక్కలు చేశాను. "కఱ్ఱులు లాగేస్తావా?" అని కఱ్ఱులు బలవంతంగా గొడ్డళ్లతో పెకలించాను. దొరా, అప్పుడు నే నాడిన నాటకం చూడాలి. చెపితే ఏముంది? లేకపోతే ఆ కోపం ఎల్లా చూపించానో, ఆయన చెయ్యని పనులన్నీ ఆయనే చేసినట్లు చూచేవాళ్లందరికీ అనిపించేటట్లుగా నాటకమాడేను. అది ఒక చమత్కారం. సరే, ఆ కోసిన పలుపులు, పగ్గాలు, విరిగిన మేడికోలలు, పెల్లగించిన కఱ్ఱులు అన్నీ మూటకట్టి ఎడ్ల నింటికి తోలుకెళ్లమని ఒకరిని పంపించి, అవన్నీ తక్కిన ఎనమండుగురు పాలేళ్ల భుజానా పెట్టి బయలుదేరి వెడుతూ రాయప్పగారితో ఇలా అన్నాను: "ఇదిగో, పిల్లల నోట్లో మన్ను కొట్టాలని చూస్తున్నావు. ఇంత ఆస్తీ కాజేయాలని చూస్తున్నావు. పైన దేవుడున్నాడు. నేను పోయి ఠాణాలో చెప్తాను. రేపు ఠాణేదారును తీసుకోవస్తాను. నీ మునసబు కరణాలు ఎట్లా అబద్ధం చెప్తారో చూస్తాను. పెళ్లాలు, బిడ్డలు కలవాళ్లే కదా" అని దారివెంట పోయినంతమేరా, ఆయన కనిపించినంతమేరా ఈమాటలంటూనే వెళ్లేను. మా ఊరికి ఠాణా మూడామడలో ఉంది. ఆ ఎనమండుగురు పాలేళ్లు, నేను తొమ్మండుగురము ఠాణాకు చేరేటప్పటికి ప్రొద్దుతిరిగింది. ఠాణాకు వెళ్లేను. ఎనమండుగురితో చెప్పేను: "ఒరేయి, ఠాణేదారుగారు కనపడటంతోటే అందరూ ఏడవాలిరా" అని. ఠాణేదారుగారి యెదుట ఈ ముక్కలన్నీ పడవేసి "దొరా, రక్షించాలి. రాయప్పగారు నాదొరఆస్తి అంతా తినెయ్యాలని కూర్చున్నాడు. నాదొరసాని ఆడది. ఇల్లు కదలలేదు. పిల్లలకు ముక్కుపచ్చలారలేదు. తల్లినీ బిడ్డలనూ ఆరునెలలు తరిమివేశాడు. పుట్టింట సాగక మళ్లీ పిల్లలను తీసుకోవచ్చింది. ఊళ్లో చాకిరీచేసేవాళ్లెవరూ మాటవినకుండా చేశాడు. మునసబుకరణాలను తనవైపు కట్టుకున్నాడు. చాకలివాడు గుడ్డలు ఉతకడు. కుమ్మరి కుండలు తీసుకోరాడు. సాలెవాడు గుడ్డనేయడు. మాదిగవాడు చెప్పులుకుట్టడు. పిల్లల తలలు మాసిఉన్నై. మంగలికి కబురంపిస్తే మొగం దాటవేస్తాడు. ఇవ్వాళ ప్రొద్దున మేము అరకలు కడితే ఇదిగో, బాబూ, పగ్గాలూ, పలుపులూ కోశాడు. నాగళ్లు విరక్కొట్టేడు. ఆ దొర కుటుంబంతోపాటు ఆ చెట్టు నాదరువు చేసుకున్న పది కుటుంబాలవాళ్లం మేము. మా దొర పోయి ఏణ్ణర్థం అయింది. ఇన్నాళ్లూ గంజికి మొగం వాచిఉన్నాము. పొలాలన్నీ ఆలెక్కలు మీ కాగితాలల్లో వ్రాసిఉన్నై, కాని మా దొర ఇంట్లో లేవు. పాలిస్తారో, మీ కాగితాలు కూడా మారుస్తారో, పాలించండి" అని తొమ్మండుగురమూ చూచేవాళ్ల పేగులు తరుక్కుపోయేలాగు ఏడిచాము. ఆ ఠాణేదారు మా దొర ఇంట్లో ఎఱ్ఱని జొన్నన్నంలో గడ్డంటి గేదెపెరుగు పోసుకుని, ఒఱ్ఱని గోంగూరపచ్చడి నంచుకుంటూ ఎన్నిసార్లు తిని త్రేచాడో ఆయనకే తెలియదు. వారు నియోగులు. ఆ కాలంలో నియోగులందరికీ లగరపురేకుల చెప్పులంటే చాలా సరదా. అలాంటి జోళ్లు ఏటేటా మాదొర దగ్గర ఆయన తీసుకుపోతూండేవాడు. అందుచేత ఆయనకు మాదొరంటే అభిమానం. ఆయనముఖం కొంత అనుకూలంగా ఉందని గ్రహించి నే నీసంగతులుకూడా చెప్పేను. "బాబూ, మీకు మాదొర ఎన్ని చెప్పుల జోళ్లు ఇచ్చాడు. మీరు వస్తే మాదొర ఇంట్లో చుట్టాలకన్న ఎక్కువగా చూచాడు మిమ్మల్ని. ఆదొర ఆస్తి యిల్లాగు కానిస్తారా ఇవ్వేళ? ఇన్ని కుటుంబాల ఉసురూ రాయప్పగారు పోసుకుంటున్నాడు. మీరు

న్యాయం చేస్తానంటే మేము తిరిగిపోతాం. లేకపోతే మా పెళ్లాంబిడ్డ లక్కడచస్తారు, మేమిక్కడ చస్తాం." తాణేదారుగా రిదంతా విన్నాడు. "ఒరేయి వల్లా, నేను నిన్నెరుగనా, నీదొర నెరుగనా? కాని వ్యవహారం కొంచెం ముదిరింది. నీవు పోయి జమీందారుగారితోకూడా చెప్పి వారినికూడా తీసికొని వస్తే కాని ఇది పొసగదు. ఇప్పుడు రాయప్ప బలవంతుడై ఉన్నాడు. మా లెఖ్ఖల్లో మీ ఆస్తిపంపకాల్లె విడకొట్టి వ్రాసిలేదు. మీదొర ఉన్నన్నాళ్లు భరోసామీద నడిచింది. పంపకంకాని ఆస్తి. ఇది ఇది అని ఎట్లా? జమీందారుగారు వస్తేకాని మీ పంపకాలు తేలవు. కరణం మహాతుచేశాడా? ఎన్నాళ్లయింది? ఇవన్నీ ఊళ్లో ఉన్న సాక్ష్యంమీద తేలాలి. మీ ఊళ్లో పంచాయితీదార్లేమంటారో? రాయప్ప కరణం మునసబుల్ని పట్టుకున్నాడంటున్నావు. వ్యవహారం చిక్కుల్లో పడ్డది. మీదొరకూడా ఆయన పెద్దవాడని అంతా ఆయన పేరుగా నడిపేడు. నాకేమీ తోచకుండా ఉంది. ఇదివర కన్ని శిస్తులూ రాయప్పకట్టినట్లుంది. వ్యవహరించింది మీదొరే. కాయిలేందాఖిలా రాయప్ప కనుకూలంగా ఉంది. నీవు పోయి జమీందారుగారితో చెప్పుకుంటేనేకాని ఇది కుదరదు. జమీందారుగారు ఫలానా రోజున మీ ఊరు వస్తే నేనూ వస్తాను" అన్నాడు. దొరా, నీకు ఈ మాటలన్నీ క్రొత్తగా ఉండవచ్చు. ఇవన్నీ ఇంగ్లీషువారు ఈగడ్డలో వచ్చి ఎవడు వ్యవసాయం చేస్తున్నా పొలం వాడిదీ అని నియామకంచేసి కాగితాలు పుట్టించని రోజుమాటలు. అప్పటికి దేశంలో యిల్లా ఉండేది. ఎవడు అరకకట్టి దున్నితే వాడిది ఆ పొలం. ఎవడిపేర తహసీలు చెల్లించిఉంటే వాడిది ఆపొలం. రైతులదగ్గర కాగితాలుండేవికావు. అంతా పంచాయితీదార్లమీద ఉండేది. నీకు కావలసివస్తే బంజరుగా ఉన్న పొలం దున్నుకో. ఒద్దనేవారు లేరు. నీవు వరసగా దున్నుకుంటూ ఉన్నన్నాళ్లూ ఆపొలం నీది. నీవు దున్నిన పొలంమీద నీపంటలో ఆరవవంతు జమీందారు తీసికొనేవాడు. కావలసినంత బంజరు ఉండేది. క్రొత్తగా అరక కట్టినవాడికి పొలం లేకపోలేదు. ఇది ఆనాటి వ్యవహారం. అప్పుడు నేనన్నానుకదా- "బాబూ, నేను జమీందారుగారి దగ్గరకు పోతాను. ఈలోపుగా రాయప్పగారు మీదగ్గరకు వస్తాడేమో" అని అంటూ ఉండగానే తాణేదారు "రానీ, రేపెప్పుడు ముండాకొడుకుని. పది కుటుంబాల నోట్లో గడ్డకొడతాడా? అందులో నీ దొరవా? నీ దొరే ఇట్లాంటివాడైతే రాయప్పను సాదిలోకి రాకుండా చేసేవాడు. వంశంలో పెద్దవాడని అట్టిపెట్టిన గోప్యం ఉంచుకోలేకపోయినాడు. నీవు పో" అన్నాడు. నేను మనస్సులో సంతోషించాను. ప్రభుదర్శనం ఎల్లా అవుతుంది? సరే. మేము పదిమంది పాలేళ్లం. ఈ మేడికోళ్ల పుల్లలూ, ఈ తెగకోసిన పలుపులూ, ఈ కఱ్ఱముక్కలూ పదిమందిమీ పదికట్టలు నెత్తిన పెట్టుకొని నాజవీడు వెళ్లేం. ప్రభుదర్శనం ఎవరికీ కాదు. మేము దేవిడీముందర మాబరువులు దింపుకొని ఏడవటం, మొత్తుకోటం, ప్రభుదర్శనం కావాలంటం! ఎవ్వరూ మమ్మల్లను పాలించినవాళ్లు లేరు. నాలుగురోజులు గడిచింది. ఏమి చెయ్యాలో తెలియలేదు. చివర కొక బంట్రోతు ప్రభువు ఆరోజు సాయంత్రం అందరకూ దర్శనం యిస్తారని చెప్పేడు. ఆదర్శనం ఇస్తాడన్న చోట పోయి నిలుచున్నాము. ప్రభువు నిజంగా ప్రభువు. పెద్దపెద్ద దొరలందరూ వచ్చిఉంటే మొట్టమొదట మావంక చూచాడు. చూడటంతోటే నేను వెంటనే మాట్లాడేను. నాగోడంతా మొదలుపెట్టి చెప్పేను. వారు పలుకరిస్తారని ఎదురుచూడకూడదు. ఆచూపు ఇంకొకరివైపు మళ్లించా మన పని మాసాలు పట్టిందే. నేను మొదలుపెట్టటంతోటే "అయ్యా, నేను ఫలానా దొర పాలేరును" అన్నాను. ప్రభువుకన్నులు పెద్దవైనవి. అవటంతోటే నేను గ్రహించాను మాదొర పేరు ప్రభువుకికూడా తెలుసునని. పది ముక్కల్లో అంతా చెప్పేను. "దొరా, నాయజమానీ రాయప్పగారూ తాతాసహోదరులు. నాయజమానిది పెద్దకుదురు. రాయప్పగారు వయస్సుచేత పెద్దవాడు. నాయజమాని పెద్దవాడుకదా అని రాయప్పగారిమీద మర్యాదపెట్టి వ్యవహరించాడు. రాయప్పగారు నాయజమాని పోయినాడని ఆయనభార్యనీ, పిల్లలనూ ఊళ్లోంచి వెళ్లకొట్టి ఆస్తిఅంతా తాను కాజెయ్యాలని చేస్తున్నాడు. మేము పదిమంది పాలేళ్లం. ఇంకా గొడ్లను కాచేవాళ్లూ


వాళ్లూ మాదుకుటుంబాలు అన్నాయి. మా యజమాని కుటుంబంతో పదునాలుగు కుటుంబాలు. మా యజమానికీ రాయప్పగారికీ పంపకాలైనవి. లెఖ్ఖల్లో లేవు. ప్రభువులు వచ్చి మా యజమాని పిల్లలను దయ చూస్తే మేమందరం బ్రతుకుతాము. ఆయన ఊరంతా అక్కట్టేడు. పంచాయితీదార్లు రాయప్పగారి వేపున ఉన్నారు. ప్రభువు అక్కడ నిలుచుంటేనే గాని నిజం బయటకురాదు. అంతా చీకటిగా ఉంది. దొరలు ప్రొద్దుపొడిస్తేనే గాని ఏది ఏదో కనిపించదు." అన్నాను.

దొరా, చూచావా, ఇక్కడ నిన్ను దొర అంటాను. అక్కడ నిన్ను నా యజమాని అన్నాను. అక్కడ ప్రభువుని దొర అని నిన్ను దొర అనకూడదు. అందుచేత అల్లా చెప్పేను. నేర్చుకో అన్నాడట మా నాయనతో వల్లడు.

ప్రభువు శ్రీ నోటివెంట ఒక్కటే మాట వచ్చింది. "మేము శుద్ధపాడ్యమినాడు మీ ఊరు వస్తాము." అనటంతోటే ప్రభువుచూపు వేరేవైపుకి మళ్లింది. ఇంక అక్కడ నిలుచుంటే తప్పు. వెంటనే నేను తక్కినవాళ్లందరినీ మళ్లించుకొని వచ్చేశాను. మేము ఎక్కడికి వెళ్లామో, నేను ఏమి చేశానో ఊళ్లో ఎవ్వరికీ తెలియదు. నేను తెలియనీయలేదు. నేను తాణాకు వెళ్లినట్లు తాణేదారు చెప్పితే నేనేమి చెయ్యను? లెఖ్ఖలన్నీ రాయప్పగారి కనుకూలంగా ఉన్నవి అన్నట్లు వదంతి పుట్టించాను. ఎడ్లని రాయప్పగారి పాకిట్లో కట్టేయించాను. మా దొరసాని రాయప్పగారింట్లో నించి తెచ్చిన జొన్నల రాసి బస్తాలు మేము పదిమందీ తీసికెళ్లి రాయప్పగారింట్లో వేశాము. శుద్ధ పాడ్యమినాడు మా దొరసానీ, పిల్లలూ మళ్లీ పుట్టింటికి వెళ్తారని మేము పదిమందిమీ ఎక్కడ పడితే అక్కడ చెప్ప మొదలు పెట్టాము. దీనివల్ల ఊళ్లో ఒక మార్పు కలిగింది. అదివరకు ఎదురుగా ఉండేవాళ్లకు కూడా జాలి పుట్టింది. నేనంటే అక్కడక్కడ కొంచెం లోకువ కూడా అయింది. "వీడేమో పెద్ద అట్టాచేస్తాను, ఇట్టా చేస్తాను అన్నాడు. కాగితాలన్నీ రాయప్పగారి వైపునే ఉన్నవిట" అని కొందరు, "ఉంటే మాత్రమేమి? ఆయనపిల్లలను అన్యాయం చేస్తాడా" అని మరి కొందరు. "కాగితాలెట్లా ఉంటే నేమి, పంపకాలయినయ్యా లేదా. పంపకాలైతే పిల్లలాస్తి పిల్లలదేను" అని అందరూను. నేను ఒక రోజున తాణాకు పోయి తాణేదారు గారితో చెప్పేను. ఆయన "ఒరేయి వల్లా, నీవు నీ కొరంతవాడవురా. ఈ సాహసం నీ దొర దగ్గర ఉండేది. ఇదంతా చేసిన తరవాత తేలిక అనిపిస్తుంది. ఏమున్న దనిపిస్తుంది. ప్రభువు దర్శనం కావటం, దొర నీ వంక చూడటం, చూడటంతోటే నీవు వాళ్ల ముక్కల్లో అంత పాపగేటట్టు చెప్పటం, ప్రభువు కన్నుతిప్పటంతోటే ఇటు లేచిరావటం, ఇది ఎవరో మా నియోగిబిడ్డలు చేయవలసినపని. మాలో కూడా రాజసభల్లో మెలిగేవాడికి తెలిసేదికాని ఇంకోడికి తెలియదు" అన్నాడు. నేను "స్వామీ, అంతమాటెందుకు? శుద్ధపాడ్యమికి తమరు మా ఊరు దయచెయ్యాలి. ఈలోపుగా నా దొక్క మనవి. ప్రభువులు తమరు ఒక్కసారి అక్కడకు రావాలి. నేను ఊరంతా మైకంలో పెట్టాను. నేనందరూ చచ్చిపోయినా ననుకుంటున్నారు. ఆరోజున చచ్చిపోలేదని చూపిస్తాను. వాళ్లందరూ నివ్వెరపోతారు. ఆనివ్వెరలో విచ్చిన వాళ్ల కళ్ల వెలుగుల్లో ప్రభువుల దయ అనే చకిముకి రాయి పెట్టి నాదొర ఇంట దీపం వెలిగిస్తాను" అన్నాను. తాణేదారు నావంక నిదానించిచూచాడు. నేను శలవ తీసుకుంటా నన్నాను. ఆయన "ఒరేయి, ఇక్కడెందుకు పుట్టేవురా?" అన్నాడు. నేను ఆయనపాదాల దగ్గిర తలమోపి ఇంటికి వచ్చాను. ఇంటికి వెళ్లి మా దొర పొలం రాళ్లన్నీ పంపకంనాటి ప్రకారంగా అన్నీ సరిచూచాను. అమావాస్యనాడు రాత్రి ఒకనాగలి తీసుకోపోయి ఎవ్వరికీ తెలియకుండా మాదొరపొలం ఎక్కడెక్కడ తెగకొట్టుకున్నారో అదంతా బద్ధింపుగా చాల్లు తీశాను. మరునాడు ప్రొద్దున్నే మునసబు గారింటికి వెళ్లేను. మునసబుగారు మొగం కడుక్కుంటున్నాడు. 'ఆపద కడవంటెట్టను' అన్న పద్యం చదివేను. ఆయన 'ఏమిరా' అన్నాడు. "దొరా, నిజం మీద నిలవాలి. ఇవ్వాళ నీవు నిలబెడితే నా దొరలు నిలుస్తారు. ప్రొద్దెక్కేటప్పటికి తెలుస్తుంది. నీపాడి








రెండు ఆకుల ఒక చిగురు....

"రెండు ఆకుల ఒక చిగురు" తుంచటం మేలురకపు టీకి ప్రమాణపద్ధతి. ఇందువలన లేత ఆకులుమాత్రమే ఏర్చి తీయబడగలవు.

బ్రూక్ బాండ్ పద్ధతి ననుసరించి వర్తకులకు మా స్వంత విక్రయదారుల చేత తరచుగా తాజాసరకు రవాణాచేయబడుటవలన ఈ "రెండు ఆకుల ఒక చిగురు" మీకు అతి రుచికరమైన స్థితిలో లభించగలదు.

భారతదేశమందు గల అన్ని ముఖ్యప్రదేశములలోని డిపోలనుండి ఎప్పటికప్పుడు మా విక్రయదారులచేత సరకు తీసికొనబడి మాఫాక్టరీలనుండి తిరిగి తాజా టీసరకుచేత నిరంతరమూ నిలవ చేయబడుచున్నది.

మంచి రుచిగల స్వచ్ఛమైన టీని వాంఛించువారందరికీ డార్జిలింగ్ బ్లెండ్ టీ ఆదర్శప్రాయమైనది.



బ్రూక్ బాండ్

ఆవు! నేను మందుపోశాను" అన్నాను, వెళ్లాను. గంగడితో నాయకుడి దగ్గరకు వెళ్లేను. నాయకుడితో అన్నాను: "నీతాత వాడుకున్న చెంబు నీ కెల్లాంటిదో నా తాతలు చేసిన పాలేరుతనం నా కల్లాంటిది. మన ప్రభువులు హైదరాబాదునబాబు క్రిందివారు. వాళ్లు ముసల్మానులు. నీవు ముసల్మాను. మధ్య ఉన్న మా ప్రభువు నామతంవాడు. నామతం మంచిదో నీ మతం మంచిదో ఇవ్వేళ తెలియాలి. నామతం మంచిది చేశాను. నీమతం మంచిది నీవు చెయ్యి" అన్నాను. కరణంగారి దగ్గరకు వెళ్లాను. "దొరా, చెప్పులు మెత్తగా ఉన్నాయా" అన్నాను. ఆయన "ఉన్నైరా. ఏమిలాభం? నీవు చేస్తానన్నది చేయలేకపోతివి" అన్నాడు. ఆయనతో అంతా చెప్పేను. ఆయన "మునసబుతో కూడా చెప్పేవా" అన్నాడు. "దొరా, ఇంకొకడికి చెపుతానా? నీవునియోగివి, అందుకని చెప్పే" నన్నాను.

మా నాన్న చెప్పినది.

ఆమధ్యాహ్నం జమీందారు వచ్చేడు. అంతా అరగడియ పట్టలేదట. వ్యతిరేకంగా ఎవ్వడూ ఊళ్లో సాక్ష్యం ఇవ్వలేదట. రాయప్పగారు ప్రతిదానికీ 'నిజమే, నిజమే' నన్నాడుట. అంతా ఊరికరణం కలిపించుకొని ప్రభువుముందరనే లెఖ్కలన్నీ మా నాయనమ్మపేర వ్రాశాడట. ఇప్పటికీ లెఖ్కలన్నీ బామ్మ పేరే ఉన్నవి. ఆమరునాడు ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోయిందట. పదిమంది పాలేర్లూ పోయి మళ్లీ జొన్నలబస్తాలింటికి తెచ్చారట. పదిజతల ఎడ్లనీ మళ్లీ తీసుకొచ్చి మాపాకట్లో కట్టివేశారట. రాయప్పగారు మాటాడలేదట. వల్లణ్ణి చూస్తే రాయప్పగారికి వాడు చచ్చిపోయేవరకూ భయమే. తరువాత పదిరోజులకు బామ్మ వెళ్లి రాయప్పగారిని మా తాతయ్యఆర్ధీకానికి భోజనానికి పిలిచిందట. ఆయన "వస్తానులే వస్తాను. ఎందుకు రాను" అన్నాడట.

ఈ కథంతా మా నాయనగారు ఆరోజున రాత్రి నాకుచెప్పేడు. నాకు తెల్లవార్లూ నిద్ర పట్టలేదు. మరునాడు ప్రొద్దున్నే వాకిట్లో కూచున్నాను. వల్లడు మళ్లీ కేకలువేస్తూ వచ్చాడు. వాణ్ణి చూట్టంతోనే 'వల్లా' అని పిలిచి నేను ఏడవటం మొదలెట్టాను. వాడు నిన్నటికీ నేటికీ భేదం చూచాడు. గ్రహించాడు. వాడి తెలివిముందర నేనెంత? ఇంతలో మా నాన్న వచ్చాడు. "ఏమయ్యా, కుర్రాయనకు చెప్పేవా ఏమి నాకన్నంతా? బలే తెలివిగలవాడవు! కుర్రాయన కేమి తెలుసు"అని, నావంక చూచి "అవన్నీ ఒట్టిమాటలు బాబూ. మీ నాయన అంతేలే. అన్నీ కలిపించిచెప్తాడు. బాబుగా. ఏడవకు" అని అదొక విసురు తెచ్చుకొని "ఏడిస్తే పొలం ఎల్లా చేస్తావ్? లే, లే" అన్నాడు.

మళ్లీ నేను స్కూలికి వెళ్లాను. నమ్మండి, నమ్మకపోండి. వల్లప్ప అని ఎక్కిరించినవాళ్లకి నలుగురికీ ఫెడేలు ఫెడేలుమని లెంపకాయలు పేలినై. మళ్లీ నన్నన్నవాడు లేడు. నేను అప్పటినుంచీ మాపాలేరుకు మల్లే వీరవల్లణ్ణి అయినాను. చెప్పలేదు కాబోలు. మా ఊళ్లో అందరూ మాపాలేర్ని వీరవల్లడనేవాళ్లట. అదీ.

శివతాండవము

శ్రీ బొడ్డు బాపిరాజు

మధుర దేవాలయములు శిల్పకళాసేవధులు. అందునా సుందరేశుల హజారము ఆనందపీఠము. వేయిరేకుల విరిసిన ఆ విన్నాణములలో ఒక స్తంభభిత్తికపై నాహృదయాంతరముల మూసకట్టుకొనుచున్న మూర్తికి ప్రతికృతివలె నున్న దివ్యశిల్పము సాక్షాత్కరించినది. తన్మనోజ్ఞసౌందర్యశ్రీని అక్షరములలో బంధించుటకు చేసిన పరిశ్రమమే ఈ 'శివతాండవము.'

కైలాసశైలశిఖరము - లాలో కిలకిలను నవ్వినటు లభ్రధునీ
వేలావని నినదించెను - నీలగళోచ్చరణకింకిణీనిక్వణముల్.

ప్రమథప్రౌఢపరిష్క్రియామధురనైపథ్యానుసంధానవి
శ్రమముల్, హైమవతీదరస్మితపురస్కారానుమోదా, లుప
క్రమశంసత్క్రియనందికేశ్వరమృదంగధ్వానముల్ పొల్చె చి
త్రములై ఆ మలుపచ్చిసంజ శివనృత్యారంభసంరంభముల్.

ఆనర్త్యేశజటాభరమ్ములు వియద్వ్యాప్తమ్ము లంత స్తప
శ్శ్రీసంజాతశిఖాసఖమ్ము లయి వెల్గెన్; సాంధ్యకిమ్మీరశో
భాసంపృక్తము స్వామిదేహ మపు డభ్యసించె నుద్యోతితా
శాసర్వస్వము లైన హేమహిమవచ్ఛైలాగ్రవాల్లభ్యముల్.

నర్తించెన్ త్రిపురారి విస్ఫురితచంద్రాంశుప్రవాహామృతా
వర్తమ్ముంబలె, నంత నంతరితశంపావల్లరీవిభ్రమ
స్ఫూర్తిన్, పిమ్మట నొక్క దీర్ఘతరతేజోరేఖయై తత్ప్రభా
మూర్తిప్రోజ్వలితం బజాండము సితాంభోరుట్ప్రమత్కమ్ముగా.

అల కౌమారమయూరతాండవరహస్యాధ్యాపకమ్మున్, ముహు
శ్చలదాభోగఫణీంద్రభోగమణిభాస్వంతమ్ము నుద్యత్కళా
కలశాబ్ధిస్ఫుటవేలగా నిజశిరఃఖండేందుని స్తంద్రశో
భల నర్తించె పురారి హారిగిరిజాపాంగప్రతిస్పర్ధియై.

కలికావ్యాజమునన్ పృషచ్ఛలమునన్ కాంతివ్యళీకమ్మునన్
పులకించున్ చెమరించు కంపమును బొందున్ ప్రాకులే మబ్బులే
మలలే ఒక్క మహానుభూతి నఖిలం బాచేతనాచేతన
మ్ములు మేనుల్ మరచెన్ సబాష్పవదనమ్ముల్ శైవలాస్యమ్ములో.

ఉదితానందవిముగ్ధ పారిషద 'సాహో!' నాదమంద్రశ్రుతుల్
కదలెన్ మన్మథవిద్విషత్పటహనిక్వాణమ్ము లుద్ధూతబు

ద్బుదలీలావలయమ్ములై విరిసి మూర్ధ్నోమ్మెసెఁ ద్విధావార్ధినీ
రదనిశ్రేణి రసాతలత్రిదివపౌరస్తోత్రపాత్రక్రియన్.

గరళగ్రీవనటజ్జటాపటలవల్గద్గాంగకల్లోలశీ
కరముక్తాఫలమాల నీలజలదాకాశమ్మునఁ జిందె, సుం
దరతారావళిగా వెలింగి సురకన్యల్ స్వామిపై జల్లు క్రొ
వ్విరులం జారు మరందబిందువుల సేవించెన్ మహాదేవునిన్.

అతిరమ్యమ్ములు రాజతాచలవిశాలాధిత్యకల్ పార్వతీ
పతినృత్యత్పదపారిజాతముకుళస్పర్శన్ ప్రమోదాశ్రుసం
గతరోమాంచములై చిరంతనతనూకాఠిన్యముల్ మాని మా
నితపుష్పాతిమృదుత్వముం గనె భవానీజాని కక్లిష్టతన్.

చూడాలంకృతచిత్రరత్నరుచిరింఛోళిప్రథన్ తాండవ
క్రీడాకుంచితకృత్తివాసకుటిలాంఘ్రిచ్ఛాయ లంతంత పా
రాడెన్ తద్గిరిశృంగసీమ; పతి సాలప్రాంశువై వెల్గు రా
పాడన్ నిల్చెను వజ్రనిర్మితమహాభ్రచ్ఛత్రదండమ్ముగా.

అమృతప్యూథమొ, రౌప్యభూమిధరమో, ఆలోలకల్పద్రుమ
క్రమమో, నాథుని నృత్యమో, నవసువర్ణాబ్జావదాతావతం
సమొ, జాబిల్లియొ, తత్కృతస్మితములో, సారాపగావాస్తుహా
రములో ఏర్పడవయ్యె నంతవరకౌరా! సర్వశుక్లద్యుతిన్.

పతినృత్యాంతమునందు హో జరఠసర్పస్వామి నిట్టూర్పివై
ద్యుతతత్పాదనఖాగ్రపాతనిపతద్భూభారసంస్థాపనా
నతశీర్షమ్ములు వేయియున్ నిలుపుకోనయ్యెన్; జగన్మోహనా
ద్భుతరేఖన్ కనుపట్టె నాస్తిమితశంభుస్వచ్ఛసౌందర్యముల్.

అనిమేషత్వము నొంది ప్రత్యణువు దివ్యంబై తతఃపూర్వన
వనవీతాసుఖలుబ్ధమై తెలియులేఁ; దాతాండవం బంత ని
ల్చినకానీ తన చిత్తమందు విభు డట్లే యాడుచున్నట్లు కాం
చెను మోదించెను హా మ్మదెంతటి తపశ్శ్రీయొ! రసోద్రేకమో!

ఒక విద్యున్మణిమేఖలాబ్దశకలం బుల్లాభమై స్వామిపై
ప్రకటించెన్ తన భక్తి; ఒక్క చపలప్రావృట్పయోవాహ మూ
రక చిల్కించిన దంబువుల్ కుసుమవర్షప్రాయముల్; లేమొయి
ల్లోకరెం డ్లాప్రభుసేవకై నవి యొడ శ్లాఘించి వింజామరల్.

మధుమందానిలముల్ సమస్తఋతుసంపత్పుష్పసౌరభ్యసా
రథులై వీచి శ్రమాపనోదనవిధాప్రస్ఫూర్తి రంజించె న
వ్విధుచూడామణి మానసమ్ము దివిషద్బృందమ్ము లేపూర్వపుం
గథలో పాడి యొనర్చె సన్నుతులకన్నఁ మిన్నగా నర్తిరిఁ.

ఆనందామృతసేకమై సకలలోకాతీతమై వెల్గు లీ
లానృత్యన్మధురస్వరూప మిది నిల్పఁ లే మనల్పవ్యథా
లీనం బీహృదయంబునం దనుచు నార్తిఁ దేవతాశ్రేణు లీ
శాన శ్రీనఖపంక్తులఁ చిలికె కెంజాయల్ కిరీటద్యుతిఁ.

అటు నటనానిరీక్షణమునం దవశమ్మయియున్న చిత్తము
త్కటపటహాస్వనమ్మున పదంపడి తేరుకొనన్ భవానిచెం
గట కరుదెంచి భర్తృచరణాబ్జములఁ రవణించు గజ్జెలం
తట కుతుకమ్మునఁ తనకు తానయి విప్పె నమస్క్రియామిషఁ.

నిలుడంచున్ తొలి నమ్మహానటునకుఁ నీరాజనంబెత్తి, పూ
వులు పైజల్లిరి సప్తమాతృకలు; శంభుప్రీతికై నందికే
శుల కఁ సన్నల చిత్రచిత్రనటనాస్తోమమ్ము కల్పించి వా
రల నవ్వించిన దంతలో ప్రమథవర్గం బుత్సవవ్యగ్రమై.

సతి కేలూత యొసంగ నున్నతవృషస్కంధమ్మునం దుండి స
స్మితదృష్టిఁ దిగుపోల్కి భూధరశతీశృంగమ్మునం దుండి సం
చితసర్వప్రమథావృతుం డగుచు విచ్చేయంగ నచ్చె జగ
త్త్రితయమ్ముఁ జయపెట్టు శంకరు నుమాదేవీసమేతమ్ముగఁ.

అని యేమో రచియించు నాకనులయం దశ్రుప్రవాహమ్ము లూ
రెను, నేనే రజతాద్రినై పతిన శాంఘ్రిచ్ఛాయ నాయీ శిర
మ్మును కైవ్రాల్చినయట్టులయ్యె, తను వుప్పొంగెఁ, ఎదో జ్యోతిలో
ననువర్తించె వచింపలే నపుడు జ్ఞానాజ్ఞానమధ్యస్థితిఁ.

ఏచిరకాలభవమ్మున - చూచినదో ప్రభుని సాంధ్యసుందరనృత్యం
బీచిన్ని యెడద దాగి అ-యాచితమై యిటు తనంత నాకృతి నిలిచెఁ.

సూరనార్యుని శాలీనుఁడు

= శ్రీ వేదము చంద్రశేఖరయ్య =

కావ్యప్రబంధయుగమున నవ్యమార్గానుసారియై వన్నెకెక్కిన మహనీయుఁడు పింగళి సూరనార్యుఁడు. ఇతని కృతు లనేకము లున్నను నందు సర్వజనాదరణీయమై పండితప్రశంస లందిన మహాకావ్యములు రాఘవపాండవీయము, కళాపూర్ణోదయము, ప్రభావతీప్రద్యుమ్నము.

అపారపాండితీప్రకర్ష, నవీనకథాకల్పనా చాతురి, నవ్యకావ్యరచనాధురీణత లక్ష్యలక్షణయుతముగఁ జూపినవాఁ డీమహాకవి.

కావ్యములం దేయే పాత్రల కెంత యుచితస్థాన మీయఁదగునో, ఏయే పాత్రల నెట్లు పోషింపఁదగునో చక్కఁగఁ జిత్రింపఁగల సమర్థుఁడు.

కాని కళాపూర్ణోదయమున శాలీనపాత్ర పోషణ నించుక విచారింపవలసియున్నది.

శాలీనుఁడు సృష్టిసౌందర్యరసాస్వాద కుతూహలుఁడు; అపారవిద్యాసాగరపారంగతుఁడు; వాణీకృపాకటాక్షవీక్షాపాత్రుఁడు.

దౌహిత్రాంశచే సద్గతు లందఁదలఁచిన తల్లి కేకైకపుత్రిక సుగాత్రి. పతివ్రతాతిలకము. నిరుపమానసౌందర్యవిరాజిత. సరస్వతీ వరప్రసాదముచే "ఘనౌఘసముదగ్రఘుర్ఘురార్భటులతోఁడి యుద్ధతపు వృష్టి"నుండి తన భర్తను, పూఁదోఁటను రక్షించినది. మఱియు "నిల్లువెడలు తనకు వృష్టిబాధ దొరయకుండ తొలఁగుటయు, వెల్లియైన జలపూరంబు పాయుటయు" తన పాతివ్రత్యమహిమము.

అట్టి రమణీమణిని చేపట్టినవాని భాగ్యమే కదా భాగ్యము! కాని, శాలీనుఁడు తాను ప్రకృతిసౌందర్యపిపాసు వనుచు తన ధర్మమునే చంపుకొనుచున్నాఁడు.

ఇతఁడు తన ధర్మపత్ని విషయమునఁ గావించిన యమోఘశిక్షాశాసన మేశిక్షాస్మృతియందును లేదు.

పాప మాముద్దరాలు అనురాగము వెల్లివిరియ భర్తతోఁడి ప్రథమసమాగమ కాంక్షతో నాతనికి తనయందలి తమి మిక్కుటముగ కలిగించుటకై కడునలంకారకలితయై చని యాతనిచే నిరాకృత యైనది.

శాలీనుని కిట్టివి పనికి రాకపోవచ్చును. అయినను పాప మాయిల్లాలిని - అనురాగవతిని - వేధించుటలో నాతని యభిప్రాయ మేమి ? కవికి కలిగిన లాభమేమి? శాలీనుని స్వభావము కడవఱకు తెలియక చదువరి తికమకపడుటతప్ప మఱియొకటి కాన్పింపదు.

ఈవిషయమున పెద్దనార్యుఁడు తన ప్రవరుని "వాని చక్కఁదనము వైరాగ్యమునఁ జేసి కాంక్షఁజేయు జారకామినులకు భోగబాహ్యమయ్యె పూచిన సంపెంగపోలువు మధుకరాంగనలకుఁబోలె" నని ముందుగనే చిత్రించుకొన్నాఁడు. కాన మందుఁడని గాని,

ఛాందసుఁడనిగాని ప్రవరుని నిందించిన పెద్దన కోపగింపఁడు - అనుటకును వీలులేదు.

మఱియు సుగాత్రి మొదటిసారి తిరస్కృతమైనను వదలలేదు. సఖు లనేకవిధముల బోధించిన యుక్తులన్నియు - ముగ్ధలకు సహజమగు లజ్జాపూర్ణమైనను-నాఁడొనరించి చూచెను. కాని యెందును ఫలితము గానక నింక నేమి ప్రపంచంబు చేసిన నెఱియనెడసి పోవుటయతక్క ప్రయోజనం బేమియు లేదని, పతివ్రతగావున "నాకు మంగళసూత్రం బీపాటి శుభస్థితి నుండుట పదివే"లనుచు నెంచుకొనియె; నెంచుకొని వేఱొక్కలాగున నుండక "తన కనుకూలుఁడు గాకున్న నునాతనికే నాయురభివృద్ధికరంబులని వివిధాలంకారంబు లెప్పుడు నేమరక దాల్చుచుఁ దన తల్లి యతని నేమియు నిట్టట్టాడకుండ బ్రార్థించుచుండె"! ఔరా! ఆమెపతిభక్తి!

తరువాత కొన్ని మాసములు గడచినవి. కాని ముగ్ధయగు నామెకు భర్తమనోవృత్తి నరయు శక్తి లేదు. నానాఁటికి పెరిగెడు ఆమెయలంకరణమే యిందుకు సాక్షి.

కాని విద్యావంతుఁడగు నాతఁ డామెకు తన స్వభావ మెఱిఁగించుటలో తప్పేమి?

ఆమె సహజ సౌందర్యాతిశయ. అట్టిది నిరర్థకాలంకరణచే మూల్యము చెడుచుండ సహజ సౌందర్యపిపాసువగు నాతఁ డడ్డు తగిలి చక్కదిద్దుట యాతని విధికదా?

ఒక సుందరోద్యానవనమున సహజసౌందర్యయుతమైన పుష్పలత రామణీయకరసాస్వాద మహానందమున మునిఁగియుండ నాప్రసూన విఘాతలక్షణము లేర్పడుచుండ నెవ్వఁ డడ్డుతగులఁడు?

ఉషఃకాలమందు మందమలయాని లాంకురముల నరికట్టు తెరచాపల నే ప్రకృతిసౌందర్యరసపిపాసి తీయింపకుండును?

సృష్టిసౌందర్యజిజ్ఞాసు వేతత్ప్రేషణ దోహదము లహోరాత్రము లొనర్చుట సహజమేకదా!

అట్టిచో ననుకూలవతి-అనురాగవతి - అనురూపవతి యగు భార్యకు మనోభావ మెరుకపరుపకుండుట - ఆమె వైపైనను తిరిగి చూడకుండుట మూర్ఖత-మూఢత యగును.

ఉద్యానవనమున నిరస్తభూషయై పతి నలరించిన వెనుక "తనదు భూషణంబు లెల్లను ప్రేమంబునఁ దొడిగి గృహమున కల్లన నడచె." ఆమె కాభూషలయం దెంత నమ్మకము? ప్రేమతోఁ దొడిగినదఁట! అంత ప్రియము, విశ్వాసము గల భూషణములకు వల్లభుఁడు వ్యతిరిక్తవ్యక్తి యని యెట్లూహింపఁగలదు? అతఁ డానమయమునను దెలుపలేదు. అప్పుడైనను సుగాత్రిసహజ సౌందర్యమునకుఁ, బ్రకృతి సౌకుమార్యమునకు జంటఁ గూర్చియుండిన కొంచె మామె యెఱిఁగెడిదేమో? అదియు జరుగలేదు.

పోనీ, నాఁటిరాత్రి భూషణాలంకృతయగు నామె పడకటింటి కేతెంచి "కడు ద్రిమ్మటచే శ్రమనొందినారు గాఁబోలును? బోదునా? నిదురబోయెదరే" యని యడుగ నాతఁడు "పైకొన్న పరాకున నే కోర్కని వచ్చితనియె." చూచితిరా సరసము!

ఆమె యంతటితోఁ బోక "లోకము వారలు పతికడ కేకోర్కని వత్తు"రనియె.ఇంతకన్న వాచ్యముగాఁ జెప్పవలయునా? ఇప్పుడైన నామహనీయుఁడు తన హృదయభావము

తెలుపవచ్చును. ఆ పగలున నుద్యానవనమున నుండిన యామెసహజసౌందర్యము - అప్పటి యామెకృతకసౌందర్యము వివరించి యప్పుడు తా నొల్లకుండుటకు కారణము చెప్ప వచ్చును.

ఆమెయు పోసిక "ఇతరంబులు పోని మ్మా పాటిదైన బుద్ధి కలిగి నామానసములోని కోర్కుల పూనిక యడిగితిరి. వేగుజాము య్యె. పొందికగాఁ బాదము లొత్తరమ్మనుటగానీ, యొంటి యేమోకదా నికటమ్మునకి నేగుదెమ్మనుటగానీ, కొంత నెయ్యంపుఁబూనికతోఁ గన్నులువిచ్చిచూచుటయగానీ లేద యొక్కింతయుఁ." అన్నది. పాపము కన్నులుకూడ గట్టిగ మూసికొన్నాఁడఁట—అది యేటి రసపిపాసువు?

మేఘశకలములమధ్య దోబూచియాడు చిన్నచందురుజిలుగు తరుగునా?

కంటకలతలచే పైకొనఁబడిన గులాబి మొక్కయందలి పుష్పపరాగసౌరభములకు కొరకల్గునా?

గాఢతమిస్రాఘనఘనార్భటుల మధ్య జిగేలుమను మెఱపుల యొఱపు విరుగునా?

నవరత్నస్థగిత చారు స్వర్ణాభరణ యయ్యు నామెసహజసౌందర్యము డిందుపడి నదా?

అతఁడు మూసిన కన్ను తెరువలేదు కదా? ఎట్లు కానగును?

ఆపతివ్రత "అతని పాద మల్లనపట్టి యొకింత యొత్తుచునె పాన్పుకడ న్వైనగూరుచుండి హాంబట్టున నొప్పై నూరువులపై నిడి యొత్తి తదంఘ్రి యంత జక్కట్టుపయిఁ ఘటించుచును గన్నులఁ జేరుచుకొంచుఁ జెక్కుటఁ గట్టిగ నద్దుకొంచుఁ దన గాటపుఁగూరిమి" తెల్పుచున్నది. ఇంతకును నాతఁడొక రాతివిగ్రహము గాకున్న నొక్కపలుకైనను పల్కఁడా!

మఱియు నామె "చిత్తము వేఱొకర్తు పయిఁ జేర్చితిరేమొ? ఆయక నావశమైనఁ బంపుఁడేఁ దెత్తు నవశ్యము. దేవరకుంబలె నవ్యధూటికిం దొత్తగుచుం బనుల్ సలుపుదుఁ" మఱియు "మీామది కొదదీరినఁ జాలు నమ్ముకొనవలసిన నన్నమ్ముకొనుఁడు. ఏమి చింత యిది." ఇన్నివిధముల బ్రార్థించియు నిరుత్తరమైన యాతఁడు మానిసియా, దారుప్రతిమయా? ఏసాధ్వి యింత ప్రార్థించినది? అట్టి సాధ్వియం దట్లుండుటయేనా యాతని ప్రౌఢతనము? ఔరా! ఎట్టి సౌందర్యపిపాసి యతఁడు-మూర్ఖుఁడుగాక! ఇంత తెలియఁబలుకుచున్నను నొకమాటనైనను బలుకకున్నవాఁడు.

ఆమెచిత్త మెన్నివిధముల భగ్నమై యుండును? అభిమానవతియగు స్త్రీ యంతపరిభవ మనుభవించి యెంతటికి సాహసింపదు?

అది యాతని సహజసౌందర్యరసాస్వాదన కుతూహలతయా? లేక సహజసౌందర్యసాధ్వీహృదయాభిఘాతకఠినతయా?

సూరనార్యుఁడు పాతివ్రత్యమున కెక్కుడు పోషణ నిచ్చి సుగాత్రిని చక్కఁగ దిద్దితీర్చినాఁడు. అంతటితోఁ దృప్తిజెంది శాలీనుని యిట్లు చిత్రించుటలో నాతని యభిప్రాయ మనూహ్యము.

సాక్షాత్కృతి

*

— శ్రీ ఊటుకూరు ఆంజనేయ శర్మ —

ఈ హృద్వీథిని గోచరించితివి తల్లీ! చంద్రికా స్నిగ్ధ శో
భా హాసైక మయంబుగాఁ దలఁచితో? భాస్వత్కరారజ్య దం
భోహేలాస్పద మంచు నెంచితివొకో? పుంజీభవద్దుఃఖ దు
ష్టేహాకల్మషిత మ్మగమ్య మిది తల్లీ! నీకు విశ్వంభరీ!

నిను నీ కంటకసంకులంబగు హృదిన్ వీక్షంగఁ బ్రార్థింతునా
జననీ! సంతత త్వత్పదాంబురుహ సంసక్తాత్ములుం గూడఁ గాం
చని యీ దివ్యవిభూతి చేతులను విస్తారింతునా? లేజివు
ళ్లను గేరంజను నీపదమ్ముల శిలల్ కందింపఁగా నోర్తునా!

నే నుత్పాటితధైర్య దుర్బలుఁడఁగానీ, కానిచో వాగతీ
తానందంబున స్వాగతం బిడఁగలేనా? కించి దామీలన
వ్యానమ్రమ్మగు కన్నుదోయిఁ జిరముత్కంపుం జడుల్ రాల్పలే
నా? నీరంధ్రిత భక్తిచే హృషిత సర్వాంగుండనై యుండనా?

ఒక సౌవర్ణ నిమేష మూర్ఛిత మహాత్మోద్భాసిమై జన్మ సా
ర్థకమైపోఁ గనె నాకయుత్కలిక, మద్భాగ్యమ్మునన్ పూచి పూ
యక నే దివ్యఫలం బొసంగె నది! భ్రాంతాత్మం డెవం డట్టి భా
వుకమున్ తాను పరిత్యజించును? కృపాపూరాయితాత్మాకృతీ.

ఎన్నో జన్మములన్ భవత్పదయుగీ హేవాకినై తీవ్ర వాం
ఛోన్మాహంబులలోఁ దగుల్పడని హృద్యోగంబునన్ జేయు సం
పన్నంబైన తపఃఫలంబుగద! త్వత్పాదాంబుజ ధ్యాన మీ
హృన్నాళీక మిదం ప్రకారమగు నా యీ భాగ్యమున్ వీడునా?

ఫాలంబందు ఘటించుకొందును, కరాబ్జాతంబులం జేర్తు, దృ
గ్జాళీకంబులఁ గప్పుకొందు, నెద సంధానింతు; నాపుణ్య మే
పాలో నేఁడు ఫలించెఁ గన్పడె భవత్పాదాబ్జముల్, పుట్టువుం
గోర్కెన్ ప్రోవులువడ్డ పాపతతి గగ్గోలయ్యెఁ గాత్యాయనీ.

ఇవి నాళీకములైన మత్తమధుపం బే నయ్యెదన్, చిత్ప్రభా
ధవళంబౌ నమృతాబ్ధియైన నట నేఁ దంబౌలి హంసంబ, న
వ్యవధానం బయి పూర్ణతారుచిర దివ్యజ్యోతి యైనన్ తదు
ద్భవ తత్త్వంబయి మేరలొత్తెడి మహత్త్వం బంది పొల్పారెదన్.

ఇంద్రగ్రహము చేసిన ఇంద్రజాలము

❋

= శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు =

"ఐనది: మంగళహారతి: అదృష్టము చాలని ఆఁడుబిడ్డను అక్కఱలేని అల్లుని చేతిలో పెట్టిననాఁడే అయినది. విద్య, బుద్ధి, రూపము, ధనము, ఆభిజాత్యము గల అల్లుఁడు దొరికెనని మురిసి, ఇతర మేమియు గమనింపక తాళికట్టించిననాఁడే అయినది. కన్న కష్టముల నోర్చి, పడరాని పాట్లు పడి, ఎందఱినో ఆశ్రయించి, పంద్రెండు సంవత్సరములు కాచినా ఫలము కానరాక, కడకు పష్టెఁడు ప్రసాదమునకయినా మార్గము కల్పింత మనుకొంటిని. కాని ఈ సివిలుకోర్టువ్యవహారమో, "దినగండము-దీర్ఘాయుస్సు." ముప్పదివాయిదాలకు తిరిగి మూఁడేండ్లు కాచినా మూఁడో నాలుగో రూపాయలు భరణము నిర్ణయించుటతప్ప వేరు మోక్ష మేమున్నది? కఠినహృదయులను కోర్టు లేమి చేయును? దిక్కులేని పక్షి వలె దీనురాలై కోర్టువరాండాలలో నాకూఁతురు కూర్చుండ వలసివచ్చుటను చూచి భరించలేక, పెద్దమనుష్యులు చెప్పినంతకే సమ్మతించి వ్యవహారము చాలించుకొని మరలిపోవుచున్నాను. ఇంకేమి కావలయును?"

వచ్చినపని అయినదా యని నేను ప్రశ్నింపఁగా నొక పెద్దమనుష్యుఁడు నాకిచ్చిన ప్రత్యుత్తరపు ధోరణి యిది. మంచి ఆభిజాత్యము, ఆభిజాత్యమునకు తగిన యున్నత విద్య, విద్యకు తగిన రాజకీయోద్యోగపదవి, పదవికి తగిన గౌరవమర్యాదలు, ఇన్నిటికి సరివచ్చు శీలసౌహార్ద్రములు గలిగి, కడుపునిండ నాఁడుబిడ్డలను గన్న పరమసాధువతఁడు. ఉద్యోగధర్మములో కాని, ఇతరవిధములుగా కాని పరులను నొప్పించి యెఱుఁగఁ డామహాధీయుఁడు. నిరంతరహసన్ముఖుఁడైన నిత్యసంతోషి; అజాతశత్రువు; ఏకర్మము నెఱుఁగని యమాయకుఁడు — అలవికాని యల్లుని సంపాదించుకొన్న కర్మమతప్ప!

ఈకథ ౧౯౩౪-వ సంవత్సరము డిసెంబరునెల నాఁటిది. అప్పటికి దాదాపు పదునారుసంవత్సరములక్రిందట ప్రశంసలోనున్న పుత్రికవివాహము నతఁడు మహావైభవముతో జరిపెను. గొప్ప విద్యావంతుఁడగు జామాత లభించిన యానందముతో నతఁడు ఖర్చువెచ్చములను లక్ష్యపెట్టలేదు. తరువాత మూఁడుసంవత్సరములకు పుత్రి యత్తవారింటికిఁ బోయినది. కాని, మూఁడుమాసములు గడచీగడవకమున్నె యొకనాఁ డాకస్మికముగ-ఆహ్వానములేకయే ఆఁడుబిడ్డకోక నల్లుఁడు ప్రత్యక్షమయ్యెను. సామాన్యపరిస్థితులలో నిట్టి సంభవము మామగారింటి కొక పండుగవంటిది.

"జామాతా గృహ మాగతో యది తదా
క్షోమంచ కంథాయతే
రమ్యం దారుపరిచ్ఛదోచిత మహో
కుష్మేంధనం జాయతే,
సర్పి స్సింధుజలాయతే దధి వరం
హంతారనాళాయతే
కిం వాక్యై ర్బహుభిః ఫలం సమధునా
కాచాయతే కాంచనం" (స్నుషావిజయము)

ఇట్టి వర్ణన మప్పటికే చెల్లును. అత్తగారింటిలో నానందకళ తాండవమాడ నారంభించినది. కాని, ఈభార్యతో సహవాసము చాలించుకొని, పునర్వివాహమున కొక వధువును సంపాదించుకొను కుతూహలమున, ఈమెను పుట్టినింట చల్లగ దిగవిడిచిపోవుటకై జామాతృమహాశయుఁ డిట్లు దయచేసినాఁడని ఎవ రెఱుఁగుదురు? కంకిమ్మనక భార్యను పుట్టినింట వదలి యేదో సాకుచెప్పి యతఁడు వెంటనే స్వస్థానమునకు వెళ్లెను. మూఁడు నెలలు తిరుగకమున్నె దూరదేశమున నొక కన్యను సంపాదించుకొని యతఁడు రెండవ వివాహము చేసుకొన్నాఁడు. ఇది తెలిసి, ఆ యత్తమామ లెంత దుఃఖించిరో, పాప మాప్రథమజాయ యెంత పరితాపపడెనో ఎవరికి ముద్దు? అమాయకురాలును, సాధుశీలయు నగు పుత్రికను వెంటఁబెట్టుకొని పోయి తల్లి తండ్రు లెంత ప్రార్థించినా, ప్రాధేయపడినా, పంచాయతీలు చేసినా, ఫలమేమియు కానరాలేదు. ఉన్నతవిద్యావంతునకు వలసినంత నాగరకత యీబిడ్డకు లేదనుటే పరిత్యాగమునకు కారణమని పలువు రనుకొనిరి. పరమసాధ్వియగు నామెపై మోపుటకు పరిత్యాగముచేయుచున్న భర్తకునయితము వేఱుకారణము కానరాలే దన్నచో, ఆమెను కన్న కడుపుయోగ్యత స్పష్టమగును. కాని, భర్తకు నచ్చని గుణములకు బజారులో నేమి వెల?

ఏండ్లు కడచుచువచ్చినవి. చేసిన ప్రయత్నము లన్నియు చెడిపోవుటచే విసిక్కి, తల్లిదండ్రులు "కూఁతురు కాదు. కుమారుఁడు" అనుకొని నెమ్మదిపడిరి. తక్కిన పుత్రికల పెండ్లిపేరంటములో, కాన్పుకత్రలో జరుగవలసి యున్నవిగదా? వారి కథ యట్లుండ. వయస్సు వచ్చుకొలఁది ఆమెకు మనఃక్లేశ మధికమగుచువచ్చినది. తోడివారును, తోడఁబుట్టినవారును భర్తలయిండ్లలో కళకళలాడుచు కాపురములు చేయుచుండుట చూచుచు, తన భర్తయిల్లు తామరతంపరగా సపత్నిసంతానసౌభాగ్యములతో రాజ్యమేలుచుండుట వినుచు ఈ సాధ్వీతిలక మెంతకాల మోర్చియుండఁ గలదు? సవతికి దాస్యముచేయుటకైన సమ్మతించి భర్త యింట ప్రవేశమును సంపాదించవలెనని యామె యెన్నియో ప్రయత్నములు చేసినది. కాని, భర్తకు కరుణ రాలేదు. పది సంవత్సరము లిట్లే గడచినవి. కాలగతికాఁబోలు, భర్త హృదయమున కొంత మార్పు రాసాగెను. నీరుమోసి కొన్నాళ్లు, నీళ్లాడి కొన్నాళ్లు, నైసర్గికముగ కొన్నాళ్లు రెండవ భార్యకు మంచి దేహారోగ్యము లేనికారణమున ప్రథమజాయ యింటి పనిపాటలకైన పనికివచ్చునుగదా యను నూహ భర్తగారికి స్వానుభవముమీఁద వచ్చినది. కాని, అంతదూర మవకాశ మిచ్చుట అపాయకర మని, సూక్ష్మబుద్ధియగు రెండవ భార్య గ్రహింపకపోలేదు. నీతినియమములతోటి నిస్తులదేహపాటవము గల దాక్షిణ్యశీలుఁడగు భర్తసమీపమున, అనాఘ్రాతపుష్పమువలె లోఁబడుకొంటు నిండు తారుణ్యాభరమున నలరారుచున్న సవత్నిని చేరనిచ్చి, తాను మంచముమీఁద మూల్గుచున్నచో, ఏవేళ కెవరి కేమిబుద్ధులు పుట్టునో యనుభీతి యా మానవతికి కలుగుట యస్వాభావిక మనరాదు. తత్త్వము విచారించితిమేని— ఇహమున కాని, పరమున కాని—సామీప్యమునకు తరువాతి మెట్టే గదా సాయుజ్యము? ఆర్జించి యనుభవించుచున్న రాజ్యము నన్యుల కప్పగించుట కెవ రిష్టపడుదురు? చాకచక్యమునకు తోడు సంకల్పశక్తియుఁ గల యా ద్వితీయ భార్య సవతిని తన యింట కాలు సయితము పెట్టనిచ్చినది కాదు. ఇంటిలో నధికార మిల్లాలిదే కదా! భర్త తన యూహలను మార్చుకొనక యేమి చేయఁ గలఁడు? తన హీనజీవితమును నిందించుకొనుచు పాప మా ప్రథమభార్య నిరాశ చెందినది. పతి పరిత్యజించి పన్నెండు సంవత్సరము లగుచుండఁగా, తండ్రి యామెతో భరణమునకై న్యాయస్థానమున నభియోగము తెప్పించినాఁడు. ఈ పరిస్థితులలోనే నే నా పెద్దమనుష్యుని చూడఁగలుగుట. నా మిత్రుని యింట నతఁడు తన కూఁతురుతోడ విడిసియుండఁగా నే నచటి కేగియుంటిని. నా కతఁడు చిరపరిచితుఁడు.

నాఁటి మధ్యాహ్నము ౩ ఘంటల రైలుకు స్వగ్రామమునకు ప్రయాణముచేయు సన్నాహములో నా పెద్దమనుష్యుఁ డుండెను. సందర్భవశమున మా ప్రసంగము గ్రహచారము వంక తిరిగినది.

"మా పాపగ్రహచార మెట్లున్నదో? ఇంతేనా గతి?" అని యతఁడడిగెను.

ఈ క్రింద నున్నదే ఆతని పుత్రి సాయన జాతక కుండలి:—

<table>
<tr><td></td><td></td><td>శ ౫-౨౮
రా ౨౫-౩</td><td>శు ౨౬-౪౧</td></tr>
<tr><td>చ ౦-౩౬</td><td colspan="2" rowspan="2">భార్య జాతకము
—
(సాయనము)</td><td>ఇ ౧౯-౨౪
ర ౨౭-౪౬</td></tr>
<tr><td>వ ౨౩-౧
I ౬</td><td>బు ౨-౪
కు ౨౦-౫౧</td></tr>
<tr><td></td><td>కే ౨౫-౩</td><td>గు ౭-౧౦
X ౧౪</td><td></td></tr>
</table>

లగ్నము మకరము, నెమ్మది, ఓపిక, కార్యసాధనమునకు వలయు పట్టుదల, కష్టముల సహించుటకు కావలసిన శక్తి, ఆలోచించి పనులుచేయు నభ్యాసము, ఉరుకు దుడుకులు లేని యుత్సాహము, విశ్వసనీయమగు చిత్తవృత్తి-ఇవి సామాన్యముగ నీ లగ్న ధర్మములు. లగ్నాధిపతి శని పంచమకోణమం దున్నాఁడు. విషయవాంఛలలో నయితము 'శనైశ్చరత్వ' ముండును. తీవ్రమగు భావోద్రేక ముండదు. కావనే, నవనాగరక వేషములు, చాకచక్యము, తళుకుబెళుకులు ఇత్యాదు లీమె కభిమానపాత్రములు కాలేదు. రెండింట నున్న పూర్ణచంద్రుఁడు మితభాషిణి యీమె యని తెలుపుచున్నాఁడు. చంద్ర బుధులకు సమ సప్తక మున్నది. అనవసరముగా నితరులు తన యభిప్రాయములను తప్పుగా తలఁచురీతి ప్రవర్తించుట దీని లక్షణము. ఈ రెండు గ్రహములకు శని నుండి గుప్త శత్రు (కేంద్ర) దృష్టి గలదు. ప్రవర్తనమున మాంద్యమో, మౌర్ఖ్యమో, మౌగ్ధ్యమో లైట కానవచ్చును. చంద్రుఁడు భర్తృస్థానాధిపతిగదా? అగుటచే భర్తదృష్టిలో నీమె యనాగరకగా నగుపడు సంభవ మున్నది. ఆ భర్త

అత్రగాఁడైనచో. మఱింత కష్టము. దాంపత్యజీవితమున సంభవించిన వైమనస్యమున కిదియే కారణము. తన్మూల మున మనఃక్లేశము వియోగము సూచింపఁగలదు. ముఖ్య ముగా మకరమం దున్న వరుణునికి కటకమందున్న రవితో నున్న సమసప్తకశత్రుదృష్టి ప్రధానదోషము. స్త్రీజాతకమున నిది యుండెనేని భర్తతో ద్వేషమో, వియోగమో సూచిం చును. కాక, సప్తమభావమందే ఇంద్రుఁడునయుత ముండుట. అతృప్తికరమగు వైవాహికజీవితము నిచ్చు యోగ మిది. ఇవన్నియు ననుభవమునకు తగినట్లే యున్నవి.

ఇవి యిట్లుండ, తులారాశిలో నున్న గురువుపై బుధుని యర్ధకోణమిత్రదృష్టి గలదు. ప్రజ్ఞ, సంపత్తు, గుణసమృద్ధి, సురుచిరశీలము-ఇవి దీని ఫలములు. ఇట్టి గురు వుండునది చూతమా రాజ్యస్థానమందు! దీని కెంతో మంచిఫలము చెప్పి నది 'సారావళి.'

"సిద్ధారంభో మాన్యః
సర్వోపాయః కుశలసమృద్ధశ్చ
దశమస్థే త్రిదశగురౌ
సుఖధనజనవాహనయశోభాక్"

ఇంతే కాదు. మిథునరాశిలో నున్న శుక్రునిపై కుజు నికిఁ గల అర్ధకోణస్నేహదృష్టి "కామపరత, సుభగత్వము" సూచించఁగలది. ఇట్టి శుక్రుఁ డుండునది సప్తమ(భర్తృ) భావము:

"అతిరూపదారసౌఖ్యం
బహువిభవం కలహవర్జితం పురుషం
జనయతి సప్తమధామని
సౌభాగ్యసమన్వితం శుక్రః"

అని 'సారావళి' యీ యోగమును పొగడుచున్నది. కాని సువాసినీత్వము తప్ప ఇతరసౌభాగ్యము లంతదాఁక ననుభవములో కానరాకున్నవి. భర్తృసౌఖ్యము—శృణమో, పణమో—భరణముతో చెల్లిపోయినట్లున్నది. బుధుని వివే కము, గురువు సూచించు ధర్మపరత, శని ఇచ్చు నీతినియ మములు ఇవిమాత్రమే నిలచినవి. ఇతరగ్రహము లీయఁ దలఁచిన సత్ఫలము లేమియు నంటిరాకుండ శని యరి కట్టఁగా వరుణుఁ డీమెకు ప్రియవిరహము నిచ్చినాఁడు. ఏమి వీని శక్తి!

"అల్లుని జాతక మున్నచో బాగుండును" అంటిని.

అతనియొద్ద అల్లుని జాతక ముండదని నే నెఱుఁగు దును. జాతకములతో నక్కరకాని, వానిపై నభిమానముకాని అతనికి లేదు. ఆకాశములో నున్న గ్రహముల గొడవ భూమిపై నున్న మన కేల యని కాఁబోలు! ఆఁడుబిడ్డ నక్షత్ర మేమని యెవరయిన ప్రశ్నించినచో, ఆఁడువారి నడుగవలసిన స్థితి యా మహానుభావునిది. అతని కాలమట్లే జరుగుచువచ్చినది. పోనిండు.

దాంపత్యవిచారమున భార్యాభర్తల జాతకములు రెం టిను జోడించి గమనించుట లాభకారి. భర్తజాతకమును సంపాదించుటకై మనస్సు చాల కుతూహలపడుచుండెను. కాని అప్పటి పరిస్థితులలో నతనిని జాతకము నిమ్మని యడుగుట సమంజసముగ తోఁచలేదు.

మే మీ విషయము మాటలాడుచుండఁగనే పది గంటలు కావచ్చినది. ఆకస్మికముగ నాయింటిముందర నొక జట్కాబండి వచ్చి నిలిచెను. క్షణములో మామగారి ముందర అల్లుఁడే ప్రత్యక్షమయ్యెను. ఆశ్చర్యచకితుల మైతిమి.

"మామగారూ! కూఁతురును మాయింటికి భోజనము నకు పంపండి." అని యతఁడు మామగారిని ప్రార్థించెను. ఇది యేమి నాటకమో అర్థము కాలేదు. క్షణకాలము నిరుత్త రుఁడై యుండి మామ, "మీయింటికి భోజనమునకు రాతగిన పరిస్థితులలోకాని, వేషములోకాని ప్రకృతము మాపాప లేదు. క్షమించవలెను." అని ప్రతి యిచ్చెను.

భర్తసౌభాగ్యము 'భరణపు కరారు' తో చెల్లిపోయిన తరువాత అల్లుని యింటి కాఁడుబిడ్డ నేమని పంపఁగలఁ డాతండ్రి? ప్రాఁతచీరతో 'పావడదావా' కొరకు వచ్చియున్న బిడ్డ సంతానసౌభాగ్యములతో తులతూగుచున్న సవతిసౌధ మున కేముఖముతో భోజనమునకని పోఁగలదు? ఇది విషమ సమస్యగా నుండినది. భరణమునకును భోజనమునకును సం బంధము లేదని యుక్తికి ప్రతియుక్తి చెప్పి అల్లుఁడు మామ గారిని నిరుత్తరునిగాఁ జేసినాఁడు. కడకు, "ఆమె సమ్మతిం చితే, పిల్చుకొనిపోండి." అని మామ చెప్పవలసివచ్చెను. తోడనే పేరుబెట్టి భర్త పిలువఁగా, సమీపపు గదిలో నుండి, మూర్తీభవించిన శాంతకరుణారససమ్మేళనముబోలె, అతని ప్రథమభార్య వచ్చి యనతిదూరమున తలవంచి నిలిచెను.

"నీభర్త భోజనమునకు పిలుచుచున్నాఁడు. పోయె దవా?" అని తండ్రి యామె నడిగెను.

ఆకస్మిక జనితదరహాసచంద్రికతో మెఱవించి తటిల్లత వలె నొక తీక్ష్ణకటాక్షధార యాసాధ్వీయవనతముఖమునుండి వెలువడి భర్తచూపులతో నైక్యమంది మాయమయ్యెను! చిరకాలవిరహమువలని నిర్వేదము, పరాభవమువలని దైన్యము, ప్రేమతో కూర్చిన భక్తి, ఆశతోఁగూడిన ధైర్యము,

సంశయముతో కలసిన భయము, ఉత్సాహముతో చేరిన యుద్రేకము అహమహమికతో పెనగి యాకటాక్షధారలో ప్రవహించినట్లుగా నాకు తోఁచినది. నాఁటి అపూర్వదృశ్యము నేఁటికిని నాకన్నులఁగట్టినట్లున్నది.

"దృశా దగ్ధం మనసిజం
 జీవయంతి దృశైవయాః,
విరూపాక్షస్య జయినీ
 స్తాస్తువే వామలోచనాః."

అను మహాకవివాక్యము నా కపు డాకస్మికముగా స్ఫురణకువచ్చినది: ఉపశ్రుతియా యిది?

క్షణములో భావగోపనము కావించి యాసాధ్వి మెల్లగ "పోయివత్తును." అనుటయు,

"అయితే, నీయిష్టము. శీఘ్రముగా రా." అని తండ్రి యనుమతియిచ్చెను.

స్నానమునకై యా సువాసిని వెళ్లఁగా, పది నిమిష ముల కాల మామెభర్త యచట కాచియుండవలసివచ్చినది. ఏదో లోకాభిరామాయణ మారంభించితిమి. జాతకముల శ్రద్ధ గలవాఁడును, మహాయుక్తిశాలియు నగు నామిత్రుఁడు సంబంధములేని పెండ్లిండ్లు, వర్ధంతులు,వయస్తారతమ్యములు మున్నగువానినిగూర్చిన కథ లేవేవో చెప్పుచు, మాటల మరుగున జామాతనోటినుండియే అతని జన్మదినము, జన్మకాలము, వివాహలగ్నము మున్నగు వివరములను రాఁబట్టఁగలిగెను. ఎప్పటికప్పుడే వానినెల్ల నేను గుర్తువేసు కొనుచుంటి నని వేరుగచెప్ప పనిలేదు. అతని జాతకము నకు వలయు సామగ్రిని సేకరించవలయు నను నాకచే మా పన్నిన యుక్తి ఫలించినది.

అంతలో కృతస్నానయై సముచిత సన్నాహమున నా సాధ్వి వచ్చినది. తోడనే యా విచిత్ర దంపతులు కాచి యున్న జట్కాబండిలో నెక్కి బయలుదేరిపోయిరి. నేనును నా యిల్లు చేరి భోజనము తీర్చుకొని ప్రాఁతపంచాంగములు, పత్రకములు చేతఁబట్టుకొని అల్లుని జాతకమును గుణించుటకై త్వరితముగా మరల నా మిత్రుని యిల్లు చేరితిని. స్పష్ట గ్రహములను సాధించి కుండలి వేసి లగ్నమును గుణిం చఁగా, కళత్రస్థానమున వరుణగ్రహము ప్రత్యక్షమైనాఁడు. కథకు తగినట్లే యున్నది గ్రహసంపత్తి యనుకొంటిమి.

విద్యావినోదములకు పేరుగాంచిన మిథునము లగ్నము. లగ్నాధిపతి బుధుఁ డుచ్చరాశి యగు కన్యలో చతుర్థకేంద్ర మున ప్రబలుఁడుగ నున్నాఁడు.

<table>
<tr><td></td><td></td><td></td><td>I ౫-౪౫
ఇ ౨౬-౧౩
కే ౨౮-౧</td></tr>
<tr><td>X ౨౬-౦</td><td colspan="2" rowspan="2">భర్త జాతకము
—
(సాయనము)</td><td></td></tr>
<tr><td></td><td>శు ౧-౪౪
చ ౫-౦
ర ౧౩-౩</td></tr>
<tr><td>రా ౨౮-౧
శ ౧౮-౧౮(వ)
వ ౪-౧(వ)</td><td>గు ౨-౩౧</td><td></td><td>బు ౩-౪౩
(వ)
కు ౨౯-౫౫</td></tr>
</table>

" ధర్మప్రియోతివాగ్మీ,
 చతురస్సాక్షి లేఖ్యకావ్యజ్ఞః
విజ్ఞాన శిల్పనిరతో
 మధురశ్చ స్వల్పవీర్యశ్చ
జ్యేష్ఠః పూజ్య స్సుహృదాం
 నానావినయోపచారదార రతః
ఖ్యాతో గుణై రుదారః
 కన్యాయాం సోమజే బలవాన్."

అని 'సారావళి' జాతకుని గుణముల నతి శ్లాఘ్య ముగా వర్ణించినది: గురుబుధులకుఁ గల యర్ధకోణ మిత్ర సంబంధము జాతకుఁడు శీలవంతుఁ డనియు, ధర్మశ్రద్ధతోడ నీతి నియమములు గలవాఁ డనియు సూచించును. ఇందులో నతిశయోక్తి యుండదు.

సప్తమభావాధిపతి గురువు. "దారే శుభర్క్షే సుదారః" యను జాతకతత్త్వ సూత్రము మంచి యిల్లాలిని తెలుపును. సప్తమాధిపతి (గురువు) షష్ఠ (శత్రు) భావమం దుండుట గుణవంతురాలగు భార్యతో నితనికి వైమనస్యము వచ్చునని సూచించు నేమో? చంద్ర శుక్ర సంయోగము నవనాగరక తయు, విలాసము, శృంగారసికత కల భార్యతో నుత్కృష్ట మగు సంసారసుఖము నీయఁజాలినది. ఈ చంద్రశుక్రులకు వరుణునితో నున్న త్రికోణ దృష్టి యీ యోగమున కుత్తేజ నము నిచ్చును. కాని, సప్తమ భావమం దున్న శని భార్య కొంత 'మందరాశి' యనుచున్నాఁడు. (భార్యాలగ్నము మకరము గదా.) వచ్చిన చిక్కిది.

పూతమెఱుంగులకు భ్రమియు మిథునము జన్మ లగ్నము. లగ్నాధిపతి 'నానావినయోపచార దారరతః'త్వము

నాశించుచున్నాఁడు. శుక్రచంద్రులతో మైత్రినెరపుచున్న వరుణుఁడు నవనవోన్మేషముగ సుద్రిక్తతీవ్రభావముల నిచ్చుటకు బద్ధకంకణుఁడై కళత్రస్థానమందే కలఁడు. ధర్మమో, శీలమో ఇయ్యఁగలఁడు కాని, శని యీసామగ్రి నెచటినుండి తెచ్చియీయఁగలఁడు? మకరలగ్నమున జనించి, చంద్రబుధులకు శనికేంద్రస్థితి గల తరుణి యీభర్త నెట్లు తృప్తినందింపఁగలదు? సప్తమభావమం దున్న శని కష్టమాధిపత్య మున్నది. "రంధ్రేశే, అంశే, అస్తే, ద్విభార్యః" అను 'జాతకతత్త్వ' సూత్రము జాతకునకు ద్వికళత్రయోగ మున్నదనుచున్నది. 'సంకేతనిధి' పై యర్థమునే బలపరచును. "నిధనపేతనుగేమదనేభవా, భవతి పై రమణీద్వితయం నృణాం."

మరియొక్కటి. ప్రబలుఁడయిన బుధుఁడు వరుణునికి పూర్ణకేంద్రమం దున్నాఁడు. అందులో లగ్నాధిపతియై చతుర్థకేంద్రమం దున్న కన్యాబుధుఁడు "శాస్త్రులవారి కవిత్వములో మాపైత్యము కొంత" యను రీతి, బుధుని తెలివితేటలలో వరుణుని వ్యధికరణ చిత్తవృత్తి చేరుచున్నది. అద్వితీయపాండిత్యము, అపారమేధశ్శక్తి, అపూర్వవాంఛావిశేషములు, అతిమాత్ర సంకల్పబలము ఇవి దీనిఫలములు. శక్తిసామర్థ్యములను సామాన్యపద్ధతితో సద్వినియోగపరచుకొను నేర్పుండదనియు, చుట్టు నున్నవారితో నైకమత్యము సంపాదించుట కష్టమనియు, కొన్ని విషయములందైనా తెలివి పెడదారి పట్టుట తప్పదనియు కార్టరు మహాశయుఁడీయోగమునకు ఫలము వ్రాసెను.* ఈయోగ మిచ్చు వరుణుఁ డుండుట సప్తమభావమందని గమనించితిమేని, ప్రథమజాయనుగూర్చిన యితని ప్రవర్తనము మన కర్థమగును.

కాని, లగ్నాధిపతియగు బుధునితో కళత్రాధిపతియగు గురువునకేమో స్నేహదృష్టియే కలదు. ఈయోగము గల విద్యావంతుఁడు ధర్మపత్ని విషయమున నధార్మికప్రవర్తనమునకు దిగునా? అధర్మమని స్ఫురించియుండినచో, నితఁడు ప్రథమభార్యను పరిత్యజించియే యుండఁడు. వ్యధికరణసామగ్రి కల వరుణబుధకేంద్రస్థితిలో సామాన్యధర్మశాస్త్రములు పనికిరావు. వారిది ప్రత్యేకసృష్టి. పోనిండు. వరుణుఁడు తన ధర్మము (అపకర్షణము) తాను నెరవేర్చి ప్రథమభార్యకు వియోగము తెచ్చియిచ్చినాఁడు. గురుబుధులు తన వివేకము నెంతవర కుపయోగింతురో చూడవలసి యున్నది.

అది యట్లుండె, భార్యాభర్తల స్పష్టగ్రహాదులను పోల్చిచూతముగాక:—

(౧) భార్యజాతకపు రవి భర్తజాతకపు చంద్రునితో నారుభాగలలో సంయోగము నభిలషించుచున్నాఁడు. దాంపత్యధర్మమున భక్తిపారవశ్యత నిచ్చు నమూల్యయోగ మిది. కాని, ఇచట నొక విశేష మున్నది. ఈ సంయోగమునకు భర్తజాతకమందలి శుక్రుఁడు ప్రతిబంధకసామగ్రిగా నున్నాఁడు. అనఁగా, భార్యజాతకపు రవి భర్తజాతకపు చంద్రుని సంయోగమును పొందుటకు ముందు నడుమనున్న భర్తజాతకపు శుక్రుని దాఁటుకొనియే పోవలయు ననుట. గమ్యస్థానము చేరుట కొక విలాసవతి యడ్డమునిలిచిన దని యర్థము. ఈమెయే రెండవ భార్య.

(౨) భార్యజాతకపు శుక్రునితో—విషయసుఖస్థానాధిపతితో—భర్తజాతకమందలి ఇంద్రగ్రహమునకు పరిపూర్ణ సంయోగ మున్నది. పరస్పరముగ దయాదాక్షిణ్యములు, నిర్మలమైన యవ్యాజమైత్రి, మృదుమధురమగు మనోభావములు, మోహపరవశత, ఆనందాతిరేకము—ఇవి తెలుపు మనోహరయోగ మిది. కాని, ఈ సంయోగమునకు నిందు కేంద్రమున భర్తజాతకపు కుజుఁ డుండుటమాత్రము ప్రమాదకారి. మోహవిషయమున మోసము నిది సూచింపఁజాలినది. భార్యను భర్త మోసగించినాఁడు. ప్రతిక్రియగా భార్యయు భర్తను మోహముగ్ధునిగాఁ జేయఁగలిగినఁగాని ఫల ముండదు. కాని, శనిసామ్రాజ్యమున నోపిక యున్నదికాని చాకచక్య మెందు వచ్చును?

(౩) భార్యజాతకమున చంద్రబుధులు శనిదృష్టిచే స్తబ్ధులైనారుకదా? వారిరువురికిని భర్తజాతకమందలి వ్యధికరణశాలియగు వరుణునినుండి చక్కని మిత్రదృష్టి యున్నది. భార్యజాతకమందలి శనికి (లగ్నాధిపతికి) భర్తజాతకపు బుధునితో (లగ్నాధిపతితో) పూర్ణప్రత్యక్షస్నేహదృష్టి కలదు. నెమ్మదిగా నోపికతో పనులు సాధించు నేర్పు గల శనైశ్చరుఁడు బుధుని స్వాధీనము చేసుకోఁజాలఁడా? ఏ అమాయకశాంతచిత్తవృత్తిని స్తబ్ధప్రకృతిగా భావించి తొలుదొలుత భర్త యీమె నేవగించుకొనెనో, ఆచిత్తవృత్తియే వాస్తవముగ హృదయంగమ మని లోకానుభవముచే కాలాంతరమున భర్తబుద్ధి కేల తోఁచరాదు? బుధవరుణుల ఘర్షణ కేంద్రములందుఁగల మానవుల జీవితములలో నిట్టి తీవ్రభావపరివర్తనము లాకస్మికముగ, తలవని

---

* ***Vide: Pages 110 to 113 of "Astrological Aspects" by Charles E. O. Carter.***

తలంపుగ వచ్చుట యరుదుకాదు. వచ్చెనేని బ్రహ్మఅయినా వాని నాఁపలేఁడు.

(౪) భర్తజాతకమందు వివాహసహమబిందువును (పాశ్చాత్యపద్ధతిలో) సాధింపఁగా, అది భార్యజాతకమందలి దశమకేంద్రమున నున్న బృహస్పతిపైన వచ్చుచున్నది. ఇంతకన్న దాంపత్యమున కుత్తమయోగ ముండునా? ఈ భార్యనుండియే భర్తకు పరువుప్రతిష్ఠలు. వైవాహికజీవిత చరితార్థత రావలసియున్నవి. ఇట్టి బృహస్పతి భర్తజాతకమున పంచమభావమునకే వచ్చుటచే వంశ ముద్ధరించు సత్సంతాన ఫలము భర్త కీమెనుండియే సిద్ధించు నను నూహ కవకాశ మున్నది.

ఈ దంపతుల వివాహము ౧౯౨౨-వ సంవత్సరమున జరిగినది. వీరికి ప్రబల పరస్పరాకర్షణము శుక్రేంద్ర సంయోగమునుండి వచ్చినదికదా? ఈ యాకర్షణ స్థానమున కర్ధకేంద్ర (౪౫ భాగలు) శత్రుదృష్టి సింహరాశి ౧౧-వ భాగకు రాఁగలదు. వధువు జన్మకాలికరవినుండి యిది ౧౨ భాగల దూరములో నున్నది.

"ఏకాంశకేన గణయే న్మనుజస్య వర్షం"
(మనుష్య జాతకమ్.)

అను సంప్రదాయము ననుసరించి ౧౨ సంవత్సరముల వయస్సులో వధువునకు శుక్రేంద్ర సంయోగపు ఫలముయొక్క దుష్పరిణామము రానున్నది. అప్పుడైన దీవివాహము. వైవాహిక జీవితమున శుపాసు పుట్టుటయు, పరిశుద్ధ ప్రేమ విషయమున మోసమో, ద్రోహమో జరుగుటయు, దంపతులకు వైమనస్యము సిద్ధించుటయు ఈదశఫలముగా పాశ్చాత్యులు వర్ణించిరి.

దినవర్షదశలో భార్యలగ్నము చలించి కటకమందున్న ఇంద్రుని కెదురునడువవలసి యుండుటయు, మకరమం దున్న వరుణుని సంయోగమును బొందఁగలుగుటయు తప్పదు గదా? వివాహానంతర మచిరకాలమందే యివి క్రమముగా సంభవించుటచే, దాంపత్య జీవితమున క్లేశము, వియోగము, పరితాపము రావలసియున్నవి.—వచ్చినవి!

ఇచట నొక విశేషమున్నది. జననకాలమున చంద్రునికి ౯౦ భాగలలో కేంద్రమున శని యుండుటచేత కలుగు దోషమో, స్తబ్ధతయో, మౌర్ఖ్యమో, వికాసరాహిత్యమో—పీడైన కానిండు-దిన వర్ష పద్ధతిలో చలితచంద్రుఁ డొకసారి చక్రమును చుట్టివచ్చుదాఁక వ్యాప్తిలో నుండుననియు, తరువాత శని మంచి ఫలమునే యిచ్చుననియు 'ఆలాఁ లియో' యను పాశ్చాత్య దైవజ్ఞుఁడు వ్రాసెను. అనఁగా, అట్టి జాతకులకు ఇరువదియేడు సంవత్సరముల వయస్సు మీరిన తరువాతనే, జీవితమున వికాసము రాఁగల దనుట. మన కథకాలమునాఁటి కా జాతకురాలి వయస్సు ఇరువదియేడు సంవత్సరములమీఁద నయిదు మాసములు. కాని భర్తతో భరణపు కరారు వ్రాయించి యిచ్చుచేనా శని చేయఁగలిగిన మేలు? లేక, ఇంద్రావరుణుల జంఝూటము అంతయు కానిమ్మని, ఓపికతో శనైశ్చరుఁడు కాలమునకు వేచి యున్నాఁడా?

భర్త జాతకమున వివాహకాలమున సరిగా నింద్రగ్రహ సంయోగమునకు చలిత లగ్నము వచ్చినది. అనఁగా, భార్యజాతకపు శుక్రునిపైనికే వచ్చిన దనుట. వివాహము వీరి యాకర్షణ ఫలమే యనుట కిది సాక్షి. ప్రేమానుబంధమున కిది చాల మంచిది; అసారమగు సంసారమున సారము చూపునట్టిది; ఆనంద బ్రహ్మానుభవమునిచ్చు నట్టిది. కాని, ఈశుక్రేంద్ర సంయోగమునకు కుజుఁడు కేంద్ర మనుట మరువరాదు. ఈ వ్యవహారములో నెవుడో మోసమున్నది. వివాహ మయిన నాలుగు సంవత్సరములకే చలితలగ్నము కుజునికి ౯౦ భాగల దూరమునకు వచ్చినది. అప్పుడే యితఁడు ప్రథమభార్యను పరిత్యజించినాఁడు. కొన్ని నెలలలోనే చలితలగ్నము మిథునరాశిని వదలి కటకమును ప్రవేశించినది. వెంటనే రెండవ భార్యను సంపాదించుకొని క్రొత్తగా సంసారయాత్ర నిఁక నారంభించినాఁడు. ౧౯౩౪-వ సంవత్సరమునకు చలితలగ్నము చలితగురువుతో (సప్తమాధిపతితో) త్రికోణదృష్టికి రాఁగలిగినది. ఇదేమో శుభసూచకమే. కాననే, భార్యకు భరణ మిప్పించెనేమో బృహస్పతి? దశమకేంద్రము చలించి యిపుడు మేషరాశి నాల్గవ భాగకు వచ్చుటచే, జన్మవరుణునియొక్కయు, జన్మచంద్రునియొక్కయు కోణదృష్టికివచ్చినది. అపారమగు నాకర్షణశక్తి నిచ్చు దశ యిది. చలితరవి కన్యారాశిలో ౧౯ త్తి భాగలకు వచ్చుటచే, భార్యజాతకమందలి ఇంద్రునితో నర్ధకోణమైత్రి నిప్పుడే సంపాదించినాఁడు. ఏమి పంచాయతి యిది?

ఏకాంశవర్షసంప్రదాయమున, దంపతుల శుక్రేంద్ర సంయోగస్థానమునకు వైరదృష్టి గల వయస్సులో వివాహమయ్యెనని కనుగొంటిమి. అదే సంప్రదాయమున, ఆ స్థానమున కర్ధకోణ మిత్రదృష్టి సింహరాశిలో ౨౬-వ భాగలో పడుచున్నది. భార్యజాతకమందలి రవి కీభాగ ౨౮ అంశల దూరములో నుండుటచే, దీని సత్ఫలము ౨౭ సంవత్సరముల వయస్సులో నామెకు రావలసియున్నది.

దశ అంతయు నింద్రావరుణుల యాజమాన్యములో నున్నది. మంచికో, చెడ్డకో వరుణుని నమ్మవచ్చును. కాని, ఇంద్రుని నమ్ముట చాల కష్టము. ఊహాతీతమైనది వాని పని. విష మమృతమైనా, విరిదండ వజ్రాయుధమైనా అది వాని కార్యమే. అంతయు మాయః అంతయు నైంద్రజాలిక తంత్రము. ప్రకృతకథలో నీగ్రహకార్య మపారముగా కలదు. ఏదో నాటకమున్నది. భార్యను మోసగించి భరణపు చీటిని భర్తమార్చఁగలఁడో, భర్తను మోహముగ్ధునిఁ గావించి భార్య స్వాధీనపరచుకోఁగలదో నిర్ణయించుటకు సూక్ష్మవిమర్శ నము కావలసియుండెను.

ఇది యిట్లుండ, నాఁటిదినమున శని మీనరాశిలో ౨౫-వ భాగలో, శుక్రుఁడు వృశ్చికరాశిలో ౨౫-వ భాగలో, పర స్పరకోణసంబంధములో నున్నారు. భార్యజాతకమున చలిత శుక్రుఁడు కర్కాటకరాశిలో ౨౫-వ భాగకే వచ్చియుండెను. ఈ త్రిత్రికోణసంబంధ మపూర్వముగ కానవచ్చుచున్నది. భార్యజాతకమున శుక్రుఁ డుండునది భర్తృస్థాన మగుటచే నీయోగమునకు వెల యుండకతీరదు. భార్యలగ్నాధిపతియగు శని శుక్రగ్రహమును - 'భర్తను' రెండువైపుల "అగాడీపి చాడీల"తో బంధించినాఁడా? శనిసామర్థ్యము చూడవలసి యున్నది. తాత్కాలికచంద్రుఁడు చారవశమున నింద్రుని త్రికోణమిత్రదృష్టి నపుడే పొందుచుండెను. ఇదియు నొక విశేషమే.

మే మిట్లు మనస్సులో మండిగెలు చేసుకొనుచుండఁగా గడియారము టంగుటంగుమని రెండుగంటలు కొట్టెను.

"ప్రొద్దు కావచ్చెనే? అమ్మాయి యింకా రాలేదు" అని ఆసాధ్వీతండ్రి వీథివంకఁ జూడసాగెను.

"ఈనాటకములో నేమో మోసమున్నది." అంటిని.

నాఁడు మూఁడుఘంటల రైలులో నతఁడు వెళ్లితీర వలెను, అవకాశము లేదు. వేళకు కూఁతురు రానిచో,—? తా నొకఁడే వెళ్లినపుడు భార్య యెంత నొప్పిపడునో? అతని హృదయ మస్వస్థత పాలయినది. ఇంటిలో పాదచ్చా యలు వేయుచు, వీథిలో నే చప్పుడైనా తొంగి చూచుచు, గడియారము నపుడపుడు గమనించుచున్న యతని హృద యావేగమును కనిపెట్టి "అవకాశ మున్నది. రావచ్చును" అంటిని.

వీథిలో నతివేగముగ వచ్చుచున్న జట్కాబండిధ్వని వినవచ్చినది. క్షణకాలములో జట్కా యింటిముందు నిలి చెను. అల్లుఁడు, నాఁడుబిడ్డయు బండిదిగి యింటిలోనికి వచ్చిరి. ఆమెముఖమున నొక యపూర్వ శోభ కానవచ్చు చుండినది.

"మామగారూ! మీకూఁతురు నాయింటిలోనే నిలుచును. మీ రూరికి వెళ్లవచ్చును." అనుమాట జామాతనోటినుండి వెలువడఁగా, స్తంభించిపోతిమి. అత్యాశ్చర్యమున తెరచిన నోరు తెరచినట్లే యుండ, కొన్ని నిమిషముల కాల మల్లుని ముఖమునెగాదిగ చూచుచుండి, ఆ పెద్దమనుష్యుఁడు తల నడ్డముగ నాడించుచు దీర్ఘముగ, "సా-ధ్య-మా?" అనెను.

"సాధ్యము కాకేమి?" అని యల్లుఁడు ప్రతియిచ్చి, భార్యముఖమును తిలకింపఁగా నా మానిని చిరునవ్వుతో తలవంచుకొనియెను. జట్కాబండి గుఱ్ఱ మింటిముందర జయసూచకముగ హేషాధ్వని చేసినది.

"ఈవేషముతో కూఁతురు నత్తగారింటికి పంపినచో, నాభార్య చాల పరితాపపడును. ఇష్టమున్నచో, మాగ్రామము నకు వచ్చి మీభార్యను మీ రవశ్యకముగా పిల్చుకొనిపో వచ్చును." అని మామ చెప్పఁగా,

"వేషమున కేమి? కొన్నాళ్లలో మేమిద్దరము మీ యింటికి వచ్చి మా అత్తగారిని క్షమాపణ వేఁడు కోఁగలము." అని యల్లుఁడు సమాధానమిచ్చెను.

పండ్రెండు సంవత్సరముల దీర్ఘకాలము భర్తృవిర హముతో పరితపించిన కూఁతురును పిలుచుకొనిపోదు నని భర్తయే వచ్చి ప్రార్థించుచుండఁగా, పాప మాతండ్రి యెట్లు వలదనఁగలఁడు? కాని, అసపత్నిలో బిడ్డ యేమి బాధపడు నో యను భయమున్నది.

ఎట్టకేల కతఁడు తన పుత్రికను జూచి, "ఏమమ్మా! నీయిష్టమేమి?" అని యడిగెను.

భర్తసమీపమున నవనతముఖియై నిలుచుకొనియున్న యా సీమంతిని క్షణకాల మూరకుండి వినయమున,

"అమ్మకు మీరు సమాధానము చెప్పండి." అను రమ్యమైన ప్రత్యుత్తర మిచ్చెను. సెలవా సనుకొంటిని.

"సంతోషము. పోయిరమ్మా" అను దీవన తండ్రిము ఖమునుండి వచ్చుట తడవుగా, ఆ సాధ్వీరత్న మతనికి నమస్కరించెను. ఉత్తరక్షణమందే అల్లుఁడు, నాఁడుబిడ్డయు నత్యుత్సాహమున తమ జట్కాబండి నెక్కి వెడలిపోయిరి. అంతలో సమీపమున రైలుస్టేషనులో ఘంటారావ మాహ్వా నించఁగా, మూట మల్లె నవరించుకొని, యాపెద్దమను

ష్యుఁడు తన ప్రయాణము సాగించెను. నేనును,నామిత్రుఁడును నవ్వుకొంటిమి.

అంతయు నొక స్వప్నమువలె నుండినది. ఇది ఇంద్రుని మాయ. అసాధ్యములుగా తోఁచిన, ఊహాతీతము లయిన పనుల నరక్షణములో సాధించిచూపుట ఇంద్రుని శక్తి. సత్య మసత్యముగ, అసత్యము సత్యముగ చూపు సామర్థ్య మీగ్రహమునకే కలదు. జాగ్రదవస్థావిషయము లను స్వప్నప్రాయముగా మాయముచేయుటయు, స్వప్న లోకసాధ్యములగు రంగములను సాక్షాత్కారమునకుఁ దెచ్చు టయు ఇంద్రుని పనులు. అంతా ఇంద్ర–జాలమే! గురుబుధుల వివేకము, కవికుత్రుల పాతివ్రత్యము, చంద్రవరుణుల యాకస్మికభావపరివర్తనము ఈ సామగ్రుల నుపయోగించుకొని ఇంద్రగ్రహము తన యింద్రజాలవిద్యాప్రభావము చూపినది.

పోనిండు. ఆక్షణమునుండి యాసాధ్వికష్టములు కడతేరినవి. సత్సంతానసౌభాగ్యములతో నొప్పి, ఇంటికి పెద్దయై, భర్తకు, సపత్నికి మెప్పై నాఁటినుండి యామె తన సంసారమున రాజ్యమేలుచు, ఉభయవంశముల నుద్ధరించు చున్నదని వినుచున్నాము. ఈ దాంపత్యము నూరేండ్లు వర్ధిల్లుగాత!

సౌందరనందము

[నాటిక]

●

= శ్రీ అవధానం సీతారామయ్య =

దృశ్యం ౧

[నేపథ్యమున]

అనూ! అనూ! ఎక్కడున్నావ్? ఇలా రావే ఓమాటు. ఎప్పుడూ బిచ్చగాళ్ల బొమ్మలు గీచుకోవడమేనా?...పలుకవేమే?

అనూరాధ:—(ఒక భిక్షుణిచిత్రం వ్రాస్తూ పాడుకొంటూంది)

నీలిమబ్బులలోన నీటిబుగ్గలపైన
ఏలనే నీపాట ఏలనే నీఆట
పూలగుండెలనుండి మురళి వాయింపవే!
అలల ఊరెయల లూగు కలువపిల్లల చూచి
ఎలదేటిపాటలో ఒలుకు తేనెలు గ్రోలి
కలలతో కథలతో కాలమ్ము గడుపుచూ
వెలలేని ఆత్మను బలిపెట్టవలదమ్మ
అది చూచి ఇది చూచి ఆరాటపడకమ్మ
అదరిపోవును గుండె ఆవేదనకు చిక్కి

[ప్రవేశం సుందరి]

సుందరి:—ఎవరే ఆ అమ్మ?...ఓ! నాబొమ్మ వేస్తున్నావు!! నాకు కావిబట్ట కట్టి కమండలువు చేతి కిచ్చావు! అనూ! చూడూ, ఇటు, నావైపు. ఇలాంటి చిత్రాల్ని నా అంతఃపురంలో ఎక్కడ ఉంచుదామని? అనూ! నందనంవంటి నాసుందర వనంలో నీ వెప్పుడూ శ్మశానాన్నే చూస్తావు. నా ప్రణయార్చనలో ఏవో ప్రళయచిహ్నాలు కనబడుతవి నీకళ్లకి!

అనూరాధ:—ఓ! మహారాణిగారు! క్షమించండి. ఈచిత్రం మిమ్మల్ని ఉద్దేశించి వ్రాయలేదు. చివరకి మీలా తయారైంది. చింపేస్తాను లెండి. ఎంత ప్రయత్నించినా ఆకళ్లు కుదరటం లేదు. నా ప్రతి చిత్రంలోనూ మీకళ్లే ప్రత్యక్షమవుతవి. జ్యోతుల్లాంటి ఒక్క మీకళ్లే, కళ్లు మూసినా, తెరిచినా, నాకు కనబడుతవి. అంచేత నాచిత్రాలన్నీ మీ ప్రతిబింబాల్లా ఉంటవి. మీసౌందర్యానికి జోహారులు!

సుందరి:—మంచి సౌందర్యమే! సన్యాసినిగా మార్చేశావు నన్ను! "భవతి భిక్షాం దేహి" అని బయటికి బయలుదేరమన్నావా ఏమిటి? నీచిత్రాలు నన్నెంత చీకాకుపఱుస్తున్నవో ఊహించుకోలేవా అనూ? చిత్రించుకో, నేను అడ్డంరాను. కాని, ఈ దౌర్భాగ్యురాలి హృదయ దౌర్బల్యం క్షమించలేవా? సౌందర్యం సృష్టించలేవా? అందమే ఆనందం; ఆనందమే కళకు సర్వస్వం. కళకు ఆధారమూ అదే, ఆదర్శమూ అదే.

అనూరాధ:—ఏది అందమో, ఏది కాదో మన మెలా చెప్పగలం, మహారాణీ? నాసృష్టిలో మీకు మహాబీభత్సం కనబడుతూంది. ఇంకొకరికి దివ్యసౌందర్యం కనబడొచ్చు. అది కేవలం దృష్టిభేదం మహారాణీ. నేను నాకళ్లతో చూడలేని సౌందర్యం ఇతరుల కెలా చూపగలను? నాసృష్టిలో నా కానంద ముంది. నాతోపాటు సర్వప్రపంచమూ— ఒక్క మహారాజులూ, మహారాణులూ తప్ప—ఆనందిస్తూంది. నాకళకు ఇంకేం కావాలి? మహారాణీ! ప్రకృతిని చిత్రించమంటావ్! ప్రణయాన్ని పలికించ మంటావ్. అవి నాకు కనబడవు. ఒక్క ప్రపంచమే ప్రతిక్షణమూ నాకళ్లకు ప్రత్యక్షమవుతా నంటుంది. అందులో నీప్రకృతిప్రణయాలకు తావు లేదు. అక్కడ చిఱునవ్వులూ, చిలిపిచూపులూ లేవు. నిట్టూర్పులూ, కన్నీళ్లూ మాత్రమే ఉన్నవి. అంతఃపురాల్లో ప్రపంచం లేదు మహారాణీ; బయటఉంది. అదే కళకు ఆదర్శం.

[ప్రవేశం మల్లిక]

సుందరి:—మల్లికా, అనూరాధఉపన్యాసం విన్నావా? అవూ, అన్నట్టు, అసలు సంగతి చెప్ప డమే మఱచిపోయ్యాను. రేపు బుద్ధభగవానునికి మన ఇంట్లో భిక్ష. అప్పుడు నీచిత్రాలన్నీ ఆయన ముందు పడేయి. నీకు చక్కటి బహుమాన మిస్తాడు. మల్లికా, ఏమిటి విశేషాలు? మహారాజులుంగారి దగ్గరనుంచీ కబురేమైనా వచ్చిందా?

మల్లిక:—ఆయనగారు వేటనుంచి తిరిగి వచ్చారు. తోటలో మీకోసం కాచుకొన్నారు.

సుందరి:—ఇదో! ఇప్పుడే వస్తూన్నా. నీవు వెళ్లి, రేపటి బుద్ధభగవానుని ఆగమనానికి కావలసిన ప్రయత్నాల్లో ఉండు.

(నిష్క్ర: మల్లికా, సుందరి)

అనూరాధ:—(పాడుకొంటూ)
అది చూచి ఇది చూచి ఆరాటపడకమ్మ
అదరిపోవును సుండె ఆవేదనకు చిక్కి
కలలతో కథలతో కాలమ్ము గడుపుచూ
వెలలేని ఆత్మను బలిపెట్టవలదమ్మ.
(బయటనుంచీ బుద్ధభగవానుని కంఠం)
"భవతి భిక్షాం దేహి!"

అనూరాధ:—(ఆశ్చర్యచకితయై) ఆఁ!! ఎవరూ!...భగవాన్! మహాప్రభూ! అనుగ్రహీతను, మహాప్రభూ! (క్రిందికి పరుగెత్తిపోతుంది)

దృశ్యం ౨

[రాచనగరులో పూదోట: నందుడూ, విదూషకుడు మధూ పచారుచేస్తూన్నారు]

నందుడు:—మధూ! ఏం తోచడం లేదోయ్!

మధు:—ఈ వేడివెన్నెల్లో ఏం తోస్తుంది. పాపం! మహారాజులుంగారు మహా బాధపడుతూన్నట్లుంది. అవును: మహారాజులకు ఏది వచ్చినా "మహా" గానే వస్తుంది.

నందుడు:—మధూ, అడవిలోనుంచీ సుందరికి ఒక శుభవార్త తీసుకొచ్చాను.

మధు:— హరిణశాబకాలను వేటాడడంలో తాము ప్రదర్శించిన ధైర్యసాహసాలనుగురించి ఇంక ఈ రాత్రి అంతా ఆవిడతో ముచ్చటిస్తారు కాబోలు.

నందుడు:—సుందరి ఇంకా రాలేదే!

మధు:— (ఆకాశంవైపుచూస్తూ)మామహారాణీగారిని ఎక్కడ దాచారు? పలుకరు, పంచభూతములారా, పలుకరు. మహారాజా, వీళ్లు మాటలకు పలుకరు. పాట పాడి చూద్దామా ఏమిటి?

[ప్రవేశం సుందరి]

ఓ! మహారాణీగారికి స్వాగతం. ఇప్పుడు మీరు రాకుంటే, పాటపాడేవాళ్లం. ప్రపంచాన్ని-ఒక్క ప్రపంచమేమిటి, పంచభూతాల్ని రక్షించారు.

సుందరి:—రక్షించానా?

మధు:—కాక? మీరు రాకుంటే పాట పాడేవాళ్లం అన్నానుగా. అన్నట్టు, ఇంకా ఇక్కడ నేనుండడమేమిటి, నామొహం! (నిష్క్రి)

నందుడు:—దేవీ! నీకళ్లల్లో ఏవో దుస్స్వప్నచ్ఛాయలు కనబడుతూన్నవి.

సుందరి:—మహారాజా! సముద్రాన్ని మీ రెప్పుడైనా ఈదారా?

నందుడు:—సముద్రాన్ని ఈదడమేమిటి! ఏమిటాస్వప్నసత్రితి సుందరీ?

సుందరి:—అవును మహారాజా! అది ఒక విచిత్రస్వప్నం. మహాసముద్రం. నట్టనడుమ ఒక పర్వతం. పర్వతశిఖరంపైన ప్రాగ్దిశోన్ముఖుడై సమాధిలో ఉన్న ఒక సన్యాసి. క్రింద — సముద్రంలో నేను అతనివైపు చేతులు సాచి పర్వతంచుట్టూ ప్రదక్షిణంచేస్తూన్నాను. నే నతనికి కనబడను: ఒక్క అతడే నాకు కనబడుతాడు. ఎవరో ఆ సన్యాసి! అతన్నెందు కలా ఆరాధించానో!

[ప్రవేశం అనూరాధ]

అనూరాధ:—క్షమించండి మహారాజా.

నందుడు:—అనూరాధా! ఏమిటి విశేషాలు?

అనూరాధ:—ఉపద్రవం మహాప్రభూ!

సుందరి:—ఏమిటా ఉపద్రవం? నీబొమ్మ లెవరైనా ఎత్తుకుపోయ్యారా ఏమిటి?

నందుడు:— ఉపద్రవమా! నాకు శత్రువు లెవరూ లేరే?

అనూరాధ:—ఈ ఉపద్రవం శత్రువులనుంచీ కాదు మహారాజా.

సుందరి:— మరి ఎవరు కారణం?

అనూరాధ:— సౌందర్యం మహారాణీ; నీ ఆరాధ్యదేవత సౌందర్యం. బుద్ధభగవానుడు గుమ్మంలో నిలుచొని, "భవతి భిక్షాం దేహి" అని మూడుమార్లు అన్నాడు. ఎవరమూ వినిపించుకోలేదు. మూడవసారి ఆయన వేసిన కేక విని, నేను క్రిందికి పరుగెత్తుకుపోయ్యాను. కాని, అప్పటికే ఆయన అంధకారంలో ఎక్కడో అంతర్ధాన మయ్యారు. జరిగినదంతా మీకు విన్నవించుకుందామని ఇక్కడకు వచ్చాను. క్షమించండి. భిక్షువుల ఆక్రందనాలు అంతఃపురాలకు అందవు మహారాజా!

నందుడు:— సుందరీ! మా అన్న కెంత అపచారం చేశాను! ఇదిగో, తక్షణం ఆయనదగ్గరకు వెళ్ళి క్షమాపణ కోరుతాను.

సుందరి:— అపరాధిని నేను మహాప్రభూ. అక్రమంగా మీ మనస్సు నాక్రమించి, మీ రాజధర్మాలకు ఆటంకం కలిగించాను. నేనూ మీ వెంట వస్తాను.

నందుడు:—నీవు అలా అనకూడదు. నీవు నాకేమీ ఆటంకం కలిగించలేదు. నా అన్న నన్ను క్షమించడా? ఆయన క్షమామూర్తి కదా?

సుందరి:— మీ సహధర్మచారిణిని మీ వెంట తీసికెళ్లరూ?

నందుడు:—సుందరీ! మహారాణులు రావలసిన చోటు గా దది. నే నిప్పుడే వస్తాగా.

సుందరి:—మీరు వచ్చేదాకా నేను ఇక్కడ నుంచీ కదలనుసుమా.

నందుడు:—నిన్ను వదలి ఎంతసే పుండగల వనుకున్నావు, పిచ్చిదానా? అనూ! నీవు వెళ్లి రథం తయారుచెయ్యమని సారథితో చెప్పు.

అనూరాధ:—చిత్తం మహాప్రభూ! (నిష్క్రమి)

దృశ్యం 3

[పూదోట : అనూరాధా, సుందరీ]

సుందరి:—చంద్రుడేడీ?

అనూరాధ:—అస్తమించాడు: ఇంకా ఏం చంద్రుడు?

సుందరి:—అయితే, మిగతా రాత్రి అంతా చిమ్మచీకటే!

అనూరాధ:—ఇంక రాత్రి ఎంతో లేదుగా. తెల్లవార వస్తూంది.

సుందరి:—ఏదీ,నీవు కోసిన పూలు ఇలా ఇవ్వు.

అనూరాధ:—నేను ఎన్నో పూలు కోశాను. కాని, ఒక్క పువ్వుకూడా నా చేతుల్లో నిలువలేదు. అంధకారంలో ఇదేమి ఆరాధన తల్లీ?

సుందరి:—ఒకవేళ ఆయన ఇక్కడు భగవానునితో వచ్చా డనుకో: మనం వాళ్లను ఏపూలతో పూజించగలం? అనూ! ఆయనవచ్చే చిహ్న లేమీ కనబడటం లేదు. ఇంతసేపు ఆయన అక్కడ ఏం చేస్తూన్నాడో! అనూ! ఎక్కడవున్నావు? నేను నీకు కనబడుతున్నానా?

అనూరాధ:—అంతఃపురంలోకి వెళ్లదురూ.

సుందరి:—అదిమాత్రం అంధకారం కాదూ? ఈచీకటిని ఏవెలుగూ భేదించలేదు. అనూ, చీకటి: చిమ్మచీకటి. ఇంక ఈప్రాణికి వెలుగులేదు.

అనూరాధ:—లేకేమి తల్లీ! కాస్త కళ్ళు తెరిచి చూడండి.

సుందరి:—కళ్లల్లో ఏముందే పిచ్చిదానా!

అనూరాధ:—అవును. చీకటివెలుగులు కేవలం మనస్సునే ఆశ్రయించి ఉంటవి.

సుందరి:—అదో, మరీ వేదాంతం! అబ్బా! నా కర్థంకాదే. అవును నా అనుభవాని కందని దేదీ

నాకర్థంకాదు. సౌందర్యం క్షణిక మంటావు. ప్రపంచ మంతా బహిర్ముఖం కనుకనే ఈచిక్కులన్నీ అంటావు!! ఏమిటో! అంతా! నాకు ఒకటీ అర్థంకాదు. చక్కని ముఖం చూస్తే పరవశేనవుతాను. చల్లని గానం వింటే తన్మయ నవుతాను. అదీ ఆనందమని నే నంటాను: వేదన అని నీవంటావు. నాగోడు నీ కర్థం కాదు: నీగోడు నా కర్థంకాదు.

అనూరాధ:—అవును. చక్కని ముఖం చూచి పరవశేవవుతావు: అది మఱీ మఱీ కనబడకుంటే క్రుంగిపోతావు. నాజీవితంలో క్రుంగూ లేదు, పొంగూ లేదు. అదీ మన ఇద్దరికీ భేదం.

[దూరంనుంచీ ఒక భిక్షుగీతం వినబడుతుంది]

కనబడునది మాత్రమెగ్గ లోకమ్ము గాదు
ఇందలి సుఖమ్ముతో ఆత్మ తృప్తిపడదు
ఎన్ని జగముల నేలిన ఏలవచ్చు
గాని లోని శత్రుల గెల్వగలడె నరుడు?

[సుందరి ఉలిక్కిపడుతుంది]

అనూరాధ:—అలా ఉలిక్కిపడుతా వెందుకూ? ఎవడో భిక్షువు పాడుకొంటూ పోతూన్నాడు.

సుందరి:—అనూ, అతన్ని పాడవద్దని చెప్ప లేవూ?

[పాట మళ్లీ వినబడుతుంది]

కాలసర్పము వేరు పూమాల వేరు
మృత్యువక్త్రము వేరు యామినులు వేరు
జ్వలితదావాగ్ని వేరు భాస్కరుడు వేరు
మలినకామమ్ము వేరు ప్రేమమ్ము వేరు.

సుందరి:—అబ్బా! ఆగొంతు వినలేను అనూ!

అనూరాధ:—అవును. ఏదో పరిచితకంఠంలా ఉంది.

[పాట మఱింత దగ్గరగా వినబడుతుంది]

నాథ! నాథా! అటంచు అనాథపగిది
ఏడ్చి ఏడ్చి కృశించిన ఏమి ఫలము?
కనులు విప్పుము బయటి లోకమ్ము నలుపు
విలయతాండవమ్మును చూడదలతు వేని
ప్రియుని హృత్పీఠిపై నుంచి రేయి పగలు
పూవుదోటల తిరిగెడు ముగ్ధవగుట?
పాపకూపమ్ములో నచ్చు ప్రాణికోటి
చేయు హాహారవమ్ములు చెవిని బడవొ?

సుందరి:—అనూ! ఆకంఠం ఎంత దగ్గరలో ఉందో చూడు: నాగుండె పిలిచినట్లుంది.

అనూ:—అరే! అడుగుల చప్పుడుకూడా వినబడుతూంది. ఎవ రక్కడ?

(దూరంనుంచీ)

నేను: సన్యాసి.

అనూరాధ:—సన్యాసి!! ఇంత చీకట్లో ఇక్కడి కెందు కొస్తూన్నావు?

సుందరి:—అబ్బా! సన్యాసి కాదే! ఆగొంతు పోల్చుకోలేవూ?

సన్యాసి:—సన్యాసినే! వెళ్లమంటే వెళ్లుతాను. తోటలో కాస్త విశ్రమిద్దామని వచ్చాను. అలసిపోయ్యాను.

అనూరాధ:—నీవు సన్యాసివి కావు.

సన్యాసి:—ఎందు కలా అన్నావు?

అనూరాధ:—సన్యాసిఅడుగులు అలా తడబడవే! నీలో ఇంకా ఏదో కోరిక ఉంది.

సన్యాసి:—మీరలా అంటే నే నేం చెప్పగలను? సన్యాసిని కావనుకోండి. ఒక పాంథుడను. ప్రయాణపు బడలికతో డస్సిపోయ్యాను: కాస్త సేదదీర్చుకోనీరూ?

సుందరి:—లోపల రమ్మను, అనూ. అబ్బా! ఆగొంతు ఎవరి దనుకున్నావు?...కాని, ఆయన—ఆయన—అనూ...

అనూరాధ—ఆయన? ఎవరు?

సన్యాసి:—నన్ను పొమ్మన్నారా?

సుందరి:—(విసుగుతో) ఎవరు? ఎవరు? అంత అర్థం చేసుకోలేకుంటే నే నేం చేయగలను? ఆయన్ను లోపల రమ్మనవే.

అనూరాధ:—సన్యాసిగారికి స్వాగతం!

[సన్యాసిప్రవేశం]

సుందరి:—మీరు ఎక్కడనుంచీ ఎక్కడికి వెళ్లుతూన్నారో సెలవిస్తారా?

సన్యాసి:—సత్యపథం త్రొక్కి ముక్తిపదం చేరుకుందామని ఈయాత్ర.

అనూరాధ:—యాత్రా? యాతనా?

[సన్యాసీ పలుకడు]

అనూరాధ:—సన్యాసిగారు సమాధిలో ఉన్నట్లుందే! అదో! అదో! తెల్లవారుతూంది!

సుందరి:—(బిగ్గరగా) మహారాజా! (సన్యాసిని కౌగిలించుకుంటుంది) అనూ! అనుకున్నంతా అయింది.

నందుడు:—సుందరీ! నీస్వప్నం సఫలమైంది: ఇదో సన్యాసి. సముద్ర మీదాము. ఇంక పర్వత మెక్కాలి. నాఅన్నను భిక్షకు పిలిస్తే, నాకు ఆయన భిక్ష పెట్టాడు. సుందరీ, ఈదీక్షాభిక్షను నాసహధర్మ చారిణితో పంచుకుందామని వచ్చాను. సుందరీ! లే! కళ్లు తెరు. తెల్లవారింది.

సుందరి:— మహాప్రసాదం, ప్రభూ. మీ రెక్కడో నేనూ అక్కడే!! జై! బుద్ధభగవాన్‌కూ జై!

[సుందరీనందులు పాడుతారు]

ఘోరదారిద్ర్యమున చిక్కి కుమిలిపోవు
వికటబీభత్ససంఘమ్ము విడుచు నూర్పు
సెగకు వాడలి ప్రకృతిలోని కెగిరిపోయి
కలల లోకాన కాలమ్ము గడిపినాము
క్షణము నిలుకడ లేని ఆ చందమామ
విసరు క్రీగంటిచూపుల విసము లేని
వలపువెన్నకై నోములు సలిపినాము
పూవుకన్నెలో దాగుడుమూత లాడి
అలసిసొలసిన మధుపమ్ము ఆలపించు
మధురగీతి ఆలించి మైమఱచినాము
అప్పుడే పుట్టి అప్పుడే ఆరిపోవు
మెఱుపు పిల్లల చెలిమికై మురిసినాము
అలల వింతసొబగులు నిత్యమ్ములనుచు
కేకలిడుచు ఎటకో పరుగెత్తినాము
మమత జిక్కిన గ్రుడ్డిదంపతుల మేము
యౌవనోద్ధతిచే హృదయాలు కాలి
బూదిగా నిల్చె ప్రణయానుభూతి లేక
ఇంక నీకేమి నైవేద్య మీయగలము?
పతిత జీవితా లివిగో! అంకితము తండ్రి!
స్వీకరించి కృతార్థుల చేయుమయ్య
అంతరాత్మస్వరూప! బుద్ధా నమోస్తు!

అనూరాధ:— జై! బుద్ధ భగవాన్‌కీ జై!

(పాడును)

ధన్యవాదా లివిగో తల్లి ప్రాభాతికి
క్రొత్త ముత్తైదువు కుంకుమబొట్టులా
ప్రాగ్దిగంగన ఫాలభాగాన మెలిచింది
పూలలో వన్నెలు ముత్యాల ముగ్గులై
కలిసినయ్ నైతన్యఫలముగా నిలిచినయ్
ఈవసంతోత్సవమే మా తపఃఫలము!!!

సహవాసకాంక్ష

•

= శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి =

నిన్ను సృజించె దైవము వనీస్థలి గాయనిగా నఖండగ
రోన్నతి బాడుచుండు నమృతోక్తుల రాగరసంబు లూర నీ
సన్నిధిఁజేర్చి దుర్భరవిషాదము లెల్ల దొలంగిపోవ నీ
కున్న సుఖం బొసంగి మఱపొందగఁజేయుము లోకవృత్తముల్.

పారెదు నీసెలల్ హృదయభార మడంపగ, నిర్జనంబుగా
దూరి వనీనికుంజముల, తోడుగ నుండెద నీకు నేను దు
ర్వారములై ప్రశాంతిసుఖభంగము గొల్పెడు లోకవృత్తముల్
దూరముగాగ నన్ను దయతో వసియింపగ నిమ్ము చేరువన్.

గాలిం దూగు లతావితానముల నైక్యం బొంది జీవింతునా
నేలన్ రాలిన శుష్కపత్రములలో నే ప్రాణముల్ దాతునా
చాలుంజాలు నపారదుఃఖములతో సాగింపగాలేను నీ
యాలాపంబె సుఖంబు గూర్చు, చనవిమ్మా నీయుపాంతంబునన్.

ఏకాంతంబును గోరు నాహృదయ మింకేనాటికిన్ నీవలెన్
రాకల్ పోకలు నివ్వనీలలితగర్భంబందె కావింతు, నీ
లోకంబందలి వృత్తముల్ మఱచి యాలోకింతు నానందలీ
లాకల్యాణములన్ వనప్రియముగా రాణింతు నిచ్చోటునన్.

కాలాతీతము సేయుదేమొ యను శంకన్ నామనంబెల్ల ను
య్యాలన్ బోలె చలించుచున్న దమృతం బాసించి జీవించు నన్
వాలాయంబు విషప్రపూరముల ముంపన్ లోకవృత్తాంతముల్
జాలింగొల్పదొ నా కథాకథన మీమణ్మాత్ర ముల్లంబునన్.

కోయని నన్ను బిల్వ నిక కోకిల, మెల్ల దురంతవేదనల్
పాయలుగాగ నీవెలుగరాని విధంబున కన్ను మూసి, నీ
లో, మెలమావిజొంపములలో, శ్రుతిపేయరసార్ద్రగీతిలో
నీయదనన్ వసించెద, లయించెద, లోకము విస్మరించెదన్.

షాడబమంటే?

= శ్రీ డా. చిలుకూరి నారాయణరావు =

గత ఆషాఢమాసపు భారతిలో శ్రీ బులుసు వెంకటరమణయ్యగారు వ్రాసిన 'షాడబము' అనే వ్యాసమును చదివినాను. ఇట్టి పదములు మరికొన్ని కూడా అర్థవిచారము చేయవలసినవి ఉన్నవి.

షాడబము అంటే "ఆమ్లరసములతో గూడిన పదార్థములు" అని పాండురంగమాహాత్మ్యపు లఘుటీకలో ఉన్నదనిన్నీ, వావిళ్ల వారున్నూ వేదం వెంకట్రాయశాస్త్రిలవారున్నూ రుచి అనే అర్థము చెప్పినారనిన్నీ, అది సరికాదనిన్నీ, దానికి అర్థము "ఓగిరములలో నొకటి యగు పానీయవిశేష" మనిన్నీ, అది ఉపాహారము లేక టిఫిన్ అనిన్నీ, అందుచేత ఆముక్తమాల్యదాపద్యములోని 'నృపాహారము' అనే పదమును 'ఉపాహారము'గా దిద్దుకోవలసిన దనిన్నీ శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిలుగారు ఆంధ్రవారపత్రిక బహుధాన్యదసరా సంచికలో వ్రాసినదానిని ఖండిస్తూ శ్రీ బులుసు వెంకటరమణయ్యగారు షాడబశబ్దానికి "పులుసు" అని అర్థము చెప్పవలెనని తీర్మానించినారు.

షాడబశబ్దమునకు వారు వారు తెలిపిన అర్థాలేవిన్నీ నాకు నచ్చలేదు.

ఒక సంస్కృతకోశములో షాడవము అంటే రుచి, రంగు, రాగము అనే అర్థము యివ్వబడినది. షాడవ మనే పదము సంగీతశాస్త్రములో ప్రసిద్ధము. వాల్మీకిరామాయణాది సంస్కృత గ్రంథాలలో షాడబశబ్దము కనబడుతున్నది. షాడవ మనే శబ్దమునకే షాడబ మనేది రూపాంతరము. కాని దానికి సంగీతములో ప్రసక్తి లేదు. అది భోజనవిషయములోనే వాడబడినది. తెనుగుగ్రంథాలలోకూడా షాడబము భోజ్యవస్తువుగానే వాడబడినది. షాడబశబ్దమునకు షట్సంఖ్యతో సంబంధమును గల్పించి రుచు లారుకాబట్టి షడ్రుచులతో గూడినది అని అర్థము చెప్పుకోవడము కూడా సరికాదు. షాడబము అనేది పానీయము కాదు. ఓగిరములు కడుపులోనికి చల్లగా దిగడాని కుపకరించే వ్యంజనమున్నూ కాదు. అది ఉపాహారమున్నూ కాదు. షడ్రుచులు గలదిన్నీ కాదు. అది ఒక తీయని భక్ష్యము; పిండివంట; మిఠాయి వస్తువు. దానిని భోజన సమయమందే తక్కిన వస్తువులతోబాటు ఆరగిస్తారు.

షాడవశబ్దానికి విల్సన్ పండితుడు తన సంస్కృత నిఘంటువులో **"Confectionery, Sweet Meats"** అని అర్థము వ్రాసి, ఆపదమునకు "ఖాడవ, ఖాండవ" అనేవి రూపాంతరాలని తెలిపినాడు. ఖాడవ, ఖాండవ శబ్దాలకు **"Sugar candy, Sugar plum, Sweet meats"** అని అర్థము వ్రాసి రామాయణ మహాభారతములలో ఉదాహరణము లున్నవని నిరూపించినాడు. షాడవశబ్దమునకు ప్రయోగము సుశ్రుతములో భక్ష్యార్థమున నున్నట్లు తెలిపినాడు.

ఖాడవ, ఖాండవశబ్దములు షాడవశబ్దమునకు ప్రాకృతరూపములు. సంస్కృతములోని శ, ష, స లు ప్రాకృతములో ఖకారముగా మారడము ప్రసిద్ధము. ఉదా: స్తంభః=ఖంభో. ఈప్రాకృతపదములైన ఖాడవ, ఖాండవములే సంస్కృతపదములుగా సంస్కృతగ్రంథాలలో వాడబడినవి.

ఐతే షాడబ మనే భక్ష్య మేది? ఇప్పుడు ఆ భక్ష్యములను తింటున్నా మనే నా అభిప్రాయము. ఈ షాడబవికారమైన ఖాడబమునే కన్నడమువారు 'కడబు' అనే పేరుతో నేడున్నూ తింటున్నారు. 'కడబు'కు కుడుము అనేది కన్నడములోనే రూపాంతరము. కుడుములు, ఉండ్రాళ్లు తెలుగువారికి తెలిసినవే. కన్నడమువారికి కడబుకుడుములున్నూ, తెలుగువారికి కుడుములూ, ఉండ్రాళ్లున్నూ చాలా ఇష్టము.

పిటెని ఆవిరిమీద ఉడికించి చేస్తారు. ఆవిరిమీద ఉడికించేవి ఇడ్డెనలుకూడా ఉన్నవి. పలుచగా గుండ్రముగా ఉండేవి ఇడ్డెనలు. అట్లే గిన్నెలలోను, పనసాకు బుట్టలలోనూ మినపప్పిండిని ఉడికించి చేసినవికూడా ఒకప్పుడు కుడుములనే అంటారు. కాని తీయని పూర్ణము లోపలపెట్టి, పిండిలో ముంచి, ఆవిరిమీద ఉడికించినవాటినిన్నీ కుడుములు అనడం వాడుకలో నున్నది. కోలగా ఉంటే కుడుములవుతవి; గుండ్రముగా బూరెలవలె ఉంటే ఉండ్రాళ్లవుతవి. ఇవి రెండున్నూ తీయని భక్ష్యాలే.

ఈ అర్థమును వెంకటరమణయ్యగారు వ్రాసిన వ్యాసములోని పద్యాలలో ఉన్న పాడబశబ్దానికి అన్వయిస్తే, చక్కగా సరిపోతుంది. శిఖరపాడబములు అనే పదము భీమఖండములో ఉపయోగింపబడినది కదా. అదే ఉండ్రాయని చెప్పవచ్చును. ఉండ్రాయి గుండ్రముగా ఉండి పైని శిఖరము కలిగిఉంటుంది. కోలగా ఉండేది సాధారణపాడబము, లేక కుడుము. పాడబశబ్దముప్రక్క కొన్ని ద్రవపదార్థముల పేర్లు ఆపద్యములలో ఉండడముచేత పాడబముకూడా ద్రవపదార్థము, పానీయము, పులుసు మొదలయిన అర్థాలు చెప్పవలసిన దేమో అనే భ్రాంతికి అవకాశ మిచ్చింది. పాడబ మంటే ఆఱురుచులు గలది, పులుసు అని అర్థము చెప్పకూడదు. ఉత్తర సర్కారులవారి పులుసులో బెల్లము వేస్తే వేసుకుంటారుగాని, మా రాయలసీమ పులుసులో బెల్లం వేసుకునే వాడుక లేదు.

పాడబములు, కుడుములు, ఉండ్రాళ్లవంటి భక్ష్యమైన గరిష్ఠపదార్థము కాబట్టి ఆముక్తమాల్యదాకారు డపరాహ్ణమునంగాని కుద్ధకోద్ధతనుగాని తినుమన్నాడు. కుద్ధకోద్ధతి అంటే బాగుగా ఆకలి వేసినపుడు అని అర్థము. అపరాహ్ణపు న్నపాహారములో కుడుములుండ్రాళ్లవంటి గరిష్ఠభక్ష్యము లుండడము సహజమే. రాగమంటే రసముకాదు. రసమంటే చారూ కాదు. పాడబమంటే ఉత్తర సర్కారులవారి పులుసూ కాదు,



చెన్నరాజధానిలో చెరుకు-చక్కెర పరిశ్రమ

❀

= శ్రీ మోచెర్ల లక్ష్మీకాంతం =

(గతసంచిక తరువాయి)


ప్రస్తుతం ఈప్రాంతాల్లో సాగుబడిలో వున్న ఒక ముఖ్యమైన రకాన్ని గురించి వివరాలు మచ్చుకు వ్రాస్తాను. తరువాత తిరిగి మిగతా అభివృద్ధిమార్గాలనుగురించి మనవి చేస్తాను. సామాన్యప్రజలందరకు ప్రాముఖ్యత వహించిన కొన్ని చెరుకురకాల గుణగణాలు విశదపరుద్దా మన్న ఉద్దేశ్యంతో ఈమధ్యనే ఇంగ్లీషులో వ్రాసిన ఒక "బులెటిన్" * నుంచి ఈ దిగువ అంశములు ఉద్ఘాటింపబడ్డాయి.(ఇది యింకా ప్రచురింపబడలేదు)

కో. ౪౧౯

౧. తలిదండ్రులు:—పి. ఓ. జే. ౨౮౭౮ కో. ౨౯౦ చెరుకులు.

౨. ఎదిగే స్వభావము, అగుపడు రూపము:—ఒకమోస్తరుగానో, లేక పూర్తిగానో నిటారుగా ఎదిగే లక్షణం చిన్నతనంలో. చిట్ట చివర రెండుమూడు ఆకులు నిలబడిఉంటాయి. వాటి చిగుళ్లమాత్రం వేలబడివుంటాయి. ఇవే గాక చివురున వున్న ఆకులన్నీ కూడా చెరుక్కి నలువైపులా మెడలు వంచివుంటాయి. క్రింద ఆకులు ఏటవాలుగా పైకి బయలుదేరి కొనలు మాత్రం వంగివుంటాయి.

3. ఆకు:—బాగా పొడుగ్గాను, వెడల్పుగాను, ఆకుపచ్చగాను ఉంటాయి రేకులు. వీటి తొడిమ, లేక ఒర ఎండగానే దానంతట అదే ఊడి రేకును రాల్చేస్తుంది. ఈ ఒరపైభాగంమీద, ముఖ్యంగా దానిలో మూడోవంతుపొడుక్కి, తివాసీ పరిచినట్లు ఒత్తుగా నూగుంటుంది. ఇది వాడిపోయినకొద్దీ, పక్కాల్ని లేతఎరుపు, లేక ఇటిక బొంతరంగు వస్తుంది. ఆకుమెడ (Collar) చిన్నతనం



లోనే ఊదారంగు కలదిగా ఉంటుంది. దీని వెనక

* *A monograph on some sugar-cane varieties by* R. Vasudeva Rao, M. Lakshmikantham and P. Sitharamiah)

భాగంలో సన్న లిగ్యూల్లు అను చర్మము చిన్నదిగా ఆర్చివలె ఉంటుంది. ఈచర్మముపైఅంచుమీద చిన్న రోమా లుంటాయి. క్రింది అంచు, మధ్య లోతుగాను చిగుళ్లు వంపుగాను ఉంటాయి.

ఒరఅంచుమీదనుంచి, మెడదగ్గర, త్రిభుజాకారం గలిగిన "లిగ్యులర్ ప్రోసెస్సు"అనేది పైకి చొచ్చుకొస్తుంది. ఇది పొట్టిగా ఒకవైపునే వుంటుంది. ఆఖరుకు పుట్టిన చెరుకుల్లో చాలా పెద్దదిగా కనబడుతుంది. ఆకుఒర చెరుకు నంటుకొనిఉన్న స్థలం వంపుగా నిబ్బరంగా పైకి కనపిస్తూఉంటుంది.

౪. చెరుకు:—లావై, రసపూరితమైన మెత్తని చెరుకు. పిప్పి తక్కువ. రకరకాల రంగులు ఒక్క చెరుకుమీదే కనపిస్తాయి. ఆకుపచ్చతో గూడిన లేత పసుపురంగు సాధారణంగా. లేతఎరుపువర్ణపు ఖండాలు, చిగుళ్లు ఆకుపచ్చగా నుండి, వాటిమీద నల్లని బూజు లాంటి మరక లుండటం అప్పుడప్పుడు మామూలు. సగటున ఒక్కొక్క చెరుకు మూడుంబావుపౌనుల బరువు, రెండుమ్ముప్పావుసెంటిమీటర్ల అడ్డకొలత గలదిగా వుంటుంది. నూరుపౌనుల చెరుకు సుమారు ౬౯ పౌనుల రసం ఇస్తుంది. ఒక్కొక్క చెరుకులో సగటున నాలుగుమ్ముప్పావుఅంగుళాల పొడుగు గల ౨౬ ఖండా లుంటాయి. వాని ఆకారం 'సిలిండర్ల'ను పోలివుంటుంది. ఒక్కొక్కప్పుడు పీపాలవలెకూడా వుంటాయి. ఎదుగుదలరేఖ (గ్రోత్ రింగ్) నదరుగా కనబడదు. లేతపసుపురంగు. అరుదుగా పైకి ఉబుకుతుంది. కొన్ని చెరుకులు కణుపులదగ్గిర బాగా సన్నగా వుంటాయి. ప్రతిఖండముకూడ కణుపుదగ్గర మొగ్గ, లేక కన్నువైపు ఉబికివుంటుంది. కొన్ని చెరుకుల్లో మొగ్గదోనె, లేక కన్నుమీదికాలువ (బడ్ గ్రూవ్) విశదంగా అగుపడుతుంది. సన్నని పగుళ్లు కణుపుల దగ్గర చిన్నవిగా అప్పుడప్పుడు ఉంటాయి. పండిన కణుపులమీద రాపిడిమచ్చలు (**Weather Markings**) బాగా కనపిస్తాయి. చెరుకు చాలా అరుదుగా పగుల్తుంది. లేతకణుపులదగ్గర బొట్లులాగా ఉండే వేళ్లమాళ్ళకలు (**Root-eyes**)లేత ఊదారంగుగా ఉంటాయి. అనకాపల్లిలో చెరుకు వెంటు రేలదు. గుడియాత్తంలో కొంచెం వెంటు కనబడుతుంది. ఫిబ్రవరి, మార్చినెలలలో బాగా ఎదిగిఉండటంవల్ల పడిపోలేపోవచ్చు. చాలా పెళుసు చెరుకు. చెరుకు నిలుచునిఉండగానే క్రింద కణుపుల్లో వేళ్లురేన్నే స్వభావంఅట్టేలేదు.

౫. మొగ్గ, లేక కన్ను:—నారింజపండుచాయ. "డైమను"ఆకారం కలిగిఉంటుంది. కన్నుమీద పొర అంచు కన్నుమధ్యభాగంనుంచి పైకి లేచినట్లు ఉంటుంది. అంతా ఒకటే వెడల్పు. ఎదుగుదలరేఖకు తగుల్తూవుంటుంది. ఒక్కొక్కప్పుడు దానిమీదకే ప్రాకుతుంది. నెత్తిమీద కొద్దిగా ముళ్లుంటాయి. ముదిరిన మొగ్గలు స్ఫుటంగా కనుపిస్తాయి.

౬. మొగ్గమొలకస్వభావము:—కొంచెం త్వరగానే మొలకెత్తుతుంది. అనకాపల్లిలో ౬౬, ౬౫ మొదలు ౭౦ వరకు సామర్లకోటలో, ౭౩ గుడియాత్తంలో, సుమారు ౬౦ మొగ్గలు కోయంబత్తూరులోను నూటికి మొలకెత్తుతాయి.

౭. పొడుగు:—అనకాపల్లిలో ౧౫౫ అంగుళాల ఎత్తెదుగుతుంది. అందులో ౧౩౦ అంగుళాలు గానుగఆడటానికి ఉపయోగకరమైన చెరుకు. పాలూరులో ౧౧౯", సామర్లకోటలో ౧౬౭", కోయంబత్తూరులో ౧౦౮", గుడియాత్తంలో ౧౩౭"వరకు ఎదుగుతోంది. జీవితం అంతలోకూడా మంచిజోరుగా ఎదిగే స్వభావం.

౮. పిలకలుపెట్టే శక్తి:— నూరు మొగ్గలు మొలిస్తే ౧౧౧ పిలకలు అనకాపల్లిలోను, ౧౩౦ సామర్లకోటలోను ఉద్భవిస్తాయి. పాలూరు, కోయంబత్తూరు, గుడియాత్తంలోకూడా బాగానే జంటలు పెడుతుంది. ఒక యకరంలో సగటున సుమార్లు ౩౮,౦౦౦ చెరుకులు తోటకొట్టే సమయంలో ఉన్నట్లు తేలింది.

౯. వెన్ను వేయుట:—అనకాపల్లిలోను, సామర్లకోటలోను ఒకటి, అర పూస్తే పూస్తాయి. పాలూరులోకూడా సాధారణంగా వెన్ను వేయదు. గుడియాత్తంలో నూటికి ౨ మొదలు ౬౨ చెరుకుల దాకా పూస్తాయి. కోయంబత్తూరులో పూత చాలా ఎక్కువ.

౧౦. రసలక్షణాలు:—నూరుపౌనుల రసంలో ౧౭ పాళ్లు అనకాపల్లిలో (మార్చినెలలో)ను, ౧౭.౭ పాళ్లు సామర్లకోట, కోయంబత్తూరులలోను, ౧౯ పాళ్లుపైచిలుకు గుడియాత్తంలోను పంచదార వుంది. రసంలో వున్న ఘనపదార్థాల్లో నూటికి ౯౦ పాళ్లు పంచదారగానే వుంటుంది.

౧౧. పక్వమయ్యే కాలము, కొట్టవలసిన సమయము:—అనకాపల్లి, సామర్లకోట, పాలూరుప్రాంతాల్లో మార్చినెలలో తోట పక్వానికి వచ్చి ఆడటానికి మంచి అనుకూలంగా ఉంటుంది. గుడియాత్తం కోయంబత్తూరులలో ఫిబ్రవరినెలనుంచికూడ తోట కొట్టవచ్చు. ఏప్రిల్, మే మాసాలలో రసం విరిగిపోతుంది.

౧౨. యకరానికి చెరకుదిగుబడి:— సుమారు ౫౫ టన్నుల చెరకు అనకాపల్లిలోను, ౬౦ టన్నులు పాలూరులోను, కోయంబత్తూరులోను ౬౫ మొదలు ౮౦ టన్నులదాకా సామర్లకోటలోను, సుమారు ౪౦ టన్నులు గుడియాత్తంలోను దిగుబడిఇస్తుంది.

౧౩. బెల్లపు నాణ్యము, దిగుబడి:— నూరుపౌనుల చెరుక్కు ౧౨.౧౯ పౌనులు. నూరుపౌనుల రసానికి ౧౮.౬ పౌనులు అనకాపల్లిలో బెల్లపు దిగుబడి. గుడియాత్తంలో ౧౩.౧౨, కోయంబత్తూరులో ౧౨.౫ పౌనులు బెల్లం ౧౦౦ పౌనుల చెరుక్కు దిగుబడి అని కనిపిస్తుంది. సుమారు ౯ టన్నుల బెల్లం సామర్లకోటలో యకరానికి ఆదాయంగా తేలింది.

బెల్లం నాణ్యమైనదే. చాలా లేతపసుపురంగు మొదలు నల్లవాకుగా నున్న బూడిదరంగుచాయవరకు వుంటుంది. రవకట్టు గణితం బాగానే ఉంటాయి.

౧౪. కార్శితోట:—కార్శి ఉంచినా మంచి ఫలితం యిస్తుంది. మొదటిసంవత్సరంకార్శి ౩౭ టన్నులు, రెండోకార్శి ౩౦ టన్నులు యకరానికి చెరకుదిగుబడి నిచ్చాయి.

౧౫. పురుగుల బాధను, ఒరపు మొదలైనవాటిని ఓర్చే శక్తి:—చెరకును తొలచి పుచ్చిపోయేటట్లు చేసే "బోరర్" అనబడే కీటకాలు దీన్ని ఎక్కువ బాధిస్తాయి. అనకాపల్లిలో నూటికి ౧౨.౮౪ ఖండాలు మొక్కతోటలోను, ౧౦.౬౯ ఖండాలు మొదటికార్శిలోను, ౧౨.౫౩ ఖండాలు రెండోకార్శిలోను పుచ్చిపోయాయి. కోయంబత్తూరులో నూటికి ౫౦ చెరకులు, అందులోను నూటికి ౫ మొదలు ౯ ఖండాలు పుచ్చినట్లు తెలుస్తుంది. "మిలీబగ్" అనే క్రిమికూడ దీనికి పడుతుంది. ఉడతలు కొట్టెయ్యడంకూడ కద్దు. ఢిల్లీ, కర్నాల్ పరిశోధనస్థానాల్లో ఇది "మొసాయిక్" అనే జబ్బుకు, కణ్లతెగులు (రెడ్ రాట్)కు, వాడు జబ్బు (Wilt)కు, ఆకులు చుట్టుకుపోయేజబ్బు (Top-rot)కుకూడా చాల సులువుగా లొంగిపోతుందని కనిపెట్టారు. పాలూరులో, గుడియాత్తంలో, విశాఖపట్నం ఉత్తరాదితాలూకాల్లోను కాటుక తెగులు (Smut) కనబడింది.

ఒరుపును, నీటిఎద్దడిని అద్భుతంగా ఓరుస్తుంది. ఆకులు ఎండకు మాడిపోయినట్లు కనబడినా ఊడ్చేటప్పుడు పెట్టిన ఒక్క తడితోనే పెరిగి మిగతారకాలన్నిటికంటె ఎక్కువ దిగుబడి ఇచ్చింది.

౧౬. సాగుచేయటానికి అనువైన భూమి, కావలసిన దోహదము:—ఈ రాష్ట్రంలో ఏప్రాంతాల్లోనైనాసరే, ఏరకంభూమిలోనైనాసరే ఎట్లాంటి దోహదం చేసినా చెయ్యకపోయినా ఇతరరకాలన్నింటికంటె బాగా ఉంది. తొలకరించినతరువాత ఏ ఆగష్టుమాసాంతంనుంచే ఎడతెగకుండా నీరు నిలవవుండే భూమిలో వేస్తే యకరానికి సుమారు ౫౦ టన్నుల చెరకుదిగుబడి యిచ్చింది. కొంచెంచవిటి భూముల్లోకూడా కో.౩౪౯ నల్లమొగలిచెరకులకు పైచేయి అనిపించుకుంది రామచంద్రపురం తాలూకాలో. ఎరువు ఎంతవేస్తే అంత మంచిఫలితం ఇస్తుంది. నత్రజని ఎరువులేకుండానే (కో. ౪౧౯) ౮౫ పౌనులు, నత్రజని వేసిన కో. ౩౪౯, పి. ఓ. జె. ౨౮౭౮ చెరకు లిచ్చినపాటి ఆదాయం ఇచ్చేస్తుంది.

సుమారు ౫౦,౦౦౦ యకరాలు మద్రాసుపశ్చిమజిల్లాలలోను, ౧౭,౦౦౦ యకరాలు మధ్యభాగంలోను, ౧౫,౦౦౦ యకరాలు ఉత్తరాదిజిల్లాలలోను ఈరకం పండిస్తారు. ప్రస్తుతం ఈరకంక్రిందనున్న

విస్తీర్ణం ఈరాజధానిలో నాటికి ౩౮ వంతులకుపైగా ఉంటుంది. ఇతరరాష్ట్రాలలో ఒక బొంబాయిరాజధానిలోనే దీన్ని ఎక్కువగా సాగుచేస్తారు. ఇది మంచి ఉపయోగకరమైన రకమని నిశ్చయంగా నిర్ధారణ చేయబడిన చెరుకు.

౧౯౩౫ - ౩౬ సంవత్సరం బొంబాయిలో ౪౦ మొదలు ౧౦౦ టన్నుల చెరుకు పంచదారపాలు తరుగకుండానే యకరానికి దిగుబడివచ్చింది. ౧౯౪౧-౪౨ సంవత్సరంలో ఒకపొలంలో ౪౧౩ టన్నుల చెరుకుదాకా పండింది పామర్లకోటలో. దీనికి దుర్గుణాలు రెండే : ఒకటి పెళుసుదనం; రెండు పిప్పి తక్కువ. ఇవి ముఖ్యంగా పంచదారఫ్యాక్టరీయజమానులకు అనర్థంగా కనుపిస్తాయి. కాని రైతుకు ఇంతకంటె లాభదాయకమైన చెరుకురకం లేదు. పడిపోయి ముక్కలైపోయి ఎండిపోయిన చెరుకు తీసేసినా నిలబడివున్న ఇతరరకాలకంటె ఎక్కువ ఆదాయం ఇస్తుంది. ప్రస్తుతం సాగులోనున్న చెరుకు రకా లన్నింటిలోను ఇది అగ్రస్థానాన్ని అలంకరిస్తుంది.

ముక్తసరిగా చెప్పాలంటే—ఇది ఉష్ణమండలాని కంతటికీ అత్యద్భుతమైన చెరుకురకంగా పరిగణించాలి.

(ii,iii) అనువుకు చేయవలసిన సేద్య విధానావలంబనం; సరియైన సమయానికి తగిన ఎరువు వేయటం, దోహదంచేయుట : — అనాదినుంచి వ్యవసాయమే జీవనాధారంగా గలిగిన మన రైతులు చాల అనుభవశాలులు. పైన వ్రాసినట్లు మంచిచెరుకుల్ని సృష్టించిఇచ్చినా దాన్నుంచి సంపూర్ణమైన లాభాన్ని పొందే అవకాశాలు సామాన్యమైనవాళ్లకు లేవు. తోటకు ఎరువువెయ్యవలసినప్పుడుగాని, చుట్టుచుట్టవలసినప్పుడు, లేక ఏపని చేయవలసివచ్చినప్పుడైనా సరే పెట్టవలసిన మదుపు లేక తోటలు పాడైపోవటం మామూలు. దీనికంటె అనర్థం మంచినీటి ఆధారం అన్నికాలాల్లో లేకపోవటం, నీటి ఎద్దడి. అయినా పెరిగే రకా లున్నాయిగదా అని వాటిని చాలా అశ్రద్ధగా సాగుచేయటం మొదలెట్టారు కొంతమంది. ఆదాయము తగ్గటమేగాక సాధారుగానున్న ఈతోట మీద పురుగు పుట్ర విజృంభించి పక్కనున్న మంచి తోటలమీదకూడ వ్యాపించి నాశనం చెయ్యటంకూడా మామూలైంది. రైతుకు సకాలంలో ఎరువులకు, ఇతర పనులకు అప్పులిచ్చి సహాయం చేసే సహకారసంస్థలు సంయుక్తపరగణాల్లోవలెనో, ఇంకా ఎక్కువగానో విరివిగా స్థాపించబడాలి. ఇదిగాక నీటివసతి ఏర్పాట్లను చెరుక్కు, యితరపంటలకుగూడా ఎక్కువ చెయ్యాలి.

(iv) సకాలంలో తోటకొట్టి బెల్లంగాని,పంచదారగాని చేయుట:—చెరుకురసంలో పంచదారపాలు బాగా ఎక్కువగా నున్నప్పుడు పంచదారగాని, బెల్లంగాని చేస్తే మనకు చాలా లాభం వస్తుంది. అదిగాక పంచదారపాలు గరిష్ఠప్రమాణాన్ని చేరేదాకా ఆగకపోయినా నూరుపాళ్ల రసానికి కనీసం ఏ ౧౫, ౧౬ పాళ్లో పంచదార ఉన్నా సంక్రాంతికి ముందు చెరుకు ఆడవచ్చు. ముందు ఆడి బెల్లం అమ్మితే ఎక్కువధర వస్తుంది. పంచదారఫ్యాక్టరీలైతే త్వరగా పని ప్రారంభించవచ్చు. ఇటువంటి త్వరగా పంటకువచ్చే రకాలు కొన్ని ముఖ్యమైనవి ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో కో. ౫౨౭ ఉత్తరజిల్లాలలోను, కో. ౪౪౯ కో. ౪౨౧ దక్షిణజిల్లాలలోను పేరుగాంచినాయి. ఇవిగాక ఆలస్యంగా పంటకువచ్చే చెరుకురకాల కార్శితోటలుకూడ త్వరగా ఆడటానికి పనికొస్తాయి. మొక్కతోటలకంటె కార్శితోటలు, చెరుకు తక్కువనిచ్చినా, పంచదారపాలు ఎక్కువగా కలిగిఉంటాయి. ఇవి ఆడినతరువాత మధ్యకాలంలో పంటకొచ్చే రకాల్ని కొట్టాలి.

ఉత్తరజిల్లాలలో కో. ౪౨౧, కో. ౪౪౯, కో. ౪౪౩ రకాలు, దక్షిణాదిని కో. ౪౪౯, కో. ౪౧౯ ఇప్పు డక్కరకువస్తాయి. ఆలస్యంగా ఆడటానికి, అనగా మార్చినెలలోను తరువాతను కో. ౪౧౯ సర్వత్రా బాగా ఉపయోగకరంగా ఉంది. అన్నిటికన్న ముఖ్యం, పక్వమైన చెరుకు పలకమారి

పోయేలోపుగా కొట్టిగాని, కొనిగాని ఆడుకొనే బాధ్యత బెల్లపురైతుమీదా, పంచదార ఫ్యాక్టరీమీదా వుంది. చెరుకుకొట్టటం ఆలస్యమైపోతే, నీటివసతి లేకపోతే చెరుకు ఎండుతేలిపోతుంది. రైతుకు నష్టం. త్వరగా పంటకొచ్చి డిశెంబరులోపుగా ఆడటానికి వీలైన చెరుకు వేసినా, ఏప్రిల్, మే మాసాల దాకా చెరుకు కొట్టకుండా అట్టేపెట్టినా రైతుకు తక్కువ చెరుకుదిగుబడి, ఎక్కువ ఖర్చు, శ్రమ కలుగుతాయి. వీటిని కనిపెట్టి రైతుకు నష్టం కలుగకుండా ఫ్యాక్టరీయజమానులు చెరుక్కు కనీసం ఇంతధర అని ఇచ్చునట్లు చేసే బాధ్యత ప్రభుత్వం మీద వుంది. ఈమధ్య గవర్నమెంటువారే వివిధ ప్రాంతాలలో చెరుకుధరల నిర్ణయం చేయటానికి కారణం ఇదే.

ఎక్కువపంట ఎట్లా పండించాలి, దాన్ని సకాలంలో ఎట్లా వినియోగించాలి అన్న విషయాలు ఈపైన చూచాయగా చూశాం. ప్రస్తుతం మనంపండించే చెరు కెంత, తయారుచేసే బెల్లం, పంచదార ఎంత అన్న విషయాన్నిగురించి ఇప్పుడు ఆలోచిద్దాం.

మన రాష్ట్రంలో సుమారు ౨,౭౩౫,౦౦౦ టన్నుల చెరుకు ఉత్పత్తిఅవుతుంది. ఇందులో ౨౧౮,౮౦౦ టన్నులు విత్తనంక్రింద (నూటికిఎనిమిది వంతులు), తినటానికి, రసంతాగటానికి ౧౬౯,౫౭౦ టన్నులు (౬.౨ వంతులు). ౨౩౨,౪౭౫ టన్నులు పంచదారఫ్యాక్టరీలలోను (౮.౫ వంతులు), మిగిలిన (౭౭.౩ వంతులు) ౨,౧౧౪,౧౫౫ టన్నులు బెల్లం చేయటానికి ఉపయోగంఅవుతోంది. సంవత్సరానికి సుమారు ౨౫౭,౦౦౦ టన్నుల బెల్లం తయారుచేస్తారు. ౭౨,౦౦౦ టన్నుల తాటిబెల్లం దీనికి అదనం. ఈ చెరుకుకాక తాటిబెల్లం కరిగించిగాని, చెరుకురసం నుంచిగాని పంచదార చేస్తారు. బెల్లం కరిగించి చేసే పంచదార సుమారు ౧౧౦౦౦ టన్నులు. ఈరాష్ట్రంలో మొత్తం పంచదారతయారు ఈదిగువపట్టే తెలుపుతుంది.

* The Indian Sugar Industry 1942 Annual, Table No. 48 నుంచి.

పంచదారతయారు టన్నులు *

సంవత్సరం	ఇండియాలో	మద్రాసులో
౧౯౩౧-౩౨	౪౭౦,౬౦౦	౨౯,౬౦౦
౧౯౩౨-౩౩	౬౪౩,౨౦౦	౩౫,౩౦౦
౧౯౩౩-౩౪	౭౧౯,౯౦౦	౩౦,౦౦౦
౧౯౩౪-౩౫	౭౭౧,౬౦౦	౩౧,౦౦౦
౧౯౩౫-౩౬	౧,౧౦౫,౦౦౦	౩౩,౭౦౦
౧౯౩౬-౩౭	౧,౨౩౭,౦౦౦	౩౩,౭౦౦
౧౯౩౭-౩౮	౧,౦౭౨,౦౦౦	౩౪,౬౦౦
౧౯౩౮-౩౯	౭౬౫,౫౦౦	౩౬,౦౦౦
౧౯౩౯-౪౦	౧,౩౯౩,౨౦౦	౪౭,౦౦౦

మనరాష్ట్రంలో అయిదుకోట్లకుపైగా ప్రజలున్నారు. ప్రస్తుతం లెక్కలప్రకారం చూస్తే ప్రతి వ్యక్తికిందా ౪.౪ పౌనుల పంచదార, ౧౨.౧ పౌనుల బెల్లం భుక్తమౌతున్నాయి. బీహారు, హైదరాబాదు, మైసూరురాష్ట్రాలను మినహాయిస్తే ప్రజలు మన రాష్ట్రంలోనే ఇంత తక్కువగా పంచదారగాని, బెల్లంగాని తినడం. అమెరికా, ఆస్ట్రేలియాల వంటి దేశాల్లో మనిషికొక్కడికి ౧౦౦ పౌనులకు పైగా పంచదార ఖర్చవుతుంది. అందువల్లనే ఆదేశవాసులు సాధారణంగా మనకంటె దార్ఢ్యం, ఓరిమి శక్తి కలిగిఉంటారు. మనం యింకా చాలా ఎక్కువ బెల్లంగాని, పంచదారగాని భోంచెయ్యాలి. పోనీ, ఈలెక్కనే చూశా మనుకోండి. అయిదుకోట్లకుపైగా ఉన్న మన రాష్ట్రప్రజలకు ౨౭౦,౦౦౦ టన్నుల కంటె ఎక్కువ బెల్లం, సుమారు ౧౦౦,౦౦౦ టన్నుల పంచదార ఏటేటా కావాలి. కాని మనం తయారు చేసేది ఇంతకంటె చాలా తక్కువ. ఏభై అరవై వేల టన్నుల పంచదార, పది ఇరువదివేల టన్నుల బెల్లం మనం ఇప్పుడు ఇతరరాష్ట్రాలనుంచి తెచ్చుకుంటున్నాము. ప్రస్తుత పరిస్థితుల్లో సరఫరాఏర్పాట్లు సందిగ్ధమైపోయి నానాఅసందర్భాలకు, అగచాట్లకు గురిఅవుతూన్నాము.

“పంటలను దండిగా పండించరా, పాడిపంట మాకే సేదు పాటించరా” అన్న పద్యపాదాలు వేదఘోషలాగా నలుదిశలా మారుమోగుతున్నాయి. ప్రపంచమంతా—ఇతరుల మాటెందుకు, మన

రాష్ట్రాన్ని స్వయంపోషకంగా చెయ్యాలిసిన అవశ్యకత ఈశాన్య పురోజుల్లో ముఖ్యంగా కనబడింది. తోట బలవటానికి అవకాశాలు గల శీతోష్ణస్థితి వున్నటువంటి మన రాష్ట్రం ఇతర ప్రాంతాల దయా ధర్మభిక్షంమీద ఆధారపడవలసిరావటం శోచనీయం. ఇటువంటి రాష్ట్రాలలో (బొంబాయి, మద్రాసు) తగినంత ఎక్కువగా చెరుకుపంట పండించకపోవటం వల్లనే మన దేశంమొత్తంమీద యకరానికి వచ్చే సగటుపంట అంత తక్కువగా ఉండి, తోటిదేశాలతో మనం తులతూగలేకపోతున్నామని ఇదివరకే మనవి చేశాను. ఇంచుమించు మన రాష్ట్రంలో తయారయ్యే బెల్లం ప్రస్తుతం మనం సగటున తినే అంచనానుబట్టి కొద్దిలోపంతో సరిపోతుందని చూశాం.

ఇక పంచదార చాలాతక్కువ అనికూడా విశద పరచాను. ఇది ఎక్కడెక్కడ తయారవుతుందో, మన రాష్ట్రం స్వయంపోషకంగా ఉండాలంటే అవలం బించవలసిన మార్గాలేమిటో ఇక్కడ చర్చిస్తాను. ఈ రాజధానిలో నున్న పంచదారమిల్లులు, అవి దినమునకు ఆడగలిగిన చెరుకు మొదలైన వివరాలు ఈక్రింద చూడండి:

పంచదారకంపెనీ పేరు	నివేశనస్థలం	దినమునకు ఆడగల చెరుకు పరిమితి-టన్నులలో
(౧) వైజాగ్ పటాం సుగర్స్ అండ్ రిఫైనరీస్ లిమిటెడ్	తుంపాల, విశాఖపట్నం జిల్లా	౧౨౫
(౨) ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ	ఏటికొప్పాక, విశాఖ పట్నంజిల్లా	౬౦
(౩) శ్రీరామ సుగర్ మిల్సు లిమిటెడ్	బొబ్బిలి	౧౫౦
(౪) శ్రీరామ సుగర్ మిల్సు లిమిటెడ్ (బొబ్బిలి) సీతానగరంబ్రాంచి	సీతానగరం	౩౦౦
(౫) కె. సి. పి. లిమిటెడ్ వారి వుయ్యూరుషుగర్ ఫ్యాక్టరీ	వుయ్యూరు, కృష్ణాజిల్లా	౨౫౦ మొదలు ౧౦౦౦
(౬) శ్రీరామకృష్ణ సుగర్ మిల్సు	కిర్లంపూడి, తూర్పుగోదావరి	౧౨౦
(౭) ది డెక్కన్ సుగర్ అండ్ అబ్కారీ కంపెనీ లిమిటెడ్	సామర్లకోట	౪౦ (బెల్లం) (ఇప్పుడు ౨౫౦ టన్నుల చెరుకుకూడా ఆడవచ్చునట)
(౮) ది ఈస్టుఇండియా డిస్టిలరీస్ అండ్ సుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్	నెల్లికుప్పం, దక్షిణఆర్కాటుజిల్లా	౧౦౦౦
(౯) ది ఇండియా సుగర్స్ అండ్ రిఫైనరీస్ లిమిటెడ్	హాస్పేట, బళ్లారిజిల్లా	౫౦౦
(౧౦) కోయంబత్తూరు కోఆపరేటివు సుగర్ మానుఫాక్చరింగ్ సొసైటీ లిమిటెడ్	పోదనూరు, కోయంబత్తూరు జిల్లా	౫౦
(౧౧) సుగర్ మిల్సు అండ్ డిస్టిలరీ	తాచానల్లూరు, తిరునల్వేలిజిల్లా	౧౬ తాటిబెల్లం
(౧౨) లక్ష్మిసుగర్ మిల్సు	లక్షణతోపుదగ్గర, తిరునల్వేలిజిల్లా	౬ (బెల్లం)
(౧౩) మురుగప్పసుగర్ కంపెనీ లిమిటెడ్	మెయిలుపట్టి, ఉత్తరఆర్కాటుజిల్లా	౪౫ (౧౦ బెల్లం)
(౧౪) ది సదరన్ ఇండియా సుగర్ కో. లిమిటెడ్ పుగలూర్ సుగర్ ఫ్యాక్టరీ	మురుగప్పపురం, తిరుచునాపల్లిజిల్లా	౧౫౦ మొదలు ౩౦౦

౧౯౩౮ సం. ఆల్ ఇండియా టారిఫుబోర్డువా రొకరిపోర్టును తయారుచేసి ప్రచురించారు. అది వారు హిందూదేశమంతా తిరిగి పరిస్థితులు సమగ్రంగా విచారించి వ్రాసిన చక్కని నివేదిక. అందులో సూచించిన సలహాలు, వెల్లడించిన అభిప్రాయాలు చాలా ఉపయోగకరమైనవి. వారు సాధారణంగా దినమునకు ౫౦౦ టన్నుల చెరుకైనా ఆడని పంచదారఫ్యాక్టరీవల్ల లాభమేమీ ఉండదనియు, నష్టము రావచ్చుననియు చెప్పిరి. మన రాష్ట్రంలో మూడుమిల్లులుతప్ప అన్నీ ౫౦౦ టన్నులకు లోపునే చెరుకు ఆడగలవు. అందువల్లనైతేనేం, ఇంకా స్వతహాగా మిల్లుమిషన్లలో దోసము లుండబట్టి అయితేనేం మనకు నూరుపౌనుల చెరుక్కు వచ్చే పంచదారదిగుబడి సుమారు తొమ్మిది పౌన్లే. చెరుకుపంటకు ముఖ్యమైన ఇతరరాష్ట్రాలలో మనకన్న హెచ్చుగా దిగుబడివస్తుంది. ఈదిగువపట్టీలోని అంకెలు* యిందుకు తార్కాణం.

రాష్ట్రం	పనిచేసిన ఫ్యాక్టరీల సంఖ్య	ఆడిన చెరుకు (టన్నులు)	పంచదార తయారు	చెరుకుతూకంమీద నూటికి పంచదార దిగుబడి ౧౯౪౦-౪౧	౧౯౪౧-౪౨
సంయుక్తపరగణాలు ...	౭౦	౩,౮౭౭,౦౦౦	౩౮౨,౯౦౦	౯.౮౭	౯.౮౭
బీహారు ...	౩౧	౧,౧౩౩,౦౦౦	౧౧౭,౩౦౦	౯.౮౬	౧౦.౩౫
పంజాబు, సింధు, సరిహద్దురాష్ట్రం ...	౪	౨౧౫,౭౦౦	౧౯,౨౦౦	౮.౯౩	౮.౯౦
మద్రాసు ...	౧౧	౩౫౨,౩౦౦	౩౦,౮౦౦	౯.౧౫	౮.౭౪
బొంబాయి ...	౧౦	౮౬౧,౧౦౦	౮౫,౦౦౦	౯.౯౪	౯.౮౭
బెంగాల్, అస్సాం ...	౯	౩౧౩,౬౦౦	౨౩,౭౦౦	౮.౫౦	౭.౫౫
ఒరిస్సా ...	౨	౩౧,౮౦౦	౩,౦౦౦	౮.౭౭	౯.౪౩
స్వదేశ సంస్థానములు ...	౧౩	౧,౨౪౧,౨౦౦	౧౧౬,౨౦౦	౯.౭౭	౯.౩౬
హిందూదేశమంతటికి ...	౧౫౦	౮,౦౨౬,౩౦౦	౭౭౮,౧౦౦	౯.౭౦	౯.౬౯

Official Estimates of the Director, Imp. Inst. of Sug. Tech. Published on 17-9-42 and 4-3-43.

పంచదారఫ్యాక్టరీలు పెద్దవిచేసి మంచి మిషన్లను పెట్టటమేకాకుండా సమర్థులైన ఉద్యోగులను నియమించి పనిచేయిస్తే ఎక్కువ పంచదార యీరాజధానిలో తయారవటానికి అవకాశాలున్నాయి. ఉన్న ఫ్యాక్టరీలు ఇట్లాగే ఉంటే, ఇవిగాక సంవత్సరానికి ౧౦,౦౦౦ టన్నుల పంచదార తయారుచేసే ఫ్యాక్టరీలు నాలుగయిదైనా ఉంటేనేగాని మనకు కావలసిన కొద్దిపాటి చక్కెరకుకూడ ఇతరరాష్ట్రాలమీద ఆధారపడక గత్యంతరం లేదు. ప్రతివ్యక్తీ ఆరోగ్యమాత్రాల్ననుసరించి ఇంకా ఎక్కువ తినాలిగనుక ఇంకా పంచదార ఎక్కువ కావలసివస్తుంది; అంటే ఫ్యాక్టరీల సంఖ్య హెచ్చించవలసొస్తుంది. ప్రస్తుతపరిస్థితులనుబట్టి చూస్తే ఈఫ్యాక్టరీలు కట్టటానికి అనువైన జిల్లాలు విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఉత్తర ఆర్కాటులని తోస్తుంది.

ఇదీ మన రాష్ట్రంలో చక్కెరపరిశ్రమపరిస్థితి. ఇంతకుపూర్వము దిగుమతిసుంకాలు విధించటంవల్లను, ఇప్పుడు అసుంకాలేగాక యుద్ధంవల్లను ఇతరదేశాలనుంచి పంచదార ఇచటికి దిగుమతిఅవటం ఆగిపోయింది. ౧౯౩౦-౩౧ సం॥లో ౧,౦౦౩,౧౭౭ టన్నుల పంచదార మన దేశం దిగుమతిచేసింది; ముఖ్యంగా జావానుంచి. అది ౨౧,౬౯౪ టన్నులలోకి దిగిపో

* The Indian Sugar Industry 1942 Annual నుంచి.

యుండి ౧౯౩౪-౩౫ సంవత్సరంవాటికి. దీని హెచ్చు తగ్గులు తరువాతిసంవత్సరాల్లో మన దేశంలో తయారు చేసిన పంచదారపరిమితినిబట్టి ఉన్నాయి.

మన దేశంలో సుమారు పదిలక్షల టన్నుల పంచదార ఖర్చవుతుంది. చెరుకుకు పురుగుపట్టిగాని, లేక ఏ అవాంతరంవల్ల గాని అంత తయారుచేయలేక పోతే అప్పుడు ఇతరదేశాల సహాయం మనం అర్థించ వలసివుంటుంది.

అసలు ఉన్న చెరుకుపంటను జాగ్రత్తగా ఉప యోగించి ఫ్యాక్టరీలు సక్రమంగా కనీసం నాలుగు నెలలు పనిచేసేటట్లు ఏర్పాటుచేస్తే మనకు ఇతరుల మీద ఆధారం ఎప్పుడూ అక్ఖర్లేదు.

ఇదిగాక ఒక గడ్డుసమస్య ఇంకా మనం తేల్చవలసి ఉంది. జావాలో సుమారు రు. ౨-౮-౦ కు తయారుచేసే మణుగు పంచదారను మనము రు ౬-౮-౦ లకుగాని చేయలేకపోతున్నాం. దీనికి ముఖ్యకార ణాలు రెండు. జావాలో ఒక మణుగు చెరుకు ఉత్ప త్తిచేయటానికి ఒక అణా అవుతుంది బాగా ఎక్కు వై తే. మద్రాసులో కనీసం అయిదణాలు అవుతుంది.

రెండవది: పురుగు, తెగుళ్లవల్ల చెరుకు పాడై పోవటం ఇక్కడ బాగా మామూలు గనక మంచిచెరు కును ఎక్కువగా తక్కువఖర్చుతో పండించాలి. దీనికి ప్రస్తుతం జరుగుచున్న పరిశోధనలకంటె ఎక్కువ బాహాటంగా జరగటానికి అవకాశాలు కలగాలి. ఈదే శంలో ప్రస్తుతం తగుమాత్రం డబ్బు ఖర్చుపెట్టి కొద్ది పాటి సిబ్బందితో పనిసాగిస్తున్నారు. జావాహవైద్వీ పాలతో సరిపోల్చటానికి అన్నివిధాలా తగివుండా లంటే, ఎక్కువమంది ప్రజ్ఞావంతులైన మనుష్యులను నియోగించి తగిన వేతనాలూ అవకాశాలూ ఇచ్చి పని చేయించి, తగిన ఫలితాన్ని పొందాలి. ప్రస్తుతం తేలిన పరిశోధనాఫలితాలు రైతులందరి అందుబాటులోకి తేవాలి. దీనికి మార్గం ఎక్కువమంది పొలాల్లో, చాలా ఊళ్లల్లో ఒకేసారి ఈఫలితాల ప్రజ్ఞను పరిశీ లించిచూచి ఉపయోగకరమైనవాటిని రైతులు అనుస రించే ఏర్పాట్లు చేయటమే. అప్పుడే దిగుమతిచేయ బడే ఒక్కొక్క హండ్రెడ్ వెయిటు పంచదారమీద ప్రస్తుతం విధించుచున్న రు ౧౧-౧-౪ రూపాయల సుంకం లేకుండానే, ఇతరదేశాల పంచదార మన దేశంలో అడుగుపెట్టకుండాచెయ్యగలం. చెయ్యాలి.*

---

*అనకాపల్లి వ్యవసాయపరిశోధన స్థానంలోని రిపోర్టులలో కొన్ని అంశాలుకూడా ఈవ్యాసంలో చేర్చాను. ఆవిషయాలను ఇందులో ఉపయోగించుకో నిచ్చిన ప్రస్తుతపు పరిశోధనాలయపు సూపరింటెండెం టు శ్రీవాసుదేవరావు నాయుడుగారికి కృతజ్ఞుడను.

ఈ నాడు అతి క్షేమంగాను అత్యుత్సాహంగాను

కూడిక చేసుకొనే విధం

ఇండియా ప్రభుత్వపు

బహుమతీ పత్రాలు

బహుమతి పత్రాలు అత్యంతము క్షేమకరమైనవి. ఐనా, ఇవి కలిగియుండేవారు పెద్ద నగదు బహుమతులు గెలవడానికి అవకాశం ఉన్నది. నూరురూపాయలతోనే 50,000 గెలుచుకోడానికి వీలున్నది. ఈ బహుమతి పత్రాలు జారీచేయబడుతూ ఉన్నంతకాలమూ సంవత్సరానికి రెండు పార్లు గెల్చుకోడానికి అవకాశం ఉన్నది. ఈ లోపున మీ పెట్టుబడి ధనమునకు విలువపోదు. 1949 జనవరి 15 నాటంగాని తర్వాతగాని మీ సొమ్ము మీకు వాపసు ఇవ్వబడును.

మీరు 10 రూపాయల కొంటుగాని, 100 రూపాయల పత్రముగాని తీసుకోవచ్చును. మీరు ఎన్ని పత్రాలయినా ఎంత విలువకైనా తీసుకోవచ్చును, పరిమితి లేదు. బహుమతులకోసం సంవత్సరమునకు రెండు పర్యాయములు పత్రాలకు చీట్లు తియ్యబడును. జనవరి 15, జూలై 15 తేదీలలో చీట్లు తీస్తారు. 1944 డిసెంబరు 17 లోపున కొనబడిన అన్ని పత్రాలున్నూ, ఇటు తర్వాత 1945 జనవరి 15 నాడు తీయబోయే చీట్లలో కలుపబడును.

బహుమతులు

రూ. 100 ల పత్రముల లక్ష విభాగాల ప్రతి వరుసకు		
రూ. 50,000 బహుమతి	1	రూ. 50,000
రూ. 20,000 బహుమతులు	2	రూ. 40,000
రూ. 5,000 బహుమతులు	2	రూ. 10,000
ప్రతి అర్థ సంవత్సరమునకు లక్షరూపాయల ప్రతి వరుసలోని పత్రములకు మొత్తం బహుమతుల విలువ		రూ. 1,00,000
రూ. 10 ల పత్రముల లక్ష విభాగాల ప్రతి వరుసకు		
రూ. 2,500 ల బహుమతి	1	రూ. 2,500
రూ. 1,250 ల బహుమతులు	2	రూ. 2,500
రూ. 500 ల బహుమతులు	5	రూ. 2,500
రూ. 250 ల బహుమతులు	10	రూ. 2,500
ప్రతి అర్థ సంవత్సరమునకు లక్షరూపాయల ప్రతి వరుసలోని పత్రములకు మొత్తం బహుమతుల విలువ		రూ. 10,000

*

బహుమతిని ఆదాయము మీద పన్ను లాటరీ పన్ను గాని, సూపర్ టాక్సు గాని, అధిక లాభాల పన్ను గాని, కార్పొరేషను పన్ను గాని విధించబడదు.

*

దొరికే స్థలములు — రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాయొక్క ఏ ఇండియన్ ఆఫీసులో అయినను, ఇంపీరియల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో నయినను, బ్రిటిష్ ఇండియాలోని గవర్నమెంట్ ట్రెజరీలలో నయినను, ఇండియా ప్రభుత్వం వారి ట్రెజరీ వ్యాపారం చేస్తున్న ఇండియన్ సంస్థానాలలోను ఈ బహుమతి పత్రాలు కొనవచ్చును.

చీట్లు తీసిన తేదీ తర్వాత ఆగస్టు 15, లేక ఫిబ్రవరి 15 తేదీలలో గాని అటు తర్వాతగాని, పైన చెప్పిన ఏ స్థలంలోగాని సబ్ ట్రెజరీలలోగాని బహుమతి మొత్తాలు చెల్లించబడును. 1949 జనవరి 15 వరకు చీట్లు తీయబడే అన్ని పార్లకున్ను బహుమతులకు యోగ్యత ప్రతీ కొంటుకున్ను ఉండును. 10 రూపాయల తరగతియొక్క బహుమతి మొత్తం నగదు రూపంగా యిస్తారు. 100 రూపాయల తరగతి యొక్క బహుమతి మొత్తం సగం నగదుగాను, మిగతది ప్రభుత్వ బుణపత్రరూపంగాను యిస్తారు. చీట్లు తీసిన తేదీ తర్వాత ఆగస్టు 15, ఫిబ్రవరి 15 తేదీలలోపల, ఇండియా గెజెటులోను పత్రికలలోను గెలిచిన నంబర్లు ప్రకటించబడును.


ఇండియా ప్రభుత్వ ఆర్థిక శాఖవారి ప్రకటన

AAA 964 TG

దేవాలయ పరిశుభ్రతకు



శుభ్రతకు దైవత్వమునకు దగ్గిర సంబంధము కలదు. ఆచార నియమములతో శుభ్రముగా స్నానముచేయుటకు మనము పరిశుభ్రమైన సబ్బునే వాడవలెను. సబ్బులో యేదో యుండవచ్చును. కాని అన్ని టాయిలెట్టుసబ్బులవలెనే గోద్రెజ్ చందనసబ్బులో కూడ స్వచ్ఛమయిన, మేలైన మూలికాతైలములు, ఎస్సెన్సులు, ధారాళముగా వాడబడినవి. వీనితోను జంతుక్రొవ్వును కలియనీరు. గోద్రెజ్ చందనపు సబ్బు, స్వచ్ఛమైన మైసూరు చందనతైలముతో తయారుచేయబడినది. అది హాయినిగొల్పు, దట్టని మనోహరమును సువాసనగల నురుగును పుట్టించును. మీగడవంటి యీ మూలికాతైలముల నురుగు రోమకూపములను శుభ్రపర్చి, చర్మమును మొహమల్ వలె నునుపుగా జేయును. చల్లదనము చేకూర్చును. గోద్రెజ్ వెజటబుల్ చందనసబ్బుకంటె స్నానమునకు మంచిది వేరొకటిలేదా యని మనలో మనము ప్రశ్నించుకొని, నిష్పక్షపాతముగా సమాధానము చెప్పకొనవచ్చును. ఎందువల్లననగా, శరీరమే దేవునియొక్క ఆలయము.



గోద్రెజ్ లింద: క్రిమిసంహారకము, చికిత్సా గుణములు గల పేరుగాంచిన లక్షణములు గలది.

Godrej Sandal
"chavi" brand

గోద్రెజ్ చందన
చావి బ్రాండ్
టాయిలెట్ సబ్బులు

గోద్రెజ్ సోప్సు, లిమిటెడ్.,
మదరాసు (164, బ్రాడ్వే)
కోయంబత్తూరు (3, ? ? స్ట్రీటు.)



ఇపుడు నీవు యౌవనంలో వున్నావు. సంతోషంగా కాలం గడుపుతున్నావు. జీవితం ఆనందమయంగావున్నది.

అయితే 25 సం॥ల తరువాత జీవితం యెట్లా వుంటుందో దాని సంగతి గురించి ఆలోచించావా?

నిరంతర కార్యవ్యాపృతితో చాలభాగం నీ జీవితం గడిచిన తరువాత ప్రశాంతంగా, జీవిత శేషం గడపాలని నీకు కోరికగా వుండవచ్చు. మాతో సంప్రదిస్తే యీ సుఖానుభవము నిజంగా జరుగుతుంది.


నేషనల్

ఇన్సూర్యారెన్సు కంపెనీ లిమిటెడ్.

అగ్ని, ప్రమాదము, మోటార్,
నౌక, తదితర సాధారణ భీమాకు

నేషనల్ ఫైర్ అండ్ జనరల్ ఇన్సూరెన్సు
కంపెనీ, లిమిటెడ్.

7. కౌన్సిల్‌హౌస్‌స్ట్రీట్, కలకత్తా.
మద్రాసు బ్రాంచి:—నేషనల్ ఇన్సూరెన్సు బిల్డింగు,
362. చైనాబజార్ రోడ్ ఎస్ప్లనేడ్.
సబ్ ఆఫీసులు:—బెంగుళూరు - మదుర.



బ్రహ్మసృష్టికి శాస్త్రజ్ఞుల ప్రతిసృష్టి

= శ్రీ లక్కరాజు రామచంద్రరావు =

సృష్టిపరిశీలన, పరిశోధనలనుండి ఉద్భవించిన మహోత్కృష్టవిధానములు రెండు. మొదటిది సృష్ట్యనుకరణ; రెండవది ప్రతిసృష్టి. ఏది ముందు సంభవించినదో తెలుసుకొనుట కష్టము. వైజ్ఞానికుల దృష్టిలో ఈ రెండు విధానములు ఈడుజోడై అభివృద్ధిపొందినట్లు తెలుస్తుంది.

'మార్గదర్శి మహర్షి'

సృష్ట్యనుకరణ ప్రతిసృష్టికి మార్గదర్శి యైన దను వాదముకూడ కలదు. ఈవాదమునకు ప్రబలాధారము విలియమ్ హెన్రీ పెర్కిన్ మహాశయుని సాహసకృత్యమే. ౧౮౫౬వ సం.లో ఈతడు మలేరియారోగనివారిణి యను క్వినామందును సృష్టించుటకు ప్రయత్నించాడు. "అయ్యవారిని చేయబోతే కోతి అయినది" అన్నట్లు క్వినా కాలేదు సరిగదా ఒక నల్లనిరంగు తయారైనది. అంతటితో నిరాశపొంది ఆ నల్లనిరంగును విసర్జించక దాని లక్షణాలను పరిశోధించగా అది చాలా విలువైన రంగుగా తేలింది. దానికి "మావ్" (Mauve) అను పేరిడుటయేకాక దానిని ఫ్యాక్టరీ ప్రమాణంలో ఉత్పత్తిచేయడానికి సాహసించి ప్రతిసృష్టివిధానంలో ప్రథమవిజయం పొందాడు. ఈ రంగు సహజంగా లభించే రంగులకంటె శ్రేష్ఠమైన దని నిరూపించి వాటికంటె చవుకగా లభ్యమయ్యే విధానాన్ని కనుగొన్నాడు. ఈవిజయంతో శాస్త్రలోకము పరవశమైపోయింది. నాటినుండి శాస్త్రంలో నూత్న ప్రతిసృష్టి విధానాలు లెక్కకుమీరినన్ని ఉద్భవిల్లినాయి.

రంగుపరిశ్రమాభివృద్ధి

పెర్కిన్ మహాశయుని విజయంవల్ల "సృష్టిలో లభించే వస్తువులనే అనుకరణచేయనవసరము లేదు, వాటిని పోలే వస్తువులను ప్రతిసృష్టి చేయగల"మను ధైర్యము రసాయనశాస్త్రజ్ఞులకు చిక్కినది. ఈధైర్యసాహసములవల్ల రంగుల పరిశ్రమయేకాక అన్ని పరిశ్రమలు అభివృద్ధిపొందినవి. రంగులలో ప్రకృతిలో లభించేవి చాలా తక్కువ. అంతేకాక వాటివలన ఏకొన్ని వర్ణములలో నూలు, సిల్కు, ఉన్ని వస్త్రాలకు వేయవచ్చును. ఈవర్ణములున్ను శ్రేష్ఠమైనవి కావు. చాకలి ఉతుకునకు, ఎండ, గాలి, వానలకు రంగులుపోయి వస్త్రము అందహీనముగా ఉంటుంది. ప్రకృతిలో లభించేవాటిలో శ్రేష్ఠతరమైనవి, శాశ్వతపు రంగుల నిచ్చేవి నీలిమందు, అలిజరీను మొదలైనవి ఏకొద్దో గలవు. కాని రసాయనశాస్త్రజ్ఞుల కృషివలన నేడు "ఏజో" రంగుల (Azo dyes) సహాయ్యంతో వస్త్రాలకు వేయజాలని వర్ణము లేదనిన అతిశయోక్తి కానేరదు. సృష్ట్యనుకరణవల్ల లభించే నీలిమందు అలిజరీనురంగులు, ప్రతిసృష్టిఫలితమైన రకరకాల ఏజోరంగులు ఒకదానికొకటి సహకారులై అభివృద్ధిపొందుచున్నవి. ఈవిధముగా నేటి అద్దకపు పరిశ్రమ రసాయనశాస్త్రజ్ఞునిపై ఆధారపడియున్నది. ఈయుద్ధపరిస్థితులవల్ల పైదేశాలనుండి రంగులు దిగుమతి కాకపోవడంవల్ల అద్దకపుపరిశ్రమ మన దేశంలో చాలా నష్టపోవుచున్నది. కనుక నేడు రంగుల పరిశ్రమ

స్థాపనావశ్యకత సువ్యక్తమగుచున్నది. అద్దకపు పరిశ్రమ అడుగంటకపూర్వమే మనము మేలుకొని రంగుల పరిశ్రమ స్థాపించాలి.

మందుమాకులలోకూడ మాన్యత

రంగుల పరిశ్రమతోబాటు మందులలోకూడా వర్ణనాతీతమైన అభివృద్ధి జరిగినది. వైద్యశాస్త్రం నేడు అపరిమితంగా విస్తరించి వైద్యునికి రోగనివారణాయుధాలను లెక్కకుమీరినన్ని ప్రసాదించినది. అనాదినుండీ వాడుకలోనుండిన వైద్యప్రక్రియల ననుసరించి, వాటిని పరిశోధించి ఆవైద్యప్రక్రియలలో ఉపయోగింపబడే మూలికలలోని ప్రత్యేకపదార్థాలను (Active Principles) విడదీయుటేకాకుండా వాటినే సృష్టించడానికి పూనుకుని విజయం పొందారు శాస్త్రవేత్తలు. కాని ఈవిజయం అన్ని మూలికల ప్రత్యేకపదార్థాలలోనూ లభించలేదు. ముఖ్యంగా పెర్కిన్ మహాశయునిలాంటి వైజ్ఞానికు లెందరో ప్రయత్నించి నప్పటికీ దుర్భేద్యమైన క్వైనాసమస్యయే రసాయనశాస్త్రంలో ఒక నూత్నశాఖను కల్పించినది. మూలిక యొక్క వైద్యప్రాముఖ్యతకు ఒక ప్రత్యేకపదార్థము కారణము. ఈప్రత్యేకపదార్థములోని ఏభాగము ఆపదార్థానికి వైద్యప్రాముఖ్యతను ప్రసాదించుతోంది అను ప్రశ్న ఈఅపజయాల ఫలితంగా స్ఫురించినది. ఈప్రత్యేకపదార్థం ఒక భవనాన్ని పోలిఉంటుంది అనుకుంటే, ఏవిధంగా ప్రతీభవనంలో ఒక్కొక్కగది, ఒక్కొక్కసావిడి వేర్వేరు కార్యములకై నిర్దేశింపబడియుంటవో, అట్లే ఈ రాసాయనికపదార్థంలోను ప్రతి ఒకభాగం ప్రత్యేకత కలిగిఉంటుంది. తరువాతి ప్రశ్నలు చాలా సహజమైనవి. మూలికలలో లభించే ప్రత్యేకపదార్థాలలో ఏభాగాలు వైద్యప్రాముఖ్యతకు కారణభూతములు? ఈభాగాలను మూలపదార్థంనుండి విడదీయజాలమా? లేక ఈభాగం కలిగిన ఇతరపదార్థాలను సృష్టించి వాటివైద్యప్రభావం పరిశీలించరాదా? ఈ ప్రశ్నలకు జవాబు రసాయనశాస్త్రంలో ఒక నూత్నశాఖగా పరిణమిల్లినది. దీనినే "కీమోథెరపీ" (Chemo-Therapy) అంటారు. ఉదాహరణకు క్వైనాను తీసుకోవచ్చును. క్వైనాలో ప్రథమార్థం, ద్వితీయార్థం అను రెండుభాగాలున్నాయి. ఇందులో ప్రథమార్థం మాత్రేరే మలేరియారోగనివారణలక్షణాలను క్వైనాకు ప్రసాదించిన దని శాస్త్రపరిశోధనవలన తేలినది. ప్రథమార్థం కలిగిన పదార్థాలను ఎన్నో రసాయనశాస్త్రజ్ఞులు సృష్టించారు. వాటి అన్నిటిలోను "ప్లాస్మోక్విన్" (plasmoquin), అటెబ్రిన్ (Atebrin) అను రెండు పదార్థాలుమాత్రం చాలా ముఖ్యమైనవి. ఇవి క్వైనాకంటె చాలా ప్రబలమైనవి. క్వైనావల్ల సంభవించే పైత్యవికారములు, చెవుడు ఈమందులవల్ల రావు. మలేరియాక్రిములను నిర్మూలించే విశిష్టతమాత్రం ఈ మందులలో ఉన్నది.

ప్రయోజనముపై ప్రయోజనము

ఈవిధంగా ప్రకృతిలో లభ్యమయ్యే పదార్థాలను పరిశోధించి, వాటి రూపలక్షణాదులను సాంతముగా అవగాహనచేసుకొని వాటిని పోలే పదార్థాలను సృష్టించడం ప్రతిసృష్టి. దీనివలన శాస్త్రజ్ఞానాభివృద్ధి అవడమేకాకుండా ప్రకృతిలభ్యమైన పదార్థాలలోని లోటుపాటులను సవరణచేసుకోవడానికి సావకాశము చిక్కినది. క్వైనావలెనే "కొకెయిన్"కూడా సాధింపబడినది. కొకెయిన్ "కోకా" చెట్టుఆకుల నుండి తయారుచేయబడు ఒకరకమైన మత్తుమందు, ముఖ్యంగా కంటిలోను, ముక్కులోను ఉండే మ్యూకస్ మెంబ్రేను (Mucous Membranes) లను ఈమందుసహాయంతో! మొద్దుపరచవచ్చును. అందుచే అక్కడ శస్త్రంచేసినా నొప్పి అనిపించదు. చిన్న చిన్న శస్త్రచికిత్సలకు సంపూర్ణంగా మత్తుమందు ఇవ్వకుండా ఏప్రాంతంలో శస్త్రం చేయాలో ఆ ప్రాంతంలో ఈ కొకెయిన్సహాయంవల్ల అచ్చటి నరాలను మొద్దుబారజేసి శస్త్రం చేయుచున్నారు. కాని క్వైనాలోవలెనే కొకెయినులోకూడా కొన్ని దుర్గుణాలున్నాయి. వీటివలన శస్త్రచికిత్సానంతరం రోగి బాధపడవలసివస్తుంది. కనుక కొకెయినువలె మత్తునిచ్చులక్షణాలు ఉండి, దుర్గుణరహితమైన పదార్థాల సృష్టికై తీవ్రపరిశోధన బయలుదేరినది. కొకెయిను మాలెక్యూలు (Molecule) లో మత్తునిచ్చే భాగాన్ని తెలుసుకొని, ఆభాగం కలిగిన పదార్థా

లను ఎన్నిటినో సృష్టించి వాటి మత్తుమందులక్షణాలు పరిశీలించారు. అల్లా సృష్టింపబడినవాటిలో అత్యుత్తమమైనది "నోవోకెయిన్" (Novocain) "పాంటోకెయిన్"లు (Pantocain). ఇవి కొకెయిన్‌కంటె కొన్ని లక్షణాలలోనే శ్రేష్ఠమైనవి. అందుచే నేటి శస్త్రవైద్యంలో ఈమాటికీ సమానస్థానం ఉన్నది.

నూత్న ప్రక్రియలు

ఈవిధంగా వైద్యశాస్త్రంలో ముఖ్యమైన మార్పులు గావించి, ప్రకృతిలో లభ్యమయ్యేవాటిని త్రోసిపుచ్చక వాటికి తోడై ప్రజాసౌఖ్యమున కీప్రతిసృష్టివిధానము ముఖ్యాధారమగుచున్నది. కాని ఈ ప్రతిసృష్టివిధానానికి నమూనా ప్రకృతిలభ్యమయ్యే పదార్థమే అక్కరలేదు. "కీమోథెరపీ" వైద్యశాస్త్రంలో ఎన్నో నూత్నప్రక్రియలను ప్రతిపాదించింది. రోజురోజూ ఈ నూత్నశాఖ అభివృద్ధిపొందుచు ప్రజాసేవ యొనర్చుచున్నది. ఈ నూత్నశాఖాస్థాపకుడైన "ఏర్‌లిక్" (Ehrlich) మహాశయుని పట్టుదల, కార్యదీక్ష వర్ణనాతీతమైనవి. సుఖవ్యాధులలో మహాభయంకరమైనది సిఫిలిస్ (సెగ). ఈ వ్యాధిక్రిముల నిర్మూలనము నకై పాషాణాదులు పురాతనవైద్యులు వాడుటయు, వాటివలన సంపూర్ణరోగవిముక్తి కాకపోవడమే కాకుండా రోగికే అపాయము అప్పుడప్పుడు సంభవించుటయు కలదు. ఈసమస్యపై ఏర్‌లిక్ అహోరాత్రములు కష్టించి ౬౦౫ రకముల మందులు తయారు చేయగల్గినాడు. వీటి అన్నింటిలోను ఏదోవిధమైన లోటుపాటు ఉండేదిది. ౬౦౬-వ పర్యాయము తయారుచేసిన మందు శ్రేష్ఠతరమైనది. అది సెగరోగక్రిములను మాత్రమే నిర్మూలించి, రోగికి అపాయము రానీయదు. అమందుకు "౬౦౬" అనే ఆమహాశయుడు నామకరణంచేశాడు.

రోగనివారణ రోగవ్యాప్తిని అరికట్టుటయందే కలదని గ్రహించి రోగవ్యాప్తికి మూలకారణమైన క్రిములపై దండయాత్ర ప్రథమముగా చేసినది రసాయనశాస్త్రజ్ఞుడు. క్షయ, టైఫాయిడ్, మసూచికము, మలేరియా, కలరా, ప్లేగు మొదలగు వ్యాధులను వ్యాపింపజేసే క్రిమిసమూహములను నశింపజేయుటకై రాసాయనిక క్రిమిహారులు (Disinfectants) సృష్టింపబడినవి అనేకవిధాలుగా ప్రయత్నంచేసినా ఇంకా రోగనివారణోపాయాలు పరిపక్వం కాలేదు. ప్రతివైద్యప్రక్రియలోనూ ఏదో లోటుపాటు ఉంటూవస్తోంది. ఒక నూత్న ప్రక్రియతో నూత్నసమస్యలు బయలుదేరుతున్నాయి. శాస్త్రజ్ఞులు వీటిని గ్రహించే తీవ్రపరిశోధనలు చేస్తున్నారు. శాస్త్రము అనంతము; అందులో నేటి విజ్ఞానసంపద ఒక సూక్ష్మకణము.

వైద్యశాస్త్రమందేకాక శాస్త్రజ్ఞుని మేధాశక్తి ఆహారపదార్థములందుకూడా అనేకమైన మార్పులను కలుగచేసింది. ప్రజారోగ్యం ఆహారపదార్థాలమీదనే ఆధారపడి యుండడంచేత శాస్త్రజ్ఞుని కౌతూహలం వాటిమీదకూడా ప్రసరించడం సహజం. ఇంతేకాక "కట్టబట్ట, తినతిండి" అన్నారు. నేడు ప్రపంచరాజకీయాలలో ఈసమస్య చాలా ప్రాముఖ్యత వహిస్తోంది. ఈసమస్యాపరిష్కారార్థమై రసాయనశాస్త్రజ్ఞుడు చేసినసేవ అమోఘమైనది.

మాయనేతులు

నీరు, పిండి, క్రొవ్వు, మాంసకృత్తులు, విటమినులు, లవణములు ఆహారపదార్థాలలో ముఖ్యంగా ఉంటాయి. వీటిలో క్రొవ్వుపదార్థాలు ఉదాహరణకు తీసుకోవచ్చును. కొబ్బరి, ఆవ, వేరుశెనగ, నువ్వుల నూనెలు, వెన్న, నెయ్యి సాధారణంగా వాడే క్రొవ్వు పదార్థాలు. వీటిలో వెన్న, నెయ్యి చాలా ఖరీదైనవి. ఇవి పలువురకు అందుబాటులో లేవు. నేటి యుద్ధపరిస్థితులలో వెన్ననేతులు అపురూపమైపోయాయి. భోజనార్థమై, వెన్ననేతులను పోలెడి మాయవెన్న చవుకధరలో లభించే కొబ్బరి, ఆవ, వేరుశెనగ, నువ్వులనూనెలనుండి తయారుచేసే విధానాన్ని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఈవిధానాన్ని అనుసరించి నూనెలు "నికెల్" (Nickel) అను లోహపు పొడి (Catalyst)సమక్షంలో ఉదజనితో కలిపి మాయవెన్న తయారగును. ఈవిధంగా తయారైనవే మనం బజారులో చూచే రకరకాలయిన మాయనేతులు. ఇవి అన్నీ భోజనార్హములే. వెన్నలో లభించే విటమినులనుకూడా ఈమాయనేతులలో కలుపుచున్నారు. మార్కెట్టులో

ఈమాయనేతులు ప్రత్యక్షం కావడంవల్ల వెన్ననేతిపరిశ్రమ అడుగంటలేదుసరికదా ఈ రెండుపరిశ్రమలు తోడునీడై బీదసాదల కందరకూ కావలసిన విటమినులతో కూడిన క్రొవ్వుపదార్థాలు లభించుచున్నవి.

కొత్తకొత్త యెరువులు

ఇంతేకాక ఆహారపదార్థాలను విరివిగా పండించుటకై వృక్షలోకాన్ని సమగ్రంగా పరిశీలించి రకరకాల ఎరువులను సృష్టించి వాటి ప్రయోగాలను బోధించినవాడు శాస్త్రజ్ఞుడు. దేశసంపద ప్రజల ఆరోగ్యం మీదను, ఆ ఆరోగ్యం ఆహారపదార్థాల మీదను, ఆహారపదార్థాల విశిష్టత సారవంతమైన భూమిమీదను ఆధారపడి ఉన్నాయి. అంటే దేశసౌభాగ్యంలో ఎరువుల ఆవశ్యకత గ్రహించవచ్చును. మన హిందూదేశానికి సాలీనా మూడుమిలియను టన్నుల ఎరువు కావలసిఉంటుందని అంచనా వేయబడింది. కాని గవర్నమెంటువారు స్థాపింపబోవు ఎరువులపరిశ్రమద్వారా ౩౦౦,౦౦౦ టన్నుల ఎరువులుమాత్రం కర్షకునికి సప్లైకాబోతుందిట. అంటే ఒక పదోవంతుమాత్రం సప్లై అవుతుంది. ఇప్పటికైనా ఎరువుల ప్రాముఖ్యత, ఆవశ్యకతలు సర్కారు వారు గ్రహించి ఒక పరిశ్రమ స్థాపింపబోవుట ప్రశంసనీయమే.

ప్రతీ విషయంలోకూడా శాస్త్రజ్ఞుని సమగ్ర పరిశోధనావిధానం సృష్టిరహస్యాలను తరచితరచి లోకానికి వెల్లడి చేయకమానలేదు. ఈ ఎరువుల విషయం ఉదాహరణకు తీసుకోవచ్చును. వృక్షజాలము జంతుజాలమువలెనే మానవునికి అత్యంతావశ్యకమైనది. తిన తిండి, కట్ట బట్ట, నిలుచుటకు నీడ నిచ్చేది వృక్షజాలమే. చిన్నమొక్క మొదలుకొని మహావృక్షంవరకును స్వాభివృద్ధికై భూమిలో లభించే నీరు లవణములమీదను, గాలి సూర్యరశ్మిల మీదను ఆధారపడియున్నవి. భూమి సారవంతమైనచో సస్యవృక్షాదులకు కావలసిన నీరు లవణములు విరివిగా లభించుతవి. పత్రభూమియైనచో ఇవి కొరతపడి వృక్షాదులు పెరుగజాలవు. ఇంతేకాక సారవంతమైన భూమియైనను ప్రతిసంవత్సరము పెరిగే సస్యము భూమిని నిస్సారముచేయునుకనుక అప్పుడప్పుడు ఎరువులు వేసి కర్షకుడు సస్యానికి అందజేస్తూఉంటాడు. భూమిని, వృక్షజాలములో దినదినం కలిగే మార్పులు బాగుగా పరిశీలించి ఈ ఎరువుల ప్రాముఖ్యతను నిరూపించుటయేకాక కర్షకునికి ఎన్నో ఎరువులను అందుబాటులోనికి తెచ్చాడు శాస్త్రజ్ఞుడు. సూపరుఫాస్ఫేట్లు, అమ్మోనియా, పొటాసియముఫాస్ఫేట్లు మొదలైన నూతన ఎరువులు చాలా ముఖ్యమైనవి. వీటివలన భూమిలో ఏ లోటు ఉన్నా సరిచేసుకోవచ్చును. పత్రభూములను సారవంతమైన భూములుగా చేయవచ్చును. ఈనూతన ఎరువులవల్ల అనాదినుండి వాడుకలోఉన్న ఎరువుల ఆధిక్యత ఏమీ తగ్గలేదు. వాస్తవానికి పశువుల దొడ్డిపెంట, వేరుశెనగపిండి, ఆముదపుపిండి మొదలైన ఎరువులు ఈనూతనఎరువులకంటే కొన్ని విషయాలలో చాలా శ్రేష్ఠమైనవి.

మాయసిల్కు

“తినతిండి, కట్టబట్ట” అన్నారు. ఆహారపదార్థాలలో శాస్త్రజ్ఞుని కృషి ఎంత శ్లాఘనీయమో అంతకంటె “కట్టబట్ట” సమస్యలో మించినదని చెప్పవచ్చును. సహజంగా లభించే ఉన్ని, సిల్కులను పోలే రాసాయనికరూపాలు చవుకధరలో నేడు విరివిగా తయారై అబాలగోపాలానికి శృంగారరసపోషణకు వీలుఏర్పడింది అంటే అతిశయోక్తికాదు. పట్టును పోలే మాయసిల్కు (Artificial Silk) ను చూస్తే పట్టుపురుగుసైతం ఆశ్చర్యపడకమానదు. ఈమాయ సిల్కు విధానాన్ని కనుగొన్న “షార్డోనే” (Chardonnet) మహాశయుని ప్రతిభ వర్ణనాతీతము. పట్టుపురుగు జీవితరహస్యాన్ని గ్రహించి ఈ విధానాన్ని కనుగొన్నాడీమహాశయుడు. అంతేకాక, ఈమాయసిల్కును పేపరుపల్పు (Paper pulp) నుండి చేస్తారంటే మరింత ఆశ్చర్యం కలుగవచ్చును. సహజమైన సిల్కు, మాయ సిల్కులకు ఉత్పత్తిలో సహస్రాంతర భేద మున్నా నిగనిగలోను, మన్నికలోను, రంగుల అద్దకంలోను మాయసిల్కే చాలా శ్రేష్ఠమైనది. అందుచేత ఈ మాయసిల్కు ఉత్పత్తి నానాటికి విపరీతంగా అభివృద్ధి పొందు

తోంది. మనదేశంలో మినహా ప్రతీదేశంలోను గొప్ప గొప్ప మాయసిల్కు ఫ్యాక్టరీలు స్థాపింపబడ్డాయి. మనంమాత్రం విదేశాలనుండి ఈ మాయసిల్కును దిగుతి చేసుకుంటున్నాం.

నకిలీరబ్బరు, లక్కలు

మాయసిల్కు పరిశ్రమనుండి "ప్లాస్టిక్కుల పరిశ్రమలు" ఉద్భవించినవి. ఈప్లాస్టిక్కులు (**Plastics**) నేడు పరిశ్రమలలో ముఖ్యస్థానమును ఆక్రమించాయి. సెల్యులాయిడుకూడా ఒకరకమైన ప్లాస్టిక్కే. దీనితో ఇంచుమించు చేయజాలని వస్తువు లేదు. సెల్యులాయిడ్‌లాంటిదే బేకలాయిటు (**Bakelite**) కూడాను. వీటినిపోలేవి ఇంకా రకరకాల ప్లాస్టిక్కులు రసాయన శాస్త్రజ్ఞులు సృష్టించారు. ప్రకృతిలోకూడా ఇటువంటి ప్లాస్టిక్కులు చాలా ఉన్నయి. వాటిలో రబ్బరు, లక్క ముఖ్యమైనవి. యుద్ధచక్రం సాఫీగా నడవడానికి మూలాధారమైన దీ రబ్బరు. కాని రబ్బరు తోటల నిలయమైన "మలయా" "డచ్చి యీస్టు ఇండీసు" జపానువారి వశం కావడంతో మిత్రసేనలకు రబ్బరు కాటకం సంభవించింది. కాని రసాయన శాస్త్రజ్ఞుని కృషివల్ల ఈ రబ్బరుకూడా లేబొరేటరీలలోను, ఫ్యాక్టరీలలోను నేడు తయారవుతోంది. ఈ విధంగా తయారయ్యే రబ్బరు ప్రకృతిలో లభించే రబ్బరును పోలి ఉంటుంది. ఈవిధానం ఇంకా ప్రసిద్ధికెక్కలేదు; బాల్యావస్థలోనే ఉన్నది. ముందు ముందు చాలా ప్రాముఖ్యతలోనికి రాగలందులకు అవకాశా లున్నాయి. సహజంగా దొరికే "లక్క" కు పుట్టినిల్లు మన హిందూదేశం. ఈలక్కపరిశ్రమ అభివృద్ధి పొంది హిందూదేశపు ప్రజకు కొద్దో గొప్పో ఆర్థికంగా లాభం చేకూర్చకపూర్వమే "ప్లాస్టిక్కులు" ఇతరదేశాలలో విరివిగా తయారై మన దేశంలోకి దిగుమతి అవుతున్నాయి. ఈ లక్కపరిశ్రమకుకూడా నీలిమందు పరిశ్రమ (**Indigo Industry**) కు పట్టిన గతి పట్టకుండా కాపాడాలి.

తండ్రినిమించిన పుత్రుడు

ఈవిధంగా శాస్త్రజ్ఞుని వైజ్ఞానిక కుశలత మన దైనందిన జీవితరంగాలలో కనిపిస్తోంది. ఆహారము, వైద్య ప్రక్రియలు, దుస్తులు, ఫ్యాన్సీ సామాన్లు,రంగులు ఇంకా ఎన్నిటినో ప్రకృతికి మించిన విధంగా తయారు చేయగలుగుతున్నాము. ఈ విజయానికి ముఖ్యకారణము ప్రకృతిరహస్యాలను తెలుసుకోవలె ననెడి శాస్త్రజ్ఞుని కుతూహలమే. ప్రకృతిని పరిశోధించి, ప్రకృతిఅనుకరణయే కాక ప్రకృతికి ప్రతిసృష్టి చేసి మెప్పు పొందినవాడు శాస్త్రజ్ఞుడు. తండ్రి నడతచేతలను బాల్యంలో అనుకరించి తుదకు తండ్రిని మించిన పుత్రు డెట్లో, అట్లే శాస్త్రజ్ఞుడు కూడా ప్రకృతిని కొన్ని విషయాలలో అనుకరించి, చివరకు ప్రతిసృష్టికూడా చేయగల సామర్థ్యమును సంపాదించినాడు. అయినా ప్రకృతి అనంతము. ప్రకృతి రహస్యాలలో అణుమాత్రంకూడా శాస్త్రజ్ఞులు సంపూర్ణంగా అర్థంచేసుకోలేదు. నేటి శాస్త్రాభివృద్ధికూడా అణుమాత్రమే. ముందుముందు నూతన పరిశోధనలకు అవకాశం తక్కువ అనుకోవడం పొరపాటు. నేటి విజ్ఞానావస్థ యౌవనావస్థలాంటిది. ఈ యౌవనావస్థ గడచి వార్థక్యం వచ్చేసరికి కొన్ని వేల సంవత్సరాలు గడుస్తాయి.



మహాత్ముఁడు

— శ్రీ జి. జోసఫుకవి —

ఆఁకలిదప్పులం దాళ లేశములేక ప్రాణంబునరికట్టు పరమయోగి
కష్టసుఖముసాత్త్వికపుతులఁదూఁచి యౌదార్యశాసించెడి ధార్మికుండు
శాంతియుద్ధంబుతో జగమునువణకించు పరువంపుగుండెనిబ్బరపుకాఁడు
పరులకష్టాలకు బాష్పాలువర్షించు నుజ్జిలేనట్టి పరోపకారి
ధర సమాధాన వేదవిద్యారహస్య - శాంతిమంత్రాక్షతలు వెదజల్లి, దేశ
దేశములతోడ ఢీకొన్న ధీవరుండు - అతులవిజ్ఞాని గాంధిమహాత్ముఁ డెలమి.

చిల్లిగవ్వయులేక సిడమెత్తి దిక్కుల రక్షింపదొరకొన్న భిక్షుగాఁడు
నెట్టనయిష్టమే చట్టంబొనర్చి పాలించు కిరీటంబులేని రాజు
జోగొత్తుకొని కీర్తిశుద్ధాంతముల శయనింపఁగా మఱఁగిన నిత్యభోగి
కడుపార ఏపూట గంజిలేకయె నిత్యసంతర్పణముసేయు సదమలుండు
భరతఖండంపు తులలేని ప్రాభవంబు - హస్తపుంగుమ్మెటలపై ప్రశస్తచిత్త
శాంతమునఁబాడుకొను వృద్ధ జంగమయ్య - ఘనసముజ్జ్వలవీరుండు గాంధివరుఁడు.

కొనప్రాణములతోడ కుమిలికూలారిన పగ్గదీర్పను బొందినొగ్గినాఁడు
జడిమంచుగాడ్పులు సల్లాపమాడిన శ్రమకు నమస్కృతుల్ సలిపినాఁడు
రక్తనాళంబుల రాణింపుదగ్గిన జ్ఞానంబు వర్షింపఁజాలినాఁడు
అహరహంబులు తిండి కల్లాడి మాడిన స్వాతంత్ర్యమునకు నై వగచినాఁడు
భరతమాతకు జయగీతిఁ బాడినాఁడు - కుల్లకుచ్చితమే లేని కొలువు సేయు
త్యాగ మర్పించుకొన్న వదాన్యరాశి - దీర్ఘశాంతుఁడు మన గాంధి దివ్యమూర్తి.

గాంధీజీ విశ్వరూపసందర్శనం

★

= శ్రీ యం. చలపతిరావు =

వట్టి విశ్వాసబలంతో ఆయన ప్రదర్శించిన పరమాద్భుత లీలలను, సాధించిన ఘన కార్యాలను ఈ చర్మ చక్షువులతో ప్రత్యక్షంగా చూడగలిగిన మనము గాంధీజీమహిమలకు దోసిళ్ళొగ్గుటగాని, జోతలు పెట్టుటగాని, జయగీతికలు పాడుటగాని బహు సులభము. అందులోను ఇటువంటి జయంతి ఉత్సవాలలో- ఇటువంటి పర్వదినాలలో ఆపని చేయుట మరీ సులభము. ఆయనను విమర్శించుట అంతకంటె మహా సులభము. ప్రపంచ జ్ఞానజ్యోతిః ప్రసారానికిని, ప్రపంచపురోగమనానికిని ఆయన చేసిన శాశ్వత సేవ యొక్క స్వరూప స్వభావాలకు విలువ కట్టడమే మిక్కిలి కష్టమయిన పని. ఉన్నచిక్కల్లా అక్కడే.




గాంధీమహాత్ముడు-మాతృశ్రీ కస్తూరిబాయి

సార్వకాలిక యుగపురుషు డైనట్టి ఈయనను గురించిన సారస్వతం చాలా కొద్దిగానే ఉన్నట్లు కనబడుతున్నది. ఏ ఇతర చరిత్రలోను కానరాని కమ్మని జీవితగాథ ఆయనఆత్మచరిత్రలో మాత్రమే కన్పిస్తున్నది. ఆయన జీవిత విశేషాలకును, ఆయనకార్యకలాపాలకును నిష్కృష్ట మయిన వ్యాఖ్యానాలు ఆయన స్వీయ రచనలే. కాని, ఆయనను గురించి దినదినవర్ధమానమైన యథార్థ సారస్వతం అసలు బొత్తిగా లేకపోలేదు.


మూలమూలలా వెతికి సూక్ష్మంగా పరిశీలిస్తే ఇప్పుడున్న 'గాంధీ సారస్వతంలో మిక్కిలి మంచివిగా పరిగణింపదగిన పుస్తకాలు సుమారు ఒక వందకు లెక్క తేలుతాయి. ఇంచుమించు పాతిక సంవత్సరాల క్రిందటనే గాంధీజీని ప్రపంచమందలి మానవులలోకెల్లా మహామహనీయుడైన వ్యక్తిగా ప్రప్రథమం లోకానికి చాటిన వ్యక్తి ఒక న్యూయార్కు వాస్తవ్యుడు. ఆయనపేరు డాక్టర్ జాన్ హెయినిస్ హోమ్సు. ఆయన సేకరించి పెట్టుకొన్న గాంధీ సారస్వతంలో దాదాపు రెండువందల పుస్తకాల వరకూ ఉన్నాయట. ఈ సంఖ్యకు ఇంకా కొన్ని చేర్చవచ్చు. తన జీవితకాలంలోనే తన్ను గురించి ఇన్ని పుస్తకాలు వెలువడు భాగ్యానికి నోచుకొన్న మహాపురుషుడు గాంధీజీ తప్ప ఇంకొకడు ప్రపంచ చరిత్రలోనే కానరాకున్నాడు. దివ్యాంశ సంభూతు డైన క్రీస్తు ప్రభువునుగూర్చికూడ ఇన్ని గ్రంథాలు లేవు; బుద్ధభగవానుని గురించికూడ ఇన్ని పుస్తకాలు లేవు; కైజరును గురించీ లేవు; నెపోలియన్ చక్రవర్తిని గురించీ లేవు; షేక్స్పియరు మహాకవిని గురించికూడా లేవు.

గాంధీజీకి ౭౫-వ జన్మదినోత్సవపు కానుకగా సమర్పించిన ఒక స్మారక సంపుటిని ప్రచురించు పుణ్యానికి పాత్రులయినవారిలో ఒకణ్ణయిన నాకు ఆ సందర్భంలో అనేక మహాద్భుత విషయాలు కొత్త కొత్తగా దృగ్గోచరమయ్యాయి. మహాత్మధర్మానికి సహజసిద్ధాలయిన మంచు తెరలనుంచి శుద్ధంగా బయటపడి, క్రమేణా మానవమాత్రుడుగా మారిపోయి మానవత్వాన్ని మహాగొప్పగా ఒలకబోస్తున్న గాంధీజీని చూడగలగడం అందులో ముఖ్యమయినది. యావక్లోకానికి ఆయన ఈ పాటికే ఒక మహాత్ముడయిపోయినాడు. కొందరు మహోన్నత స్థానంలో కూర్చోబెట్టినారు; మరికొందరు అక్కడనుంచి దింపను దింపివేసినారు. ఆయన యోగిపుంగవత్వాన్ని, కుటీర పరిశ్రమల పునరుద్ధరణపట్ల ఆయన తహతహను, మద్యపాన నిషేధ విషయంలో ఆయనఆత్రాన్ని, అస్పృశ్యతానివారణకై ఆయనఆరాటాన్నీ మన మిదివరకే బాగా ఎరుగుదుము. మన రాజకీయజీవితంలో ఆయన తెచ్చిపెట్టిన విప్లవాన్ని, గాంధీ టోపీ చర్ఖాలతో సంకేతిత మైన మహాద్భుత పునర్వికాసాన్నీ కూడ మన మెరుగుదుము. ఆయన జీవితం రకరకాల వ్యాసంగాలకు ఆలవాల మయినది. ఆయన ఇందు గల డందు లేడని లేదు. ఆ చక్రి సర్వోపగతుడు. ఎందెందు వెదకి చూచిన అందందే కలడు. బహువ్యాపృతుడు. ఆయన ౭౦-వ జన్మదినోత్సవ సందర్భంలో శ్రీ శ్రీనివాసశాస్త్రిగారు చెప్పినట్లు ఆయన సాధించిన ఘనకార్యాలు అనంత మైనవి. ఎవరు ఎంత చాకచక్యంతో చెప్పదలచుకొన్నా ఆయనజీవితంలోని ఏ ఏకదేశ విషయాన్నో మాత్రమే నొక్కి చెప్పగలిగితే అక్కడికి బ్రహ్మాండం. అంతతోనే వారు 'కృతార్థోస్మి' యని తమమట్టుకు తాము తృప్తిపడినా పడియుండవచ్చు. కాని, ఆ మహాసముద్రంలోకి-ఆయన అగాధ జీవితంలోకి, ఆయన అనంత కార్య కలాపాలలోనికి లోతుగా దిగిపోయి సవిస్తరంగా చూస్తే ఇదంతా ఏమూలకు అనిపిస్తుంది. ఆ అగాధ మహాసముద్రాన్ని అడుగంట తరచిచూడవలెనంటే అందుకు ఏండ్లు పూండ్లు కావాలి. ఒకవేళ జీవితకాలమంతా పట్టినా పట్టవచ్చు. అటువంటి ఉత్తమశ్లోకుని జీవితోద్యమాన్ని కొండాడవలెనంటే ఆయనను గురించిన ప్రశంసాపత్రాల నన్నిటిని సేకరించి పుస్తకంగా ప్రకటించడం అంత మంచి పద్ధతిగా కనబడదు. అంతకంటె ఆయన తన జీవితంలోని ప్రతిఘట్టమందూ చేసిన పనిని కొండాడడమే చాలా మంచిదేమో? ఆయన జీవితంలోని కేంద్రోద్దేశ్యమూ, క్రీస్తు బుద్ధభగవానుల కేంద్రోద్దేశ్యాలూ ఒక్కటే అయినప్పటికీ ఆయనను క్రీస్తు బుద్ధులతో పోల్చడమే చాలనప్పుడు ఆయనను ఊరికే మాజినీ చెంతనో, టాల్‌స్టాయి ప్రక్కనో, సెయింట్ ఫ్రాన్సిసు దాపులనో, రూసో సన్నిధానంలోనో, సెయింట్ ఆగస్టయిను సన్నిధినో నిలబెట్టడం వివేక మగునా? గాంధీజీ జీవితం అంతకంటె చాలా పరిపూర్ణమైనది; విశ్వరూపి యయినది. కళా, మానవత్వ, విజ్ఞానశాస్త్రవీథిలో ఆయన జీవితం లియొనార్డోడి విన్సీ జీవితంవలెనే సర్వతో ముఖత్వాన్ని వెల్లడిస్తున్నది. చిత్రవిచిత్రమైన పోకళ్ళు గలిగిన చిత్తవృత్తుల్లో భారతీయులలోకెల్లా ఒక్క రవీంద్రనాథ టాగూరే కొద్దిలో కొద్ది ఆయనకు తోడుపో గలిగినవాడు కనిపిస్తున్నాడు. ఆ టాగూరు కూడ మొత్తంమీద చూస్తే ఒక్క కళావేత్తలోని సంపూర్ణత్వాన్ని మాత్రమే కనబరుస్తున్నాడు. గాంధీజీయో? మానవునిలోని సంపూర్ణత్వాన్ని—కళావేత్త యయిన మానవుణ్ణి, సత్యాన్వేషకుడయిన మానవుణ్ణి, విప్లవకారు డయిన మానవుణ్ణి, రాజకీయ వేత్త యైన మానవుణ్ణి, విజ్ఞానశాస్త్రియైన మానవుణ్ణి, వాడేమిటి వీడేమిటి ఒక పరిపూర్ణ పురుషుణ్ణి—అనితరలభ్య మయిన సంపూర్ణత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఆయన శుద్ధపూర్ణ పురుషుడు.

గాంధీజీఆలోచనలు స జీవములైనవి; వర్ధమానములైనవి. వాటిని గాంధీతత్వంతో మిళితంచేసి తికమక పరచరాదు. తనలోఉన్న అసందర్భాలను, సందర్భశుద్ధిలేని ఘట్టాలను మాయా మర్మం లేకుండా ఆయన విస్పష్టంగా నోరారా వెల్లడించియుండడం ఒక్కటి చాలదూ. ఆయనసత్యాన్వేషణబుద్ధిని రూపించడానికి. 'గాంధీయమార్గము' అనే ఒక ఉత్తమగ్రంథంలో ఆచార్య కృపాలినీగారు వివరించినట్లు ఈ 'త్వా'లూ, ఈ




బారిస్టరు గాంధీ



దక్షిణాఫ్రికా సత్యాగ్రహి గాంధీ

'తత్త్వాలు' కేవలమూ మధ్యమాధములకు చెల్లినట్టివి. అయినా, గాంధీతత్త్వంవంటి తత్త్వం మరొక్కటిలేదు. దానికి సాటిలేదు. ఇతరతత్త్వాలకూ, దానికీ పోలికే పెట్టరాదు. ఒక విశ్వాసాన్ని నెలకొల్పవలెనని కాని, ఒక సిద్ధాంతాన్ని ప్రతిష్ఠాపనచేయవలెనని కాని, ఒక మతప్రవర్తన చేయవలెనని కాని గాంధీజీ ఆఘోరించడం లేదు. ఆయన నెలకొల్పినడిపిన వివిధ ఆశ్రమాలూ ఆవాసాలనూ, ఆయన ఎత్తిపారవేసిన వివిధ ఆశ్రమాలూ ఆవాసాలనూగనక సూక్ష్మంగా పరిశీలించ



గావంచాగాంధీ

గలిగితే, అదే చాలు జీవితంలో ఆయనకుగల సుస్థిర విశ్వాసాన్ని చూపడానికి. దాని ఛాయలనుంచి ఆయన తప్పించుకొని పారిపోనేపోడు. ఆశ్రమజీవితం మధ్యలో పడ్డప్పుడు ఆయన అనంత జీవనసమస్యల్లో ప్రతిదొక్క అల్పస్వల్పాంశాన్నికూడా బహుశ్రద్ధగా పరికించి చాలా జాగ్రత్తగా గమనిస్తాడు. కాని, ఆయన కర్మకాండకంతా మూలభూమికలైనట్టి ఈ జీవిత ఘట్టాన్ని గురించి విశేషపరిశీలనచేసి వివరాలుబోధించిన వారు లేకపోవడం చాలా ఆశ్చర్యంగావున్నది. మహదేవదేశాయి సబర్మతీ, సేవాగ్రాం ఆశ్రమాలనుగురించి అప్పుడప్పుడు చేస్తూవచ్చిన చిట్టిచిట్టి చిత్రణలు తప్ప గాంధీజీ ఆశ్రమజీవిత విశేషాలను సవిస్తరంగా తెలిపినవారే లేరు.

ఆయన సమగ్రజీవితాన్ని అధ్యాయాలు అధ్యాయాలుగా పూర్తిగా చూపించదలచుకొన్న గాంధీజీ సంపుటి సంపాదకులకు ఆదిలోనే ఒక పెద్దచిక్కు ఏర్పడ్డది. బ్రహ్మాండమయిన ఆయనజీవితంలో పరిశీలించి పరికింపదగింది బ్రహ్మాండమంత ఉండగా దానిని లోతుగా తరచినవారు మాత్రం అట్టే మంది కనబడలేదు. ఎంత వెతికిచూచినా పరినిష్ఠితులు బహు పరిమితంగానే కనిపించారు. ఆయనజీవితంలో ఎన్నో అధ్యాయాలు అధ్యాయాల కధ్యాయాలే విస్మృతిగర్భంలో పడిపోయినట్టు కనిపించింది. దక్షిణాఫ్రికాఘట్టం ఒక్కటే ఒక బ్రహ్మాండపురాణం. ఆరోజుల్లో అక్కడ ఆయనతో కలిసి పనిచేసి కాలక్షేపం చేసినవారెవరయినా వుండి, వారినిగనక మెల్లగా మంచిచేసుకొని వివరాలు కనుక్కుంటే తెలుస్తుంది ఆ ఇక్ష్వాకులరోజుల్లో, ఆ దేశంకానిదేశంలో, ఆ మారుమూలప్రదేశంలో ఆయన ఇప్పుడు ఇక్కడ ఉన్నంతకంటె మహాగొప్పవాడుగా ఉండినాడన్న నిజస్థితి. అక్కడ ఆయన ప్రజల్లో ఒక ప్రజగా కలిసిమెలిసి తిరుగుతూవచ్చినాడు. సామాన్యుల్లో సామాన్యుడుగా, విశిష్టుల్లో విశిష్టుడుగా మెలగినాడు. సామాన్యుల్లో సామాన్యుడుగా తిరిగినంతమాత్రాన ఆయనకు వచ్చిన లోటేమీ కనబడలేదు. అక్కడ ఆయన తీరాలకు పోలేదు; బింకాలకు పోలేదు. ఫినిక్సు కార్మికావాసంలోనూ, టాల్‌స్టాయి శాలలోనూ ఉండిన బాలబాలికలతో ముచ్చట్లాడేటందుకుకూడా ఆయన పరమప్రీతితో తీరుబాటు కల్పించుకొంటూవుండినాడు. అప్పుడింకా ఆయన జీవితంలోని ప్రథమసమస్యలతో కుస్తీపట్లు పట్టే రోజులు. అందువల్ల ప్రజాసామాన్యానికి అతిసన్నిహితుడుగా వుంటూవచ్చినాడు. అక్కడ ఆయన చూపెట్టిన రూపాలు ఒకటి కాదు రెండు కాదు. అది ఒక విశ్వరూపప్రదర్శనం. బారిష్టరుబల్ల కట్టుకొని కోర్టుల్లో వకీల్గిరి చలాయించినాడు. చెట్టునీడల్లో,

చూడనీడల్లో కూర్చొని చెప్పులుకుట్టే మాదిగపని చేసినాడు. వంటలక్కల, వంటలన్నల పనిచేసి నలభీమ పాక ప్రావీణ్యాన్ని చూపెట్టినాడు. సత్యాగ్రహసేనానియై సంగరరంగంలో సేనలు నడిపినాడు. బడిపంతుల ఉద్యోగంచేసి కర్రపెత్తనంకూడా కనబరిచాడు. ఇటువంటి అద్భుతోత్తరమయినజీవితం అక్కడ గడిపాడుకదా, ఆచక్కటి ఘట్టాన్ని స్థూలంగానైనాసరే వర్ణించి చూపెట్టినవారు, గాంధీజీని తప్పనిచ్చి, వేరేయేరీ? ఇందుకుకూడా ఆయనే చేయిచేసుకోవలసివచ్చింది. ఇంగ్లీషుభాష తెచ్చిపెట్టిన పిలేలాటకం ఇది. ఈఘట్టాన్ని వ్రాస్తే అక్కడ గాంధీజీతో కలిసి మెలిసి తిరిగిన ఆనాటి వృద్ధులే వ్రాయాలి. వారికా,



రాట్నంమీద నూలు వడుకుతున్న గాంధీ

ఇండియన్ ఒపీనియన్' పత్రిక పాతసంపుటాలు, తిరగవేసేపాటి భాషాపాండిత్యంగాని, ఇంగ్లీషులో వ్రాతకోతలు నడపగలిగిన ఆంగ్లవిద్యాపరిజ్ఞానంగాని చాలినంత లేదాయె. ఇంక వారు వ్రాసేదేమిటి, మనము నేర్చుకొనేదేమిటి?

దేవుని ధర్మమా అంటూ, మనం చేసుకొన్న పుణ్యపరిపాకంవల్ల ఇతరరంగాలనుంచి తగినంత వెలుతురు వచ్చింది, అదే పదివేలు! ఆహా! ఆవెలుతురులో గాంధీజీ జీవితమందు నిక్షిప్తమయి, ఇంతవరకూ మనకంతగా తెలియరాని ఎన్నెన్నివిషయాలు తెలియవచ్చిన వంటారు? ఓహ్! కోకొల్లలు. సంస్కృతి విషయంలో గాంధీజీ పడిన పాట్లుగాని, దానికై ఆయన చేసిన యథాశక్తి సేవకాని ఇంతవరకూ సవివరంగా ఎరిగిన మహానుభావులుగాని, ఎరుగజెప్పిన మహనీయులుగాని ఎందరున్నారండీ? ఒకానొక సహచరుని ధర్మమా అని గాంధీజీకి సౌందర్యమూ సౌందర్యమూర్తుల మీదా, సాహిత్యమూ సాహిత్య తత్వంమీదా, వాస్తుశిల్పమూ వాస్తుశిల్పకళమీదా, చిత్రములూ చిత్రకళమీదా గల మహోన్నత అభిప్రాయాలు వెలుగుకువచ్చాయి. ఖాదీబట్టల ముతకదనములో మెత్తదనం చూడగలిగి, చూపనేర్చిన ఘనుడు గాంధీజీ కాక ఇంకొక రెవరున్నారండీ? అన్నన్ని వ్యాసంగాల్లో పడి తిరుగుతూ కూడా 'పందులో సమారాధన'గా ఎప్పుడో పిలుచూచుకొని వెళ్లి రోము లోని కళాభాండారాలను కన్నులకరవు దీరా చూచి, వాటిగొప్పదనానికి వహ్వా అని తలయూపి, ఇంత

కంటె ఎక్కువగా కళారాధనకు కాలం చెల్లించలేక పోతినే అని వాపోతూ ఆశ్రమవాసులకు ఒక ఉత్తరం వ్రాసి తన విచారాన్ని వెళ్లబుచ్చగలిగిన కళాభిమాని గాంధీజీ కాక మరెవరు ఉండగలరండీ? లక్ష్మణఝూలావద్ద కొత్తగా కట్టిఉన్న ఉక్కువంతెనను చూచి ఉస్సురు మంటూ, తాతలనాటి ఆ సహజసుందరమైన తాటివంతెన స్థానంలో ఈ దరిద్రపువంతెన ఎందుకు వచ్చిపడ్డదిరా భగవంతుడా అని కుమిలిపో




దండీదండయాత్రనాటి చేతికర్ర గాంధీ



లేఖారచయిత గాంధీ

గలిగిన గుణాగుణవేత్త గాంధీజీ తప్ప మరియొకరు ఎవరు ఉండగలరండీ? ఎవరు ఒప్పుకొంటే నాకేమి ఎవరు ఒప్పుకోకపోతే నాకేమి లెమ్మని ఆయన తన నిఘంటువులో సంస్కృతి శబ్దంక్రింద శుచీశుభ్రతలను కూడా చేర్చివేశాడు. ఆయనభావవాదృష్టి ఎంత విశాలమయిందో ఇందువల్ల గ్రహింపవచ్చు. గాంధీజీలోని ఈకళాశీలిత్వాన్ని మాకు తెలియజెప్పినవారు మరెవరో ఇంకెవరో కారు. ఆయన సాక్షాత్తు కళాప్రపంచానికి సార్వభౌముడయిన నందలాలుబోసే.

మా సంపాదకత్వంలో మాకింకా ఎన్నో ఆశ్చర్యాలు ఎదురైనవి. డాక్టరు సుశీలానాయరు వ్యాసం ఒకటి వచ్చింది. ఆయనకు తాను పరిచర్య చేసిన అనుభవాలూ, రోగిగా ఆయన ప్రవర్తించిన ప్రవర్తనలూ అందులో వ్రాసివుంటుందని మేము మామూలుగా అనుకొంటిమి. కాని, తీరా చదివి చూస్తే, మాకత్యాశ్చర్యమయింది. అనుకొన్నదానికీ, మాకుకనబడినదానికీసంబంధమే లేదు. ప్రజాసామాన్యానికిపనికిరాగల వైద్యాన్ని గురించిగాంధీజీప్రక్రియలూ, ఆయుర్వేద యూనానీవైద్య పద్ధతులనుగురించి ఆయన అభిప్రాయాలూ, ఇంగ్లీషువైద్యమూ దాని మూలికా



మహాత్ముడు - మాన్యశ్రీ మహాదేవదేశాయి

తంత్రమూ అంటే ఆయనకున్న జుగుప్సా, ప్రకృతి చికిత్సలో ఆయన సొంతపాకక్రమమూ - ఇదీ మా కా వ్యాసంలో కనిపించిన విషయాలు. గాంధీజీ అంటే ఏదో మామూలుగా మంటిపట్టీ చికిత్సలూ, మృత్తికా స్నానాలూ సాధన చేసుకొంటూ, ఆహార విహారాల్లో నీతినియమాలుపాటించే ఒకచిట్కావైద్యుడన్న సంగతి యెరుగుదుముకాని ఇన్నివైద్యాల్లో ఇంత అమోఘపాండిత్యం గలవాడని యేనా డెరుగుదుమండీ! ఈసంగతి ఇంతతో పోనీండి.

ఆయన ఒక పెద్ద కార్మికనాయకుడంటే నమ్మేవా రెంతమందో, నమ్మనివా రెంతమందో! ఎవరు నమ్మినా, ఎవరు నమ్మకపోయినా ఆయన అహమ్మదాబాదు కార్మికులకు చేసిన ఘనసేవమాత్రం ప్రస్తుతింపదగియున్నది. ఆయన తన మధ్యస్థానికివచ్చిన ఎన్నో కార్మికగాదాల్లో ఉభయపక్షాలకూ నొప్పికలగకుండా అతిచాకచక్యంతో వారికి పరిష్కారం కుదిర్చిపెట్టుతూవుండేవాడు.

సత్యశోధన సందర్భంలో గాంధీజీ చేపట్టుతూ వస్తూన్న సాధనాలూ, ప్రయోగాలూ కేవలం సాంకేతికాలే కావు. అందులో ఎన్నో ప్రయోగాలు ప్రాణాలకు తెగించి చేపట్టినవి. ఆహారవిషయంలోనూ, ఆరోగ్యవిషయంలోనూ, మందుమాకుల విషయంలోనూ ఆయన చెప్పిన ప్రతి ముక్కా స్వానుభవం మీద నిగ్గుతేల్చి చెప్పిందే. అనుభవదూరమయిన మాట ఒక్కటీ ఆయన ఆడి యెరుగడు.

ఇలా మాకెదురయిన ఆశ్చర్యాలను ఒకొక్కటిగా చెప్పకొంటూపోతే ఆ పాతర మెంతకూ తరగదు. ఒకటివెంట ఒకటి శరపరంపరగా వచ్చి పడుతూ వుంటాయి. లేఖారచయితగా ఆయనకున్న ప్రజ్ఞావిశేషాలు ప్రత్యేక పరిశీలనకు అర్హమైయున్నవి. జాతీయపతాకయొక్క అంతరార్థాన్ని నిర్వచిస్తూ ఆయన చేసిన ప్రవచనాలు ఎంతవిన్నా తనివితీరదు. అంత ముచ్చటగా వుంటాయి. పరభాషావ్యామోహాన్ని పోగొట్టడానికి ప్రప్రథమంగా నడుముకట్టినవాడూ ఆయనే; హిందీప్రచారానికివిఘ్నేశ్వరపూజచేసి ప్రప్రథమంగా దారితీసినదీ ఆయనే. ఆయన భాషావేత్త మాత్రమేకాదు. లిపితంత్ర నిష్ణాతుడుకూడ. లిపి పరిజ్ఞానంలో ఆయన ప్రత్యేక ప్రావీణ్యమే సంపాదించాడు.

అనుచరులమీదా, సహచరులమీదా ఆయనకు అపారమయిన విశ్వాసము. మెచ్చాడంటే మెప్పుల వర్షం కురిపించాడన్నమాటే. పదహారేండ్ల బాలప్రాయపు సత్యాగ్రహిబాలిక వల్లియమ్మనుగురించీ, తన

ఆప్తసహచరులైన మహాత్ములు గాంధీని గురించి ఆయన ఆడిన ప్రశంసావాక్యాలు ఒక్కసారి చదివిచూడండి. అవి వట్టి ప్రశంసావాక్యాలుమాత్రమే కాదు. కమ్మని కావ్యాలు. సారస్వతంకింద జమకట్టవలసిన సాహిత్య గంధం వెలయించే విశిష్టరచనలు.

కావలిస్తే గాంధీజీ ఇన్ని విశ్వరూపాలకూ ఫోటోలు సంపాదించవచ్చు. బారిష్టరుగాంధీ, దక్షిణాఫ్రికా సత్యాగ్రహిగాంధీ, గావంచాలగాంధీ, సైకిల్ గాంధీ, దండీయాత్ర నాటి చేతికర్రగాంధీ, టెలిఫోను గాంధీ, సూక్ష్మదర్శినిని పట్టుకొని రోగక్రిమి పరిశీలన చేస్తున్న విజ్ఞానశాస్త్రి గాంధీ— ఒకటేమిటి, ఎన్ని రూపాల్లో కావలిస్తే అన్ని రూపాల్లో సాక్షాత్కరిస్తాడు.

ఆయన ఉద్యమాలను సునిశితంగా పరిశీలించి చూస్తే చాలు వాటిలోని అసాధారణ తంత్రమంతా తెలుసుకోవచ్చు. ఆయన చేసిన ఉపవాసాలను పట్టి కట్టితే చాలు ఒక్క పురుషాయుషంలో నేర్చుకోదగిన వేదాంత తత్వమంతా ఇట్టే బోధపడిపోతుంది.

మొత్తానికి గాంధీజీ జీవితం ఒక చిత్రదర్శిని గొట్టంలాంటిది. విశ్వరూపాలు వెలయించి వెల్లడించడంలో దానికదే సాటి. దాని స్వభావపారశ్యాన్ని, శాంతి అన్వేషణలో కనికర మనే మాటకు కూడా ఆస్పదమివ్వకుండా అది పోతున్న స్థిరమైన పోకడనూ బాగా గమనించిన తర్వాత ఎట్టివారయినా "ఆహా! ఎంత అద్భుతమయిన జీవితంరా ఆయనది!" అని ఆశ్చర్యపడక తప్పదు.



జాతీయధర్మపునరుద్ధారకుడు

సత్యయుగ ప్రతిష్ఠాపనాచార్యుడు

✿

= శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు =



సుప్రసిద్ధ ప్రపంచ చరిత్రకారుడును హెచ్. జి. వెల్సుపండితుడు యుద్ధానంతరము ప్రతిష్ఠింపబడనున్న 'మానవహక్కులను' ప్రకటించి వాటిమీద అభిప్రాయములను తెలుపవలెనని వివిధదేశములలోని ప్రాజ్ఞులను కోరగా చాలమంది తమతమ అభిప్రాయములను ప్రకటించియున్నారు. భారతదేశపు నాయకు

డైన మహాత్మాగాంధి యొకకే "మానవహక్కులను గూర్చి మీ రింతగా శ్రమపడుచున్నారు. మానవధర్మములనుగూర్చి ఒక్కమాటైన ఈ ప్రకటనలలో లేనేలేదే. మానవుల యొక్కయు, మానవజాతులయొక్కయు ధర్మము లేవో వారు తెలిసికొని వారా ప్రకారము నడచుకొనినచో మానవకోటిలో సుఖము, శాంతి యేర్పడగలవు" అని వెల్సుగారికి వ్రాసినారు. ఆయన చాల సంతోషమును పొందినాడు. ఇదియే పాశ్చాత్య నాగరికతాతత్వమునకును, భారతజాతీయసంస్కృతికిని గల ప్రధానభేదము. అక్కడ ప్రతిమానవుడును మానవసంఘమును, మానవజాతియు తనతన ధర్మములనుగూర్చి యోచించక ఎల్లప్పుడు తనతన హక్కులనుగూర్చి మాత్రము పోరాడుచుండుటవలన స్వార్థపరత్వము, ద్వేషము, రక్తపాతము, అశాంతి యేర్పడుచున్నది. సాహుకారుతత్వము, సామ్రాజ్యతత్వము, తెల్ల నల్ల రంగుభేదము, కమ్యూనిజము, ఫాసిజము అన్నియు పాశ్చాత్యనాగరికతాతత్వముయొక్క రూపాంతరములు. ఇందులో అన్నిటికంటె క్రూరమైనది ఫాసిజము. భారతజాతీయసంస్కృతిలో నెక్కడ వెదకి చూచినను 'ధర్మము' 'ధర్మనిర్వహణము' 'ధర్మసంస్థాపనము'లను తత్వములే కనపడును. అందువలన స్వార్థరాహిత్యము, ప్రేమ, అహింస, శాంతి యేర్పడుచున్నవి. భారతజాతీయసంస్కృతిని బోలియున్నదే చైనాజాతీయసంస్కృతికూడ. మన దేశములోని వేదవ్యాసులవారి వంటివాడు అచటి కన్ఫ్యూషియసు అయియున్నాడు. భారతజాతీయసంస్కృతియొక్క గొప్ప నిర్మాణకర్త వేదవ్యాసులు. చైనాజాతీయసంస్కృతియొక్క గొప్ప నిర్మాణకర్త కన్ఫ్యూషియసు. జపాను ప్రథమమున చాలకాలము చైనాయొక్క నాగరికతను, ధర్మమును అనుష్ఠించి, కొంతకాలమునుంచి కేవలము పాశ్చాత్య నాగరికత నవలంబించి సామ్రాజ్యవాదియై ఫాసిస్టుయి మిగుల క్రూరత్వమును ప్రదర్శించుచున్నది. చైనాను మ్రింగవలెనని, ప్రక్కదేశముల నన్నిటిని ఆక్రమించవలెనని అధర్మయుద్ధములో ప్రవేశించినది. జపానుకు సొంత నాగరికత, సొంత సంస్కృతి లేదు. జపాను స్వధర్మమును విడిచి కేవల మితరజాతుల ననుకరణము చేయుటవలన అధః పతితమగుచున్నది. భారతదేశముయొక్క నాగరికత సంపూర్ణమైనది, సర్వతోముఖమైనది, ఐహికాముష్మికప్రదమైనది. భారతీయవిజ్ఞానమునకు, సంస్కృతికి ప్రాతిపదికము, పునాది ఇప్పటికి ఏడువేలసంవత్సరముల పై కాలమున పుట్టిన ఉపనిషత్తులు. తర్వాత చాలకాలమునకు పుట్టిన బుద్ధభగవానుడు ఉపనిషద్ధర్మముల పునరుద్ధరణమునకే తన మతమును వ్యాపింపజేయుటవలనను, ఆబౌద్ధమతమే భారతదేశమునుండి చైనాకు కొనిపోబడి చైనాయొక్క జాతీయమతముగ నవలంబించబడుటవలనను, పూర్వమున్న కన్ఫ్యూషియసుతత్వమును, పిమ్మటవచ్చిన బౌద్ధతత్వమును సమ్మేళనముగావించి చైనాజాతీయతత్వముగ గావించబడుటవలనను చైనాజాతి భారతజాతిని తనకు గురువుగ నేటికిని గౌరవించుచున్నది. చైనాయొక్క నాగరికత, సంస్కృతికూడ సంపూర్ణమైనది. సర్వతోముఖమైనది. ఐహికాముష్మికప్రదమైనది. భరతవర్షము, చైనాదేశము రెండు ప్రక్కదేశములు. ప్రపంచములోకి పెద్దదేశములు. ప్రపంచములో కెల్ల పురాతననాగరికతను కలిగి వేలకువేలసంవత్సరములుగ స్వతంత్రమును, అఖండైశ్వర్యమును అనుభవించి సమస్త ప్రకృతిశాస్త్రములను, కళలను, శిల్పములను, పరిశ్రమలను వృద్ధిచేసికొని లోకములో నగ్రస్థానమును వహించి మిగుల బలిష్ఠమైన దేశములుగ నుండెను. ఇట్టి రెండు మిగుల బలిష్ఠమైన ప్రక్కదేశము లెప్పుడును ఈ వేలకు వేలసంవత్సరములలో ఒకదానితో నొకటి యుద్ధము చేసి యెరుగవు. ఈరెండు గొప్పజాతులును మానవ చరిత్ర పుట్టినప్పటినుండి నేటివరకును స్నేహముగను, సౌభ్రాతృత్వముతోను, శాంతముగను నివసించుచున్నవి. ఒకదానినుండి రెండవది నేర్చుకున్నవి. పరస్పరసహకారము సలిపి మానవవిజ్ఞానాభివృద్ధికి తోడ్పడినవి. మత దుస్సహనము నెరుగవు. ఇతరమతముల నెప్పుడును గౌరవించినవి. వాల్టేరు మహాశయుడు మొదలగువారు జ్ఞానసూర్యుడు ప్రప్రథమమున ప్రాచీన తూర్పుజాతియగు చైనాలో నుదయించినాడనియు, చైనాయొక్క విజ్ఞానమును పాశ్చాత్యులు నేర్చుకొనవలెననియు వ్రాసియున్నాడు. చైనాయొక్క గ్రంథములు ఫ్రెంచిభాషలోనికి విరివిగ తర్జుమాచేయబడినవి. భారతీయవిజ్ఞాన వేదాంతగణిత జ్యోతిష వైద్య ప్రకృతి శాస్త్రాదిగ్రంథ

ములు అరబుదేశములకుపోయి అచటనుండి అజ్ఞానమంతయు పాశ్చాత్యదేశములకు ప్రసరించినది.

ఈ భారతీయ చైనాజాతులు రెండును ఎల్లప్పుడును సఖ్యముతోను సౌభ్రాతృత్వముతోను నుండుటకు కారణమేమి? ఈ రెండుజాతుల నాగరికతలకు, సంస్కృతులకు మూలసూత్రము, పునాది ధర్మమైయున్నది. "ధనముకన్నను రాజ్యము కన్నను ధర్మమే ఎక్కువది", "స్వధర్మే నిధనం శ్రేయః-అనగా ప్రతిజాతియు తనధర్మమును తాను నిర్వహించవలెను." "సర్వేజనాస్సుఖినోభవంతు - అందరు మానవులు, అన్ని జాతులు సుఖముగా నుండవలెను" అను ఆధ్యాత్మికధర్మములమీద ఈ రెండు జాతుల సంస్కృతులు, నాగరికతలు పుట్టి పెరిగి మహావృక్షము లయినవి. పాశ్చాత్యనాగరికత, సంస్కృతి కేవలము ఐహికమైనవి. ఆధ్యాత్మికతత్వమును నిర్లక్ష్యముతో విడిచివేసినవి. రష్యాలోని కమ్యూనిస్టులు ఆధ్యాత్మికతత్వము మానవులకు నష్టదాయకమనియు, దానిని విడిచివేయవలెననియు తీవ్రముగా బోధనలుకూడచేయుచున్నారు. పాశ్చాత్యనాగరికతలో ధనసంపాదనమే ప్రధానమై సాహుకారుతత్వము పుట్టినది. పెద్దపెద్ద యంత్రశాలలుస్థాపించబడితమ దేశముల అవసరములకన్న ఎన్నోరెట్లెక్కువగ పారిశ్రామిక సరుకు ఉత్పత్తిచేయబడుచున్నవి. వాటి కొరకు ప్రపంచపు అంగళ్లు, ఇతర దేశములలో పాశ్చాత్య సాహుకార్ల పెట్టుబడులు, రైళ్లు, స్టీమర్లు, మోటార్లు, సామ్రాజ్యతృష్ణ, సామ్రాజ్యజాతులలో పోటీలు, యుద్ధములు, ప్రపంచయుద్ధములు సాగుచున్నవి. పాశ్చాత్యనాగరికత పుట్టి అయిదు వందల సంవత్సరము లింకను కాలేదు. ౧౪౫౩లో ప్రారంభమైన మానసికవికాసమే దాని తల్లియని చెప్పనొప్పును. మానవ చరిత్రలోని ఈ స్వల్పకాలములో యూరపుఖండములోని ప్రక్క దేశము లెప్పుడును శాంతముగ నివసించి యెరుగవు. ఇంగ్లాండు, స్పెయిను, డచ్చి, ఫ్రాన్సు, జర్మనీ, ఆస్ట్రియా, ఇటలీ, రష్యాదేశముల మధ్య ఈ కాలములో ఎన్ని యుద్ధములు జరిగినవి? యుద్ధములు జరుగుటయో, లేక మరల యుద్ధముల కొరకు కుట్రలలో నిరంతరము జరిగినవి. సాహుకారుతత్వముపై తిరుగుబాటుగా పుట్టిన రష్యా కమ్యూనిజము కూడా నిరంతర ద్వేషము, వర్గపోరాటము, ఇతరవర్గములపై పశుబలము ప్రయోగించి వారిని నాశనము గావించవలెనను సిద్ధాంతము, రక్తపాతమయమైన విప్లవములు, అభిప్రాయ భేదములుగల వారిని క్రూరముగ హింసించుట, నియంతృత్వము, ఎల్లప్పుడును యుద్ధములకు తయారగుచుండుట మొదలగు వాటి మీదనే ఆధారపడి, అది పుట్టి పాతిక సంవత్సరములైనను బహుకఠినమైన సైనిక నియంతృత్వములోనే సాగుచున్నదిగాని యింతవరకును చల్లని శాంతమైన స్వతంత్రముగల ప్రజాభిప్రాయము మీద సాగుటలేదు. ఈ ప్రజాభిప్రాయము చల్లగను, శాంతముగను ప్రబలుటలో ఇంగ్లాండు అమెరికా జాతులు సోవియటు రష్యా కన్న అనేక రెట్లు నయముగ నున్నవి. ఇక ఫాసిజమును స్థాపించ యత్నించిన జర్మనీ, ఇటలీ, స్పెయినుల సంగతి చెప్ప నక్కరనే లేదు. అయితే అది యొక్క సిద్ధాంతముమీద నిర్మాణము గావింపబడినది కాదు గనుక ఈ ప్రపంచ యుద్ధములో నది పూర్తిగా నాశనమై మరల తలయెత్త నేరదు. ఇటుల పాశ్చాత్య నాగరికత, కమ్యూనిస్టు నాగరికత కేవలము ఐహికమై ఆధ్యాత్మికమైన ధర్మ సంస్థాపన యొక్క పునాదులు లేనివైనందున మానవజాతులలో సోదరత్వమును, ప్రేమను, శాంతిని కలిగించ లేకున్నవి.

భారతీయ చైనానాగరికతల పునాది యగు ధర్మసంస్థాపనా ఆధ్యాత్మికతత్వమే స్వతంత్రమును కోల్పోయి విదేశదాస్యము ననుభవించుచున్న జాతులకు రాజ్యలక్ష్మిని మరల ప్రసాదించుటకును, ఈ యుద్ధము ముగిసిన పిమ్మట జాతు లన్నిటికి స్వతంత్రము, సౌభ్రాతృత్వము, ప్రేమను కలుగజేసి మరల ఎన్నటికిని యుద్ధములు, స్వతంత్రపోరాటములు, సాంఘిక పోరాటములు కలుగకుండ మానవకోటిలో శాశ్వతశాంతిని స్థాపించుటకును తోడ్పడగలదు. గాంధిమహాత్ముడు ఈధర్మసంస్థాపన కొరకు జన్మించిన మహాపురుషుడు. ఉపనిషద్ధర్మము లన్నియు ఆయనలో మూర్తీభవించిన మహాఋషి. ప్రపంచములో నేర్పడనున్న సత్యయుగమున కాయన స్థాపనాచార్యుడు. భారతదేశము విదేశపాలనముక్రింద కోల్పోయిన జాతీయ స్వతంత్రమును,

విదేశనాగరికతా వ్యాపకమువలన అణగఁగొట్టబడిన ఆర్థిక సంపత్తిని, విజ్ఞానమును, ధర్మమును, నాగరికతను పునరుద్ధారణ గావించి మరల భారతదేశమునకు లోకములో గురుపీఠమును స్థాపించుటకు ఆయన నాయకత్వము వహించియున్నాడు. ఒక గొప్ప చైనా విద్వాంసుడు చెప్పినట్లు పేదరికమును స్వీకరించి అంగవస్త్రమును ధరించి, మట్టి గుడిసెలో కాపురముండి, సత్యము అహింస ప్రేమ ఈశ్వరభక్తి సేవ త్యాగముల మూర్తియై ఆధ్యాత్మికజ్ఞానసంపన్నుడైన గాంధివంటి ఋషిపుంగవుణ్ణి, రాజకీయ ఆర్థిక వ్యవహారములలోకూడ తమ నాయకునిగా అంగీకరించుట భరతవర్షము మాత్రమే అంగీకరించుచున్న పనిగాని ఏ పాశ్చాత్యదేశము నిట్టిదానిని అంగీకరించు విషయము కాదు. పాశ్చాత్యదేశములకు కేవలము ఐహికమైన వారి జాతీయతత్వమునకు సరిపడిన చర్చిలు, స్టాలిన్, రూజువెల్టు వంటి నాయకులు కావలెను. భరతవర్షమునకు తన ఐహికాముష్మికప్రదమైన జాతీయధర్మమునకు, జాతీయతత్వమునకు తగిన నాయకుడైన మహాత్మగాంధియే కావలెను. భారతదేశములోని కోట్లకొలది ప్రజలకు ఆయనయందే పరిపూర్ణ పూజ్యభావము కలదు.

ఆయన కిపుడు డెబ్బదిఅయిదు సంవత్సరములు నిండినవి.

కుర్వన్నేవేహ కర్మాణి
జిజీవిషేచ్ఛతగ్ం సమాః
ఏవంత్వయి నాన్యథేతో౽స్తి.

ఈశావాస్యోపనిషత్. ౨.

తా. ఈజగత్తునందు మంచి కర్మలను చేయుటకొరకే, అనగా సంఘమునకును, మానవజాతికిని, సర్వభూతములకును సేవాధర్మమును నిర్వర్తించుటకొరకే మానవుని ఆయుఃపరిమాణమును నూరుసంవత్సరములు పూర్తిగ జీవించియుండవలెనని నీవు కోరవగియున్నది. అటుల గానిచో నది వ్యర్థపు జన్మ. ఈసేవాధర్మము నీయందుంచబడినది. ఇంతకన్న మార్గాంతరము లేదు.

అథయత్తపోదాన మార్జవ
మహింసా సత్యవచనమితి
తా అస్య దక్షిణాః.

ఛాందోగ్యోపనిషత్, ౩-౭-౪.

తా. తపస్సు, త్యాగము, సర్వసమత్వము, అహింస, సత్యము లనునవియే ధర్మస్వరూపుడైన పరమేశ్వరుని యొక్క యుద్దేశ్యమైన ధర్మసంస్థాపనాకార్యములో ఆత్మార్పణము గావించుట యను మహాయజ్ఞమునకు దక్షిణలు. అనగా సాధనములు. మాతృదేశముయొక్కయు, మానవజాతి యొక్కయు కష్టనివారణకొరకు కృషిసలుపుట ధర్మసంస్థాపనమై యున్నది.

తచ్ఛ్రేయో రూపమత్యసృజతధర్మం
తస్మాద్ధర్మాత్పరం నాస్తి; అథో అ
బలీయాన్ బలీయాంసమాశంసతే
ధర్మేణ; యోవై స ధర్మః సత్యం వై తత్.

బృహదారణ్యకోపనిషత్, ౧-౪-౧౪.

తా. పరమేశ్వరుడు ధర్మము అను ఉత్కృష్టమైన రూపమును దాల్చెను. ధర్మము పరమేశ్వరునియొక్క స్వరూపము. కావున ధర్మముకన్న ఎక్కువైనది, శ్రేష్ఠమైనది మరియొకటి లేదు. తనపక్షమున ధర్మమును గలవాడు ఎంతటి బలహీనుడైనను ధర్మముకొరకు పోరాడి అవతలవైపున ఎంతటి బలవంతుడు వచ్చినను ఆబలవంతుని ఓడించగలడు. ధర్మపక్షమున పోరాడువారికి జయముతప్పదు. ఇది ఈశ్వరశాసనము. ధర్మమే సత్యము.

ఉపనిషద్ధర్మములమూర్తియైన గాంధిమహాత్ముడు నూరు సంవత్సరములు పూర్తిగాజీవించి సంపూర్ణమగు ఆరోగ్యమును కలిగియుండి భారతదేశమును, మానవకోటిని ఉద్ధరించుమగాక.

కలిగ  గాంప

నవద్వీపంలో మెప్పులుపొందిన ఆంధ్రమహాపురుషుడు

ఆయన శేముషీ విశేషాలు

ఆ కవికుమారునికి ఇరవై సంవత్సరాల ప్రాయము.

"నాహ మిహ యాచే ముక్తిమపి దేవ. దేశకుశలాయ ప్రార్థయతి శక్తిం" అన్న మనోనిశ్చయంతో కాశీకి తపస్సుకు వెళ్లేడు.

"సర్వమపి తపసా సాధ్యం" అని నిశ్చయము. సుప్రసిద్ధశివకుమారపండితులు కవివాగ్వైభవం చూచి నవద్వీపం వెళ్లమని ప్రోత్సహించేరు.

నవద్వీపం పండితులకు నికషం. దానికి పరీక్షార్థి మహాజరుపెట్టేడు. దానిలో మొదటిపద్యం వాల్మీకంలోది:

"దేవాసురసమీకేషు బహుశో దృష్టవిక్రమః" అని.

అనుమతిపత్రంతోపాటు నవద్వీపపరిషత్తులో ప్రవేశించేడు.

మనిషి అర్భకుడు. బక్కపలచగా ఉంటాడు. ఈకవిని చూచి పరిషత్తులో గుసగుసలు బయల్దేరేయి. సభాధ్యక్షుడు అంబికాదత్తుడు. దీర్ఘస్థూలగాత్రుడు. గౌరవర్ణుడు. శితికంఠవాచస్పతి కార్యదర్శి. ప్రేక్షకులు మహామహు లున్నారు. పరీక్షాధికారులు సర్వశాస్త్రపారగులు. నవద్వీపపట్టం పొందేడంటే దిగ్విజయం చేసేడన్నమాటే.

సభలో ప్రవేశించడంతోటే అధ్యక్షుణ్ణి నిర్దేశించి "కోసౌ మహాశయః" అని ప్రక్కవాణ్ణి ప్రశ్నించేడు కవికుమారుడు. అధ్యక్షుడు తానే సమాధానాన్ని ఇస్తూ పరీక్ష ప్రారంభించేడు:

అంబికాదత్తుడు—"సత్వరకవితాసవితా గౌడః కో ప్యంబికాదత్తః"

కవికుమారుడు—"గణపతిరితి కవికులపతి రతిదక్షో దాక్షిణాత్యోహం"

అని శ్లోకాన్ని పూరించి "భవాన్ దత్తః. అహం త్వౌరసః" అని చమత్కరించేడు. పరీక్ష ఆరంభించింది. మొదటిది సమస్యాపూరణం.

౧. "స్తనవస్త్రం పరిత్యజ్య వధూః శ్వశురమిచ్ఛతి"
(క్రిస్త్వవద్యచరిత్రా)

పూరణము—

"హిడింబా భీమదయితా నిదాఘే ఘర్మపీడితా
స్తనవస్త్రం పరిత్యజ్య వధూః శ్వశుర మిచ్ఛతి"

౨. "వత్సరస్యైకదా గౌరీ పతివక్త్రం నపశ్యతి"

పూరణము—

"భాద్రశుక్లచతుర్థ్యాంతు చంద్రదర్శనశంకయా
వత్సర స్యైకదా గౌరీ పతివక్త్రం నపశ్యతి."

౩. "సూర్యః శశాంకేనసమం వినష్టః"

పూరణము—

"రాహు స్త్రికోణేచ గురు స్తృతీయే
కళత్రభావేచ ధరాతనూజః

లగ్నేచ కోష్ఠే యది చాలకస్యాత్
సూర్యః శశాంకేన సమం వినష్టః"

౮. "పిపీలికా చుంబతి చంద్రబింబం"

పూరణము—

"సతీవియోగేన విషణ్ణచేతసః
ప్రభోః శయానస్య హిమాలయే గిరౌ
శివస్య చూడాకలితం సుధాశయా
పిపీలికా చుంబతి చంద్రబింబం"

ఈసమస్యాపూరణంతోటి ప్రక్కల జరుగుతూ ఉండే శాస్త్రపరీక్షలు ఆపేసేరు. అందరూ ఇక్కడే కేంద్రీకరించేరు. ఇంతవరకూ ఐదునిముషాల్లో సమస్యాపరీక్ష పూర్తిఅయింది.

రెండవది వ్యాఖ్యానపరీక్ష. రెండు శ్లోకాల వ్యాఖ్యానం సంస్కృతంలో చేయమన్నారు. మొదటిది "స్తుమః కం వామాక్షి" అనే కావ్యప్రకాశోదాహృత శ్లోకం. రెండవది "నమృగయాభిరతిః" అనే రఘువంశ శ్లోకం.

కలా నిముషాలు మొదటి వ్యాఖ్యానం అయింది. రెండవది ప్రారంభించేరు. "సాం" అనే అంత్యప్రాసతో వ్యాఖ్యానం సాగుతూంది. సభ చేష్టదక్కింది. ఆ వాణీనాట్యం సమ్మోహపరచింది. అలాటి సమయంలో ఎవరో వాక్స్తంభనమంత్రం ప్రయోగించేరంటారు. పండితులకు అసూయ సహజంకదా! కవికుమారుడు "సర్వాసాం" అనడానికి అంత్యప్రాసకై "సర్వేషాం" అని ప్రయోగించి మళ్లీ దిద్దుకుని "సర్వాసాం" అన్నాడు.

అధ్యక్షులు ఆపేసేరు వ్యాఖ్యానాన్ని. ఆపి ఇలా అన్నారు:

"అనవద్యే నను పద్యే
గద్యేహ్యాద్యేపి స్ఖలతి తే వాణీ,
తత్కిం త్రిభువనసారా
తారా నారాధితా భవతా"

గణపతి అందుకొని "సారః, అనడానికి ప్రాస కొరకు 'సారా తారా' అని ప్రయోగించేరు. ఇది అసాధుప్రయోగము" అని సంస్కృతంలో అధిక్షేపించి—

"సుధాం హసంతీ మధుచాక్షిపంతీ
యశోహరంతీ దయితాధరస్య
నతేల మాస్యం కవితాం కరోతి
నోపాస్యతే కిం దయితార్ధదేహః"

అని ఆక్షేపించేసరికి అధ్యక్షులకు కోపం హెచ్చింది.

అంబికాదత్తుడు—

"ఉచ్చైః కుంజర! మాకార్షీః
బృంహితాని మదోద్ధత!
కుంభికుంభామిషాహారీ
శేతే సంప్రతి కేసరీ"

గణపతి—"పునశ్చ దోషః. న కర్మధారయాన్మత్వర్థీయః కుంభికుంభామిషాహారీ కేసరీ ఇతి ప్రాసాయాసాధు ప్రయుక్తం.

సమాసీనో రసాలేచే
న్మానమావహ హే కవే
లోకః కరోతు సత్కారం
మత్వా త్వామపి కోకిలం"

అంబికాదత్తః—

"జ్యోతిరింఖణ సకిన్ను మన్యసే
యత్త్వమేవ తిమిరేషు లక్ష్యసే"

గణపతి—

"కిన్ను దీపభవనే విరాజసే
వాయునా బహిరితో విధూయసే"

ఆ వీరవిహారాన్ని చూసి సభాప్రవర్తకుడు శితికంఠవాచస్పతి లేచి "మీ వాగ్వాదము వ్యక్తిగతమైనా ఆనందాన్నిస్తుంది. అది జాతిగతంగా మార్చి ఈ వ్యాఖ్యాపరీక్షను ముగించవలసింది" అని కోరేడు.

అంబికాదత్తుడు—

"భట్టోయమట్టోపరి వారవద్యా
నిపేయమధ్యారభతే నితాంతం"

గణపతి—

"అసువ్యయో వాస్తు వసువ్యయో వా
అమానమానవ్యసనం త్యజంతి"

సభాపతి సింహాసనం దిగి కవికుమారుణ్ని కౌగలించేడు. పరిషత్తుకూడా నిలిచింది. అధిపతి కన్నీరు నించి ఏమో పలకబోయేడు. కంఠం రాలేదు. కవికుమారుడు "వాదేస్మి వ్వమ వయోపరాధాః క్షంతవ్యాః" అని అన్నాడు.

తరువాత పరీక్ష తన యిష్టంవచ్చినది చెప్పడం, సభ వినడం. గురుశిష్యభావంలా జరిగింది.

సభ ముగిసింది. అప్పుడిచ్చిన (క్రీ. శ. ౧౯౦౦) ప్రశంసాపత్రంతాలూకు నకలు:—

"నవద్వీపపండితైర్దత్తం ప్రశంసాపత్రం—శ్రీమద్గణపతిశాస్త్రిన్! సంసారే ఖల్వస్మిన్ కవిత్వమిత్య సముద్రసముద్భవ మమృతం. సుదుర్లభంచ. తత్ లోకాధికసౌభాగ్యవశాత్ సుప్రసన్నదైవానుకంపయావా యఃకశ్చి దిహ సమధికరుతే సచ భూయోపి స్వర్గీయ ఇతి సస్పృహ మాలోక్యమానో గుణపక్షపాతిభి ర్విద్వద్భి ర్నితరా మాద్రియతే.

అతో యదద్య శ్రీమద్భి రసాధారణకవిత్వ మిహ ప్రకటయ్య సుధియ స్సర్వే సంతోష మాపాదితాః, తేనైవ చరితార్థా నవద్వీపవాసినః కోవిదా వయం అశేషగుణైకధామ్నే విశాఖపట్టణ ప్రదేశాంతర్గత కలవరాయి గ్రామవత్సరేయే శ్రీమద్గణపతిశాస్త్రిణే తుభ్యం ఆశీర్వాదపూర్వక మిమం శ్లోక ముపహరామః :

ప్రాచీనై స్సైః కవికులవరైః
కాళిదాసాదిభిర్యా
లబ్ధా కీర్తి ర్భవదనుగతా
సైవ భూయా దిదానీం
సద్భి ర్దత్తో య ఇహ రుచిరః
కావ్యకంఠోపహారః
తేన శ్రీమా నిహ భువి భవా
నుజ్వలశ్చాపి భూయాత్.

శ్రీయుత రాజకృష్ణతర్కపంచాననః

(ఇంకా పదునాల్గురుపండితుల సంతకములు కలవు)"

ఈ కవికుమారుడు ఆంధ్రుడు. ఆంధ్రదేశీయ ద్రావిడి.చాలాకాలం అరవదేశంలో నివసించేడు. ఇతని విజ్ఞానాన్ని, బోధను అరవలనుభవించినంత ఇంకెవరూ అనుభవించలేదు. తరవాత కన్నడులు తమ దేశం తీసుకొనిపోయేరు; వీరి జ్ఞానోపదేశాల్ని పొందేరు. తరువాత బెంగాలీలు తీసుకుపోయి, వారు ఆలాభాల్ని పొందేరు. ఆ వంగదేశంలోనే వీరు పరమపదించేరు. వీరు అరవదేశంలో కాంగ్రెసుపక్షానికి ప్రెసిడెంటుగా ఎన్నుకోబడి బెల్గాం కాంగ్రెసుసభలో గాంధీగారి అధ్యక్షతక్రింద ఉపన్యసించేరు. ఈతని జీవితంలో జరిగిన లోకసేవ, ఇతని చరిత్ర మొదలైనవి అరవదేశీయులు 'వాశిష్ఠవైభవం' అనే పేరుతో గ్రంథం వ్రాస్తూఉన్నారు. వీరి రచనలుకూడా దేశమంతటా గాలించి సంగ్రహిస్తున్నారు. ఈ విజ్ఞానరత్నం తమదే అని చెప్పుకోడానికి తగినంత తీరులో వారు పరిశ్రమ చేస్తూఉన్నారు. ఇప్పటికి వీరి గ్రంథాలు చాలావరకు వారే అచ్చువేయించి ప్రచారంలోకి తెస్తున్నారు. భారతిమాత్రము శ్రీవారి 'పూర్ణ' అను నవలను ప్రచురించింది. దానికి ఆంధ్రులు భారతికి కృతజ్ఞులు కావలసినదే. ఈ కవికుమారుడు శ్రీ కావ్యకంఠ వాసిష్ఠ అ. గణపతిమహాముని. ఈతని గ్రంథాలను నాకు తెలిసినంతవరకు చెప్పుతాను: ఉపేక్షచేయక ప్రచురణ కోసం ప్రయత్నం చేయడం ఆంధ్రుల విధి.

౧. ఋగ్వేదభాష్యము, ౨. ఋగ్వేదమునందలి భారతకథ(వ్యాసభారతములోనిసంశయవిచ్ఛేదము దీవ జరుగును. నాటి సంఘజీవనము స్పష్టపడును), ౩. విశ్వమీమాంస*, ౪. మహావిద్యాసూత్రము*, ౫. పంచజనచర్చ*(హరిజనులు అంటరానివారు కారు అని శాస్త్రప్రమాణముతో నిరూపింపబడినది), ౬. యోగసారము*, ౭. గాయత్రీవ్యాఖ్యానం*, ౮. కృష్ణవ్యాఖ్యానం*, ౯. సీతావ్యాఖ్యానం*, ౧౦. యోగవ్యాఖ్యానం*, ౧౧. కౌలవ్యాఖ్యానం*, ౧౨. త్రిపుట్యుపాఖ్యానం*, ౧౩. గురుమంత్రభాష్యము*, ౧౪. ఇంద్రసహస్రనామము (వేదములోని ఇంద్రనామముల కూర్పు),౧౫. అక్షరావళి*, ౧౬. తత్వఘంటాశతకం*, ౧౭. పూర్ణ (సంస్కృతనవల), ౧౮. జైమినీయ తర్కవార్తికము*, ౧౯. ప్రమాణచర్చ*, ౨౦. ప్రాణితోషణము (వైద్యగ్రంథం), ౨౧. జ్యోతిష

పారము, ౨౨. గోత్రప్రవరనిర్ణయము*, ౨౩. రాజయోగసూత్రములు*, ౨౪. వివాహధర్మసూత్రములు*, ౨౫. ఇంద్రేశ్వరాభేదసూత్రం*, ౨౬. రుద్రకుటుంబసూత్రం*, ౨౭. సృష్టిసూత్రం*, ౨౮. క్రియాశక్తిమీమాంస*, ౨౯. ఈశ్వరమీమాంస*, ౩౦. ఆత్మోపాఖ్యానము*, ౩౧. జీవోపాఖ్యానం*, ౩౨. ఇంద్రాణీసప్తశతి.

అచ్చయినవి:— ఉమాసహస్రం, రమణగీత, రేణుకాగీత, గీతమాల, రమణచత్వారింశత్, పూర్ణ (తెనుగు).

*ఈ గుర్తుగల గ్రంథములు నావద్దనున్నవి.


నాకు ఇప్పటి జ్ఞాపకంలో ఉన్నవి రాసేను. నాకు తెలీనివి ఎన్నో ఉన్నాయి. అవి గాలించి వెతికి కూర్చవలసియున్నది.

అరవదేశంలో ఈతనిని గణపతియవతార మని నమ్మి ఆరాధించేరు. ఈతని పరిచయం గల ప్రతివాడూ ఈవిషయాన్నే అంగీకరించేడు. ఈతనికి శాస్త్రాలు కేవలం చదివి విషయజ్ఞానం తెలుసుకోవడం కాకుండా అనుభవజ్ఞానం ఉండేది. "వ్యపోహ్య శీర్ష కపాలే" అన్నట్లు కపాలభేదము యోగాభ్యాసంచేత సిద్ధించిన వ్యక్తి. ఈతని శాస్త్రగ్రంథాలలో ఆ అనుభవం ప్రత్యక్షమవుతుంది. "యస్మిన్నిదం శరీరం భవతి మహా దైవద్యుతాగ్నియంత్రమివ" అన్నట్లు ఈతని శరీరం మంత్రచైతన్యప్రవాహపూరితము. రాగి ఈతని శరీరసంపర్కం పొంది కొంచెంసేపుంటే స్వర్ణచ్ఛాయతో ఒప్పేది. అటువంటి కానులు ఇప్పటికీ చాలామంది దేవతార్చనపెట్టెల్లో భద్రపరచుకొన్నారు.

లోహసంపర్కం అతనికి వేదనను కలిగిస్తూ ఉంటే పాదుకలు ఉపయోగించడం, కఱ్ఱచెంబులు వాడడం తటస్థించింది.

అలాటి మహామునియనుభవ గ్రంథాలు ఉపేక్షింపబడుతున్నాయి. కారణం?

అ. నరసింహశర్మ.



మహామహోపాధ్యాయ

శ్రీముష్ణం

సేతుమాధవాచార్యులుగారు

ఈ సంవత్సరపు ప్రభుత్వబిరుదప్రదానంలో రాజధానిలోకెల్లా ఏకైకంగా 'మహామహోపాధ్యాయ' బిరుదంతో సత్కరింపబడిన వైయాకరణసార్వభౌములు. తిరుపతివాస్తవ్యులు. చిరకాలము తిరుపతియందలి శ్రీ వేంకటేశ్వర సంస్కృతకళాశాలలో ప్రధానవ్యాకరణాచార్యులుగా నుండి ఈమధ్యనే ఉద్యోగంనుంచి విరమించుకొని విశ్రాంతి తీసుకొంటున్నారు. వీరి తండ్రిగారు శ్రీ సుబ్బరాయాచార్యులుగారుకూడ మహామహోపాధ్యాయులే.

స్వగ్రామతరి

●

— శ్రీ దేశిరాజు వేంకటరమణరావు —

ఆ దాత మృతుఁడు కాలేదు శాసనశిలాఫలకాక్షరసజీవవర్తి యతఁడు
ఆ శిల్పి నశియించె ననరాదు విగ్రహప్రతిభంగిమమునందుఁ బలుకు నతఁడు
ఆ భక్తుఁ డీల్గినాఁ డని కాదు ఘంటాఘణాత్కారమున దాఁగినాఁ డతండు
ఆ యర్చకుండు లేఁడనఁబోవ దుపవనస్తబకాచ్ఛగంధనిశ్వాసి యతఁడు
ఆ జగద్దేవుఁ డపుడిపు డార్ద్రదృష్టి-వేఁడువారికిఁ, దనుఁగూర్చి పాడువారి
కాడువారికి నిచ్చుచున్నాఁడు నేర-మెంత చేసిన నభిమతస్వేచ్ఛ లన్ని.

ఇసుకతిన్నెల పొర లెత్తి దాల్చిన గాలి ఎంత దవ్వేగునో యింత కిపుడు
నీటిలోఁ బడిన కన్నియ గ్రొమ్ముడిసుమమ్ము లెందాఁక పోవునో యింత కిపుడు
పొల్చి యదృశ్యమై మునిఁగిపోయిన మీను లెచ్చోట తేలునో యింత కిపుడు
మిడిసి, పైఁబడు రొయ్య మ్రింగి దాఁటిన కొంగ ఏయొడ్డుఁ జేరునో యింత కిపుడు
జానపదముగ్ధయావతస్నానపూత-లలితచంపావతీరజోమిళితవారి
ఒడ్డొరసి పాలు వంగి నిల్చున్నయట్టి-చెంబులను దీసికొని మేనఁ జిందుకొనఁగ.

గుడిఁగట్టినారటో కొలము వన్నెకుఁ దెచ్చినట్టి వేలుపుపేరఁటాలిపేర
బరిణెతోఁ గుంకుమఁ బరిదాన మిత్తురా పసపునెన్నొసలిపైఁ బ్రభలు తీర్ప
కుట్టద్దమునఁ జూచుకొనునా పవిత్రముఖ మ్మామె లేల నేకతఁపువేళ
ఆఁకలియైనచో నారగించుటకొనమా వడపప్పుతో నరఁటిపండ్లు
పూజ సలిపి, నిశాభర్తృభుజనిబద్ధ-నిజవపూరక్తిమవ్యక్తనిరవధిశ్రు
ధానమస్తము విడిచి నిధ్యానబుద్ధిఁ బల్లెవజరాంద్రు రా వచ్చువారు వీరు.

ఈ చెట్టు నేను జన్మించినప్పటినుండి యిట్లనే యుండు శుష్కించవ దింత
అంతకుఁబూర్వ మెన్న బ్దాంతదివసాంత హేలామరుత్తుల నేలికొననో
తన శాఖకాశిఖాస్థానవీథులఁ బెక్కు జాతిపక్షులకు నాశ్రయము నిచ్చు
నహాన మెంతటిదో అశ్రాంతశకుంతదీర్ఘారావముల కల్గినట్లు లేదు
ఎండఁబడి డప్పిగొని వచ్చి యిచటఁ జూచి-ఆయతమ్మైన యీతరుచ్ఛాయలోనఁ
బథికవర్గము బడలిక వాసి తాము-దూరజనపదముల కేగుదురు వసించి.

ఆదూడ పొదుగు పాలంటక ఎగిరి, మిట్టిపడి కుండెడు పాలు విపులఁ ద్రోసి
దోగ్ధకాల్సందున దూరి నిల్వక లేచి తాటియాకుల కంచె దాఁటి పణవ
మెడద్రాఁడు కట్టిన పుడకకొయ్యఁ బెకల్చి పిడుకకుచ్చెరలు కుప్పించి నడిచి
జొన్నకంకులను రాల్చుచుఁ గొన్ని మోకలు కబళించుకొని చేనిగట్ల నెక్కి-
పాటిపోవుచున్న పాడియావు నదల్చు-కొనుచు చెట్టు పుట్ట గుట్ట యనక
దూర మరిగి, యరిగి, దూలగొండిచివుళ్లు-లాడలు తాఁకఁ గుంటువడె గృహస్థు.



విమర్శనము

గీతాహృదయము

కర్త: డాక్టరు శంకర శ్రీరామారావుగారు, ఆగిరిపల్లి (కృష్ణాజిల్లా). చిన్న సైజున ౭౬ పుటల ఖండ కావ్యము. వెల తెలియదు.

ఇందు గీతాగానమందలి కొన్ని ఘట్టములు గ్రహింపబడి ఆంధ్రచ్ఛందమున చిత్రింపబడినవి. ఆ ఘట్టములు అర్జున విషాదము, సాంఖ్యయోగము, కర్మయోగము, భక్తియోగము, త్రిగుణములు, జ్ఞానయోగము, విశ్వరూప సందర్శనము అనునవి. విషయప్రకటనమునకు తగిన భాష కవిగారి కలమున తిరుగాడినది. కనుక ఈ గ్రంథ మొకసారి పఠించి చూడదగిన దని చెప్పవచ్చును.

గ్రంథాంతమున 'జీవయాత్ర' యను గేయమున్నది. ఇది ఒకసారి భారతిలో ప్రకటిత మైనదే. అట్టి సూచన ఏల చేయబడలేదో, దురవగాహము.

నిర్వికల్పానందస్వామి.

ఉమర్ ఖయాం

రచయిత: మాధవపెద్ది బుచ్చి సుందరరామ శాస్త్రిగారు. ప్రకాశకులు: నవ్యసాహిత్య పరిషత్తు, గుంటూరు. వెల ౧౦ అణాలు.

ఉమర్ ఖయ్యాం రుబాయీలు దిగంతవిశ్రాంతమయిన కీర్తిగడించినవి. ఆకవితాఖండములలో ఖయ్యాం వెలయించిన ప్రేమతత్వమును, ఆనందానుభూతిని కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారు తమ 'పానశాల' మూలముగా మధురమంజుల కవితారూపమున, తీయని ఫణితులతో మన కీవరకే సమగ్రముగాను, యథామూలముగాను చవిచూపియున్నారు. అఖయ్యాంకవితకే ఇది ఇంకొక సుందరస్వరూపము. అందలి సారమును శాస్త్రిగారు స్వేచ్ఛగా సంగ్రహించి, కొద్దిగ్రంథముతోనే 'సూక్ష్మములో మోక్షము' చూపించినారు. వస్తువుతోపాటుగా కవితకూడ కమ్మగా ఉన్నది.

తీర్పు

రచయిత: ధనికొండ హనుమంతరావుగారు. ప్రకాశకులు: శేషు అండు కో., తెనాలి. వెల రూపాయిపావలా.

ఇది రెండు కథలు, మూడు నాటికల ఒక సంపుటి. ఇంచుమించుగా ఇదివరకు బాగుగా వెలుగు చూచినవే. సంపుటిలో దాదాపు మూడు వంతుల పుటలను ఆక్రమించిన 'తీర్పు' అను కథ యొక్కటే ఇందులో కెల్లా ముఖ్యముగా పేర్కొనదగినది; మెదడుకు మేత కల్పించునట్టిది. 'దంపతులు' అను ప్రహసన రూపమయిన నాటిక తరువాతిది. మిగిలినవి గ్రంథపూరణములు.

గ్రంథ స్వీకారము

బొబ్బిలి ముట్టడి

నాటకము. కర్త: కీ. శే. డాక్టరు బుర్రా శేష గిరిరావు పంతులుగారు. ప్రకాశకులు: బుర్రా లక్ష్మణరావుగారు, విజయనగరము. వెల ఒక రూపాయి.

సోమనాథ విజయము

ఆరు రంగముల నాటకము. రెండవ కూర్పు, రచయిత: నోరి నరసింహశాస్త్రిగారు, బి. ఏ., బి. యల్., సాహితీసమితి, రేపల్లె, గుంటూరు జిల్లా. వెల ఒక రూపాయి.

నల్లగలువ

అలెగ్జాండరు డ్యూమాస్ నవలకు ఆంధ్రీకరణము. ఆంధ్రీకర్త: కాటూరి వెంకటేశ్వరరావుగారు

ప్రాప్తిస్థానము : నవ్యసాహిత్య పరిషత్తు, గుంటూరు. వెల ఒకటిన్నర రూపాయ.

ఉదయశ్రీ

ఖండకావ్యముల సంపుటి. కవి: జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు (కరుణశ్రీ). దొరకుచోటు : నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు. వెల రూపాయి పావలా.

---

i భాగ్యలక్ష్మి

ఖండకావ్యము. వెల ౧౨ అణాలు.

ii వేల్పుటావు

ఖండకావ్యము. వెల ౬ అణాలు.

కవి: గొర్రెబత్తుని వేంకటేశ్వరరావుగారు, టీచరు, జాండ్రపేట, చీరాలపోస్టు.

అశ్రుబిందువు

మాచిన్ని రామకృష్ణుడు జననం స్వభానుసంవత్సర జ్యేష్ఠ బహుళ అష్టమి శుక్రవారమునాడు. విశాలమైన ఫాలభాగము. ఆనందచిద్విలాసములు విరజిమ్మే ముఖం.

"సకృత్ప్రణత రక్షాయాం సాక్షీయస్యవిభీషణః
సాపరాధప్రతీకారః సశ్రీరామోగతిర్మమ" అని నమ్మి ఆభగవంతుని పేరే పెట్టుకొన్నాము. సుమారు సంవత్సరం మూడుమాసాలు అల్లారుముద్దుతో పెంచాము. భాద్రపద బహుళ పంచమి గురువారమునాడు ఉదయం ఆభగవంతునికే అర్పించివేశాము.

మాబాల రామకృష్ణుడుమమ్మువిడిచిపోవుట మా దురదృష్టం అని ఏడుస్తూ, వాని ఆత్మశాంతికై ఒక్క అశ్రుబిందువు విడిచేము. అంతకంటె ఏంచేస్తాము?

ఎస్. నరసింహామూర్తి బి. ఎ.
సూపరింటెండెంటు
విశాఖపట్నంజిల్లాబోర్డు

సాభిప్రాయవిశేషాలు

దీర్ఘాయుష్యమస్తు

భారతభాగ్యవిధాతా! జోహారులు.

భారతజాతీయ ధర్మపునరుద్ధారకా! నమస్సులు.

సత్యయుగ ప్రతిష్ఠాపనాచార్యా! ప్రణామములు.

శాంతిదూతా! నమోవాకములు.

75-వ పుట్టినరోజు పండుగ చేసుకొంటున్న నీకు ఇదే మాపూజాంజలి. ఇవే మా మంగళాశాసనాలు.

భగవంతుడు నీకు దీర్ఘాయుష్యమిచ్చి, నీఅవతార ప్రయోజనమును త్వరలోనే సార్థకము చేయుగాతమని మానంప్రార్థన.

నీవు సిద్ధసంకల్పుడవు. నీ ఆత్మశక్తి అమోఘము. నీచేతలు మానవాతీతములు. చేపట్టిన కార్యమును నీవు సాధించితీరుదువు. పొందగోరిన ఫలమును పొంది తీరుదువు. నీకు విజయము తప్పదు. తప్పదు. తప్పదు.

ఆశుభోదయమము నీవు త్వరలోనే కంట్లారా చూడగలవని మా విశ్వాసము. మా ఆకాంక్ష.

భగవంతుడు నీ ఆశయసిద్ధిని సత్వరమే సమకూర్చుగాత!

భారత భాగ్యవిధాతా! చిరంజీవివై వర్ధిల్లుము.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambhu Prasad.

ఇండియన్ టీలలో అత్యుత్తమమైనది



చక్కని రుచి, ఘుమ ఘుమలాడే సువాసన, నేత్ర పర్వంగావుండే రంగు, తక్కువధర, వీటి అన్నింటి నిబట్టి లిప్టన్స్ వైట్ లేబుల్ మిగతా వాటిని తలదన్ని అత్యధిక గౌరవాన్ని తెచ్చుకున్నది.



లిప్టన్స్ వైట్ లేబుల్

మృదు మధురమైన ఇండియన్ లీఫ్ టీ

LTK 84 W